


epaper.vaartha.com WWW.VAARTHA.COM



# వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-10-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 271 పేజీలు: 8+16 వెల: 6.50











శుక్రవారం భారీ వర్షం కురవడంతో హైదరాబాద్‌లోని పివి ఫ్లైఓవర్‌పై వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

## లక్షన్నర కోట్ల ప్రభుత్వ భూములు

# కాపాడాం

### మియాపూర్ భూముల విలువే రూ.50వేల కోట్లు

### ఆ భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనులు

### భూములు కొల్లగొట్టేందుకు కెసిఆర్, బంధువుల యత్నాలను అడ్డుకొన్నాం

### ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు30:** రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 లోని 550 ఎకరాల భూమిపై సర్వహక్కులూ ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు చారిత్రాత్మకమైన తీర్పుగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభివర్ణించారు. దాదాపు రూ. 50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. మియాపూర్‌లోని 550ఎకరాల భూమిపై సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు నేపథ్యంలో పార్లమెంట్ సభ్యులతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రజల గొప్ప విజయమని పేర్కొన్నారు. 'మియాపూర్ భూములు కొల్లగొట్టేందుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన బంధువు దామోదర్ రావు, >>2



శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి వివేక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు

## జనవరి 25 నుంచి

# జనగణన

### భారత్ రిజిస్ట్రార్ జనరల్ వెల్లడి 2



## హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి 2

### నూతన రైల్వే లైన్ల మంజూరుకు అనుమతులు ఇవ్వండి

### రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

## ఫామ్‌హౌస్ పార్టీపై పోలీసుల మెరుపు దాడి 7

### 108 మంది విద్యార్థులు అదుపులోకి..

### ముగ్గురికి డ్రగ్ పాజిటివ్

### భారీగా మద్యం స్వాధీనం

## కోర్టు ఆదేశాల ఉల్లంఘనతో బొగ్గురవాణా

# కాంట్రాక్టు నిలిపివేత

### లెటర్ ఆఫ్ ఇంటెంట్ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ

### నవంబరు 3కు కేసు వాయిదా వేసిన హైకోర్టు డివిజన్ బెంచ్



**హైదరాబాద్, అక్టోబరు30,ప్రభాతవార్త:** బొగ్గురవాణా కాంట్రాక్టు ఒప్పందం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి ఇవ్వడమైనదని ఆక్షేపించడమే కాకుండా నవంబరు 3కు తదుపరి కేసు వాయిదా వేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. కాంట్రాక్టు పొందిన వ్యక్తికి ఇచ్చిన లెటర్‌ఆఫ్ ఇంటెంట్ తాత్కాలికంగా నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పిటీషనర్ తరుపున న్యాయవాదులు దీపక్ భట్టాచార్య దిషత్ భట్టాచార్యలు,టిజి జెన్‌కో తరుపున అద్నాన్ మహ్మద్ ,అడ్వకేట్ జరనరల్ కూడా హాజరయ్యారు. అడ్వకేట్ జనరల్ ఫైనాన్సియల్ బిడ్ సెప్టెంబర్ 25తెరిచామని అక్టోబరు3న ఒప్పందం ఖరారు చేశామని ఎవరైతే బిడ్డర్ అన్ని ప్రమాణాలకు అనుగుణంగా టెండర్ దాఖలు చేశారో అర్హుడైన వ్యక్తికి లెటర్‌ఆఫ్ >>2

## బియ్యం ధరల దోపిడిపై

# ఉక్కుపాదం

### బ్లాక్‌మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

### బిపిటి బియ్యం కిలో రూ.66కు మించకుండా నియంత్రణ

### సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయి: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్‌మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించి ప్రజలపై భారం మోపినా కఠిన చర్యలు >>2



శుక్రవారం హైదరాబాద్‌లో సమీక్షలో మంత్రి ఉత్తమ్

# ఆదివాసీల పరిహారం విస్మరించిన సర్కార్

### రెండు ఎమ్మెల్సీ సీట్లకు బిసి అభ్యర్థులను ప్రకటించాం

### ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో టిఆర్ఎస్ చీఫ్ కవిత

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా ప్రజల ఆశీర్వాదం, ఆదివాసీల దీవెనలు కోరేందుకే తాను ఇంద్రవెల్లికి వచ్చానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారం, ఆదివాసీల హక్కుల పరిరక్షణ, రైతులకు సాగునీరు, యువతకు ఉపాధి, విద్య, వైద్యం వంటి అంశాలపై పోరాటం చేసేందుకు కొత్త రాజకీయ శక్తిగా ప్రజల ముందుకు వచ్చామని తెలిపారు. శుక్రవారం ఇంద్రవెల్లిలో నిర్వహించిన ఆదిలాబాద్ పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు.విప్లవాలకు, ఆదివాసీల హక్కుల పోరాటాలకు ప్రతీకగా నిలిచిన ఇంద్రవెల్లి గడ్డకు పాదాభివందనం చేస్తున్నానని కవిత పేర్కొన్నారు. స్వాతంత్రం కోసం పోరాడిన రామ్‌జీ గోండు, వన్నెల ఎల్లన్న, వెదమ రాము, శిడెం శింబు, కొమురం సూరు వంటి మహనీయులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. జల్, జమీన్, జంగల్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్‌ను గుర్తుచేసుకున్నారు. ఇంద్రవెల్లి అమరవీరులకు రూ.25 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. ఆదివాసీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్మరించారని విమర్శించారు.

ఆదిలాబాద్ జిల్లా ప్రకృతి సంపద, అడవులు, ఆదివాసీ సంస్కృతికి నిలయమైనప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిందని కవిత అన్నారు. జిల్లాలో సుమారు 750 గ్రామాలకు కనీసం పాఠశాలలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ.11 లక్షలు ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.2 లక్షలు కూడా లేదని పేర్కొన్నారు. జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదులు ఉన్నప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో సాగునీరు అందడం లేదని కవిత అన్నారు. కాగజ్‌నగర్ ప్రాంతంలో లక్షా ఐదు వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా కేవలం ఆరు వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని పేర్కొన్నారు. కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని తెలిపారు.

రైతులను పంటలు వేయవద్దనడం బాధాకరంరైతులు పంటలు వేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం బాధాకరమని కవిత అన్నారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే రైతులకు పంటలు సాగు చేయవద్దంటే వారి జీవనోపాధికి ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పిస్తుందని ప్రశ్నించారు. రైతులకు నీరు, విద్యుత్, యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులు గౌరవంగా జీవించేలా తమ పార్టీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఐటీడీఏ పరిధిలో జీవో 57తో పాటు మొత్తం 27 జీవోలను తిరిగి అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. 1972లో ఆస్తులు కొనుగోలు చేసిన ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. ఆదివాసీ మహిళల్లో రక్తహీనత సమస్య ఉన్నప్పటికీ పోషకాహారం



శుక్రవారం ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో కవిత

అందించే విషయంలో నిరక్ష్యం జరుగుతోందని అన్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు కార్మికులకు తగిన న్యాయం చేయలేదని విమర్శించారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నిజామాబాద్ చక్కెర కర్మాగారాలను ఎందుకు పునఃప్రారంభించలేదని నిలదీశారు. ఆదిలాబాద్‌లో పెద్ద ఎత్తున పత్తి పండుతున్నప్పటికీ వస్త్ర పరిశ్రమల పార్కును ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు తమ పార్టీ తరఫున బీసీ అభ్యర్థులైన శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్‌లను ప్రకటించామని తెలిపారు. రాజకీయ నేపథ్యం, ఆర్థిక బలం లేకపోయినా తెలంగాణ కోసం పనిచేసిన విద్యావంతులైన యువకులకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఆదివాసీలు, ఆదిలాబాద్ జిల్లా ప్రజల ఆశీర్వాదంతో జిల్లాలోని అన్ని స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలి

### కరవు సమస్యలు వదిలేసి నేతలు ఢిల్లీకి పరుగులు

### బిజెపి రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్,అక్టోబరు30, ప్రభాతవార్త:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ వస్తున్నారంటేనే అధికార కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. వందలాది మంది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమై, చీకట్లో తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజించిన రక్తచరిత్ర కాంగ్రెస్‌ది అని పేర్కొన్నారు. అలాంటిది తెలంగాణ ప్రజలకు మేం క్షమాపణ చెప్పాలని అడగడానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సిగ్గుండాలి. అసలు తెలంగాణకు బేషరతుగా క్షమాపణ చెప్పాల్సింది కాంగ్రెస్ నాయకులే అని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఓట్ల తొలగింపుపై ఆధారాలు చూపమంటే పారిపోయిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఇప్పుడు మళ్లీ పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు నీచమైన కుట్రలకు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. గతంలోనే నేను సూటిగా సవాల్ విసిరాను, మీరు చెబుతున్నట్లు అన్యాయంగా ఓట్లు తొలగిస్తే, కనీసం ఒక్క పది మంది అర్హులైన ఓటర్ల పేర్లనైనా ఆధారాలతో సహా నిరూపించమని నిలదీశాను. ఆ నాటి నా సవాల్‌కు ముఖం చెల్లక, సమాధానం చెప్పలేక తోకముడిచి పారిపోయిన పొన్నం ప్రభాకర్.. నేడు మళ్లీ మీడియా ముందుకు వచ్చి అవే కట్టుకథలను వల్లించడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చట్టబద్ధంగా, అత్యంత పారదర్శకంగా ఏఎస్‌డీఈ నిబంధనల ప్రకారం బోగస్ ఓట్లను ఏరివేస్తుంటే, రాబోయే రోజుల్లో తమ డిపాజిట్లు గల్లంతవుతాయనే తీవ్ర నైరాశ్యంతోనే కాంగ్రెస్ నేతలు రాజ్యాంగ వ్యవస్థలపై బురదజల్లుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు దశాబ్దాల పాలనలో బీసీ కమిషన్ నివేదికలను అటకెక్కించి బీసీల గొంతు నొక్కిన కాంగ్రెస్.. నేడు బీసీ గణన పేరిట మొసలి కన్నీరు కారుస్తోందన్నారు.



2

## నౌకాదళంలోకి 8 కొత్త స్టెల్త్

# యుద్ధనౌకలు

### రూ.40 వేల కోట్ల ప్రాజెక్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

# సిఎం కృషి వల్లే మియాపూర్ భూములు దక్కాయి

### సుప్రీం నిర్ణయం గత పాలకుల దోపిడికి చెంపపెట్టు: మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త:** హైదరాబాద్ మియాపూర్ లో గల సర్వే నంబర్ 100, 101 లలో ఉన్న 550 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం పట్ల రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. ఈ భూములు దక్కడం లో ముఖ్యమంత్రి కృషి ఎంతో ఉందని అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పివిఆర్ గార్డెన్స్ లో.. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగిస్తూ.. ఆనాటి బీఆర్ ఎస్ దొరల పాలనలో దామోదర్‌కు, అలాగే బెంజ్ కారును గిఫ్ట్ ఇచ్చిన మరో రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఈ భూములు కట్టబెట్ట జూశారని విమర్శించారు. అప్పటి పార్లమెంట్ సభ్యులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూములను కాపాడేందుకు ఎంతో పోరాటం చేశారని, సీఎం అయ్యాక సుప్రీంకోర్టులో దావా వేసి ప్రభుత్వం తరఫున న్యాయవాదులను నియమించి.. ఈరోజు మియాపూర్ లోని 550 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వానికి దక్కేలా చూడటంలో.. ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి ఉందని అన్నారు. ప్రజా పాలనలో దీనిని తమ నైతిక బాధ్యతగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

**ఓడిపోయాక పేదోళ్లు గుర్తొస్తున్నారా..?**

కాళేశ్వరం పేరిట కూలేశ్వరం కట్టి.. లక్ష కోట్లు దోచుకున్న దొరలకు అప్పుడు పేదలు గుర్తు రాలేదని.. దోచుకున్న సొమ్ములో కొంతైనా కేటాయిస్తే ఈరోజు గ్రామాల్లో గుడిసెలు ఉండేవి కాదని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు.. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల కోసం రెండు విడతల్లో రూ.40,000 కోట్లు కేటాయించామని, అర్హులైన ప్రజలందరికీ



ఖమ్మం రూరల్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి

ఇళ్లు కేటాయించేందుకు అవసరమైతే మూడు, నాలుగో విడతల్లో కూడా గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో..: మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులు భానోత్ కిషోర్ నాయక్, పాల్గొన్నారు.



శుక్రవారం భారీ వర్షానికి హైదరాబాద్ అమీర్‌పేటలో వరద దృశ్యం

## జిఎస్ఎల్‌వి ఎఫ్18 సక్సెస్

**శ్రీహరికోట, అక్టోబరు 30 ప్రభాతవార్త:** సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట లోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి శుక్రవారం రాత్రి 11 గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్వీ ఎఫ్ 1 8 నింగిలోకి దూసుకెళ్లింది. గురువారం రాత్రి 11 గంటల 55 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్ డౌన్ 24 గంటల పాటు కొనసాగింది. కౌంట్ డౌన్ ప్రక్రియముగియగానే జిఎస్ఎల్వీ ఎఫ్ 18 రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగికెగిసింది. భారత దేశపు నావిగేషన్ రంగానికి ఎంతో ఉపయోగకరమైన ఉపగ్రహంగా దీన్ని పేర్కొనవచ్చు. ఇతర దేశాలపై ఆధారపడి నావిగేషన్ వ్యవస్థను నడుపుతున్న మన దేశానికి ప్రస్తుతం ప్రయోగించనున్న ఈ ఉపగ్రహం దిక్సూచిలా పనిచేస్తుంది. రక్షణ రంగానికి, విమాన యానానికి ఖచ్చితమైన రూట్ మ్యాప్లను అందించడంలో ఈ ఉపగ్రహం ముందుంటుంది. అత్యాధునికమైన సాంకేతితో కూడిన ఎల్ వన్ బ్యాండ్ ఈ ఉపగ్రహంలో అమర్చడంతో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఫిట్నెస్ ట్రాకర్లు లలో లొకేషన్లు, యాపులను కచ్చితంగా చూపడంలోమంచి పనితీరు కనబరుస్తుంది.

సరిహద్దుల్లో 1500 కిలోమీటర్ల వరకు కచ్చితంగా నావిగేషన్ వ్యవస్థను అందించడంఉపగ్రహం ప్రత్యేకత. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తన వంతు సేవలు అందించే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు ఎన్ వి ఎస్ జీరో త్రీ ఉపగ్రహానికి రూపకల్పన చేశారు.

## జనవరి 25 నుంచి జనగణన

### భారత్ రిజిస్ట్రార్ జనరల్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** భారతదేశ వ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో జనగణన ఉండదని స్పష్టం చేసింది. అలాగే మంచు కురిసే జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ జనగణన ఉందని పేర్కొంది. భారత రిజిస్ట్రార్ జనరల్ , సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ జారీ చేసిన ప్రకారం, జనాభా గణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు. ఆర్‌జీఐ ప్రకారం, జనగణన ప్రక్రియలో భాగంగా 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు సవరణ దశ (రివిజినల్‌రౌండ్) ఉంటుంది. ఇంటింటికీ తిరిగి జనాభాను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు, అంటే 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే (సెల్ఫ్ ఎన్యూమరేషన్) అవకాశం కల్పిస్తారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది గృహాల జాబితా తయారీ, గృహ గణన, రెండోది జనాభా లెక్కింపు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగాల్సిన ఈ ప్రక్రియ ఈసారి కాస్త లేటయ్యింది. వాస్తవానికి జగగణన 2021లోనే జరగాల్సి ఉండగా, కోవిడ్19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ భారీ జనాభా గణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లు కేటాయించింది. వాస్తవానికి, గతంలోనే మణిపూర్‌లో 2027 జనాభా గణనకు సంబంధించి గృహాల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఆర్జీఐ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది; ఇందులో 62.32 కోట్ల మంది పురుషులు, 58.75 కోట్ల మంది మహిళలు ఉన్నారు.

## ఉక్కుపాదం

>> తప్పవని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా లాభాలు సంపాదించాలనుకునే వారిని ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. బియ్యం ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బేగంపేట కుందన్ బాగ్ లోని తన క్యాంపు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో శుక్రవారం సమీక్షించారు. టోకు, చిల్లర వ్యాపారులు, రైస్‌మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ అధికారులు జరిపిన చర్చల వివరాలను తెలుసుకున్నారు. అక్రమాల నిరోధానికి చేపట్టిన ప్రత్యేక చర్యలు, తనిఖీల పురోగతిని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంత్రికి వివరించారు. శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, ఇతర ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు. సాధారణంగా ప్రజలు ఎక్కువగా వినియోగించే బిపిటి బియ్యం ధర కిలో రూ.66కు మించకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్ఎన్ఆర్ బియ్యం విషయంలో నాణ్యత, ఉత్పత్తి వ్యయాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకుని ధరపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులపై భారం మోపుతూ అధిక లాభాలు సంపాదించడాన్ని ప్రభుత్వం సహించదు. మార్కెట్‌లో ధరలు స్థిరపడే వరకు తనిఖీలు, అక్రమాల నిరోధక చర్యలు కొనసాగుతాయి అని ఉత్తమ్ స్పష్టం చేశారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు తదితర అవకతవకల ఆరోపణలపై ఇప్పటికే బియ్యం వ్యాపారులపై 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పౌర సరఫరాలు, పోలీసు, జిఎస్‌టి, తూనికలు-కొలతల శాఖలతోపాటు సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు ఈ చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో టోకు, చిల్లర బియ్యం మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు.

## నవంబరు 30న ఓటర్ల తుది జాబితా

**హైదరాబాద్, అక్టోబరు30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్చింది. తాజా మార్పుతో రాష్ట్రంలో ఓటర్ల తుది జాబితా నవంబర్ 30న ప్రచురితం కానుంది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార గడువును నవంబర్ 26 వరకు ఈసీ పొడిగించింది. పాత షెడ్యూల్ ప్రకారం నవంబర్ 9నే తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో ఈసీ గడువును పొడిగించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

## కాంట్రాక్టు నిలిపివేత

>> ఇంటెంట్ అక్టోబరు 6న ఇచ్చామని పిటిషనర్ ప్రిక్వాలిఫికేషన్ నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో తిరస్కరించామని జెన్‌కో తరుపున అడ్వకేట్ జనరల్ తెలిపారు. ఒడిశాలోని నైని బొగ్గు గనుల నుండి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు రోడ్డు, రైలుమార్గంలో సంవత్సరానికి 3 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా కోసం టిజి జెన్కో టెండర్ పిలువగా అందులో చేర్చిన నిబంధనలలో పారదర్శకత లేదని, అర్హులైన కాంట్రాక్టర్లను పోటీ నుంచి తప్పించడానికి టెండరింగ్ ప్రక్రియ యొక్క మొత్తం ఆశ్రితులకు కట్టబెట్టలా ఉందనీ తీవ్రమైన ఆందోళనలను రవాణా టెండర్‌లో పాల్గొనే ఔత్సాహికులు లేవనెత్తారు., ప్రీ క్వాలిఫికేషన్ బిడ్ అవసరాల యొక్క క్లాజ్ 12 (ఎ), (బి), (సి) కింద అవసరం, రైల్వే సైడింగ్ ఏర్పాటు, ప్రభుత్వ జెన్కో, లేదా ఏదైనా ప్రత్యామ్నయ విద్యుత్ వినియోగానికి బొగ్గును నిర్వహించడంలో ముందస్తు అనుభవం అత్యంత వివాదాస్పదమైన షరతు విధించారని పిటిషర్ వాజ్యం వేశారు. అర్హతగల బిడ్డర్‌ల ఫీల్డ్‌ను గణనీయంగా కుదించడంతోపాటు పరిమిత సంఖ్యలోని రవాణా రంగంవారికి అనుకూలంగా ఉండే విధంగా టెండర్‌ని రూపొందించారని ఫలితంగా ఆరోగ్యకరమైన పోటీని తగ్గించడంతో పాటు ఎక్కువ కోట్ చేయబడిన రేట్లు వేశారని, తద్వారా ప్రభుత్వ ఖజానాపై అధికభారం పడుతోందని పేర్కొన్నారు. అయితే టెండర్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం కోల్పోయిన బాధిత పక్షాలు కోర్టులను ఆశ్రయించాయి. ఈ విషయం న్యాయ శాఖ పరిశీలనలోకి వచ్చిందని, విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో జారీ చేసిన లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)లను తాత్కాలికంగా నిలిపివేయాలని టిజి జెన్కోని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రొసీడింగ్‌ల దృష్ట్యా, కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఏదైనా తదుపరి చర్య సంబంధిత అధికారులు వర్తించే ఆదేశాలు వాస్తవాలకు లోబడి కోర్టు ధిక్కార ఆరోపణలకు గురి కావచ్చని పిటిషనర్ల తరుపు న్యాయవాది సూచించారు. టెండరింగ్ ప్రక్రియ క్షుణ్ణంగా, నిష్పక్షపాతంగా పరిశీలించవలసి ఉంటుంది.

టెండర్‌లో కోట్ చేసిన రేట్లు ఎల్ఓఐల జారీకి సంబంధించిన పరిస్థి తులను పరిశీలించే అవకాశం ఉంది. కోర్టు ఆదేశాలను పాటించే వరకు, పారదర్శకత, న్యాయమైన పోటీ ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు తదుపరి చర్యను అత్యంత జాగ్రత్తగా పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది.

## వారం - వర్జ్యం

31-10-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వియుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె
తి.షష్టి సా.5.01
న.1.ఆరుద్ర ఉ.7.12, న.2. పునర్వసు తె.5.40
వ.1.ఉ.7.22-ఉ.10.20
వ.2.రా.10.19-రా.1.20
దు.ఉ.6.04-ఉ.7.38
రాహు. ఉ.9.00-ఉ.10.30 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** అనాలోచితంగా మీరు పెట్టిన పెట్టుబడులకు నష్టం కలుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో నిదానం అవసరము.

**వృషభం :** ఎంతో శ్రమిస్తే గాని ఫలితం దక్కదన్న సత్యాన్ని తెలుసుకుంటారు. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**మిథునం :** వృత్తిలో లాభాలు నామ మాత్రముగా ఉంటాయి. సొంత ఆలోచనలతో ముందుకు వెళ్ళడం అన్ని విధాల మంచిది.

**కర్కాటకం :** మీవాళ్ళ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని అవమానాలను భరించాల్సి వస్తుంది. వ్యాపారాలలో అనుకూలం.

**సింహం :** ఆలోచనలతో మీ మనసును ఆందోళనకు గురి చేయకండి. పెద్దలతో సంభాషించినప్పుడు సమన్వయం పాటించండి.

**కన్య :** ఎంతో కృషి చేసిన ఫలితం రావటం చాలా కష్టంగా మారుతుంది. అయినా మీరు నిరుత్సాహ పడరు. వాహన సౌఖ్యం.

**తుల :** చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగి ఊపిరి పీల్చుకుంటారు. ఆర్థిక విషయ వ్యవహారాలు మధ్యస్థంగా ఉంటాయి.

**వృశ్చికం :** డాక్యుమెంట్స్ లిఖిత పూర్వక వ్యవహారాల యందు జాగ్రత్తను వహించాలి. ఇతరులను ఆదుకుంటారు.

**ధనుస్సు :** ముఖ్యంగా గంటలు గంటలుగా ప్రతి విషయంలోను ఆలోచించే విధానానికి స్వస్తి చెప్పండి. శ్రమకు దగిన ఫలితం.

**మకరం :** మీ గురించి చెడుగా ప్రచారం చేసే వ్యక్తుల నుండి దూరంగా ఉండండి. వస్తు భద్రత పట్ల జాగ్రత్త అవసరం.

**కుంభం :** ఇష్టం లేకపోయిన, నమ్మకం లేకపోయిన కొందరిని తాత్కాలికంగా నమ్మవలసిన స్థితి తప్పది. ఆహ్వానాలు అందుతాయి.

**మీనం :** అన్ని విషయాలలో పురోగతి బాగుంటుంది. లాభాలు మాత్రం చేతికి అందవు. సమయం పడుతుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి

### నూతన రైల్వేలైన్ల మంజూరుకు అనుమతులు ఇవ్వండి

### అనంతారంలో మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి

### రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

**హైదరాబాద్, అక్టోబరు30, ప్రభాతవార్త:** తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-పుణె, హైదరాబాద్- బెంగళూరు, హైదరాబాద్- చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సీఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూసేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూసేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. వికారాబాద్ - కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని సీఎంకోరారు. వికారాబాద్‌జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్ గద్వాల్, కల్వకుర్తి - మాచర్ల, కాచిగూడ కాచిగూడ -జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు - ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ - లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయికి హైదరాబాద్ నగరం

### రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ

### ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రం

### నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో డి.సిఎం భట్టి



శుక్రవారం హైదరాబాద్‌లో నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న డి.సిఎం భట్టి

**హైదరాబాద్, అక్టోబరు30ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటీ, ఐఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగ ప్రతినిధులు భాగస్వాములై సంపద సృష్టికర్తలుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలు, భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల సమన్వయంతో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా, తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. నారెడ్‌కో ప్రెసిడెంట్ కొప్పుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యతకలిగిన భవన నిర్మాణంతో అత్యాధునిక వసతులతో ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. జనరల్ సెక్రటరీ ఆర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హైదరాబాద్‌లో మధ్యతరగతి అల్పాదాయ వర్గాలకు కూడా సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు సామాజిక సేవలతో ఇళ్ళ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామెర కాశీప్రసాద్, కె.గోపాల క్రిష్ణ, కొండాల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కాపాడాం

>> గోల్డ్ స్టోన్ ప్రసాద్ ద్వారా ప్రయత్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు... హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని విలువైన భూములు కబ్జాకు ప్రయత్నించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షునిగా ఈ కబ్జా వ్యవహారాలపై పోరాడడంతోనే కక్ష గట్టి నన్ను జైలుకు పంపారు. మియాపూర్ భూముల విషయంలో దామోదర్‌రావుకు ముందుగానే విలాసవంతమైన కార్లు లంచంగా ఇచ్చారు. కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు ఇచ్చారు. మేం ఈ భూముల రక్షణకు ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించాం' అని చెప్పారు. 'కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల కబ్జాల నుంచి భూములను రక్షించే ప్రయత్నిస్తున్నాం. ఈ విలువైన భూములను విక్రయించి నీటిపారుదల, విద్యా, వైద్య తదితర రంగాలకు కేటాయిస్తాం. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తాం' అని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్‌లోని ఆ భూములను రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. తెలంగాణలో కబ్జాదారుల ఆక్రమణల నుంచి కాపాడుకున్న ప్రభుత్వ భూములను ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయస్థానాల్లో సమర్థవంతంగా పోరాడి రాష్ట్రంలో అన్యాక్రాంతం కాకుండా, ఇప్పటివరకు దాదాపు రూ.1 లక్షా 50 వేల కోట్ల విలువైన భూములను కాపాడినట్టు తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాలతో పాటు రాష్ట్రంలో మొత్తం 7 ప్రధాన ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములను పోరాడి సాధించినట్టు చెప్పారు. ప్రభుత్వం సాధించుకున్న భూములను ఇలాగే వదిలేస్తే అవి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం రక్షించిన భూముల్లో అటవీ శాఖకు చెందిన భూములను ఆ శాఖకు, అలాగే రెవెన్యూ శాఖకు చెందిన భూములను రెవెన్యూకు అప్పగిస్తామని చెప్పారు. వనరుల సమీకరణ కోసం నియమించిన మంత్రివర్గం ఉపసంఘం ఈ భూముల విక్రయం, తద్వారా వచ్చే నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తుందన్నారు. ప్రధానంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి, నిరుపేదలకు విద్యను అందించడానికి, ఇందిరమ్మ ఇండ్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఇతర ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ చుట్టూ, అలాగే రాష్ట్రంలోని విలువైన భూములను కొల్లగొట్టాలన్న ప్రయత్నాలు జరిగాయన్నారు. కాలనీల ముసుగులో రంగారెడ్డి మియాపూర్ 100, 101 కలిసి 550 ఎకరాల సర్కారు పోరంబోకు భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు, పెట్టుబడిదారులు కబ్జా చేయాలని చూశారని చెప్పారు. గత మూడేళ్లుగా నిరంతరం న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతూ, ఈ భూములను రక్షించాలని న్యాయస్థానంలో ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల ఆస్తులను కాపాడగలిగామన్నారు. ధరణి ముసుగులో, రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడం, ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకునే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా కొల్లగొట్టడానికి ప్రయత్నాలు జరిగాయని అన్నారు. 'ఐఎంజి భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై కెటిఆర్ కొట్టేయాలని ప్రయత్నం జరిగితే న్యాయపోరాటంతో అడ్డుకోగలిగాం' అని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు, మామిడిపల్లిలో 450 ఎకరాల భూములపై న్యాయస్థానంలో సమర్థవంతమైన పోరాటం ద్వారా సాధించాం. వేల కోట్ల విలువైన భూములను హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బలమైన వాదనలు వినిపించడం ద్వారా కాపాడగలిగాం' అని వివరించారు. గుర్రంగూడ అటవీ భూములను కెటిఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీంకోర్టులో పోరాడాం, ప్రభుత్వ పోరాటంతో అది అటవీ భూమి అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది' అని పేర్కొన్నారు. 'హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కలాన్‌లో సర్వే నెం. 201లో 140 ఎకరాల భూమిని కాపాడాం. బలమైన వాదనల కారణంగా రాష్ట్రానికి, అటవీ శాఖకు అనుకూలంగా తీర్పు వచ్చింది. శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో సర్వే నెం. 59లోని 36 ఎకరాల, దాదాపు రూ. 3,600 కోట్ల విలువైన భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తుండగా, ప్రభుత్వం అడ్డుకుని న్యాయస్థానంలో పోరాటం చేసింది. సెప్టెంబర్ 3, 2025న హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పుతో ఆ భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగింది' అని వివరించారు. 'గండిపేట మండలం మంచిరేవులలో సర్వే నంబర్ 393లో 143 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నించగా, న్యాయస్థానంలో పోరాడి దాదాపు రూ.10 కోట్ల విలువైన భూమిని రక్షించాం. మంచిరేవుల అత్యంత కీలకమైన ప్రాంతం. మూసీ రివర్ ఫ్రంట్‌ను ఆనుకొని, గ్రేహౌండ్స్ ప్రాంతంలో ఉన్న ఈ భూమిలో 50 ఎకరాలను యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కోసం కేటాయించాం' అని ముఖ్యమంత్రి వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ. 400 కోట్ల విలువైన 106 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే, సుప్రీంకోర్టులో పోరాడి ఆ భూమిని కాపాడామని చెప్పారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూమిని బిఆర్ఎస్ నాయకులు కొల్లగొట్టాలని ప్రయత్నిస్తే న్యాయస్థానాల్లో పోరాటం చేయడం ద్వారా ప్రభుత్వం కాపాడగలిగిందని చెప్పారు. గడిచిన మూడేళ్లలో ఈ రకంగా 7 ప్రధానమైన భూములను ప్రభుత్వం కాపాడగలిగినట్టు ముఖ్యమంత్రి వివరించారు. హరీశ్‌రావు మామ హనుమంతరావు కబ్జా పెట్టిన భూములు సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారు. కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు అని చెప్పారు. భూముల ఆక్రమణపై బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారని చెప్పారు. శాసనసభలో చర్చించి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. మియాపూర్ భూములపై ఇప్పటికైనా కుట్రలు మారాలి. వాళ్ల భూముల ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని పేర్కొన్నారు.

# నౌకాదళంలోకి 8 కొత్త స్టెల్త్ యుద్ధనౌకలు

### రూ.40 వేల కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ(సిసిఎస్), భారత నౌకాదళం కోసం ఎనిమిది నెక్స్ట్ జనరేషన్ కార్వెట్‌ల (ఎన్‌జిసి) నిర్మాణానికి గాను రూ. 40వేల కోట్లకు పైగా విలువైన ఒక భారీ రక్షణ సేకరణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ చర్య నౌకాదళం సముద్ర పోరాట సామర్థ్యాలను గణనీయంగా బలోపేతం చేస్తుంది. అలాగే హిందూ మహాసముద్ర ప్రాంతమంతటా దాని కార్యాచరణ ఉనికిని పెంచుతుందని భావిస్తున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఎనిమిది యుద్ధనౌకల కోసం కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జిఆర్ఎస్ఇ), గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జిఎస్ఎల్)తో రాబోయే రోజుల్లో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. మొదటి నౌకను 2030 నాటికి అందజేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం, జిఆర్ఎస్ఇ ఐదు కార్వెట్‌లను నిర్మించగా, మిగిలిన మూడింటిని జిఎస్ఎల్ నిర్మిస్తుంది. 2025, మే 21న రక్షణ మంత్రిత్వ శాఖ వాణిజ్య బిడ్లను ఆహ్వానించినప్పుడు, జిఆర్ఎస్ఇ అత్యల్ప బిడ్డర్‌గా (ఎల్1) నిలిచింది. రెండవ అత్యల్ప బిడ్డర్‌గా నిలిచిన జిఎస్ఎల్, ప్రాజెక్టులో తన వాటాను అదే యూనిట్ ధరకు పూర్తి చేస్తుంది. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, వాణిజ్య పారామితులు ఖరారయ్యాయని, ఆర్డర్‌లో తమ వాటా విలువ సుమారు రూ.33,000 కోట్లుగా అంచనా వేయబడిందని జిఆర్ఎస్ఇ ఇంతకుముందే పెట్టుబడిదారులకు తెలియజేసింది. నిర్ణీత కాలపరిమితి కంటే ముందే యుద్ధనౌకల నిర్మాణాన్ని వేగవంతం చేసి, వాటిని అందించేందుకు రెండు షిప్‌యార్డులు మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం.



## ఎఐకి పోటీగా శరవేగంతో జవాబులు!

### 16 యేళ్లకే ఆర్యన్‌శుక్లా 9 గిన్నిస్ రికార్డులు

*నాసిక్, అక్టోబరు 30:* *ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత వేగంగా లెక్కలు వేసినా, 16 యేళ్ల ఆర్యన్‌శుక్లా తన మనసుతోనే అంతకంటే వేగంగా క్షణాల్లో సమాధానం చెప్పగలడు. మహారాష్ట్రలోని నాశిక్‌కు చెందిన ఈ బుడ్డోడి ప్రతిభ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. చిన్న వయసులోనే అసాధారణమైన జ్ఞాపకశక్తి, కౌంటింగ్ వేగంతో ఏకంగా తొమ్మిది గిన్నిస్ వరల్డ్ రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. కేవలం 12 యేళ్ల ప్రాయంలోనే మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ కప్‌ను గెలుచుకుని ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. ఇతడిని ఇప్పుడు అందరూ భారత్ గర్వించదగ్గ హ్యూమన్ కాలిక్యులేటర్ అని పిలుస్తున్నారు. ఈ అద్భుత విజయాల వెనుక కేవలం లెక్కల మీద ఆసక్తి మాత్రమే కాదు, ఏడేళ్ల అంకితభావం, ఎలాంటి ఒత్తిడి పెట్టని తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నాయి. ఆర్యన్ ప్రయాణం ఆరేళ్ల వయసులోనే సాధారణమైన కుతూహలంతో ప్రారంభమైంది.*

*అంకెలు, లెక్కల పట్ల ఆసక్తి చూపించిన ఆర్యన్‌లోని ప్రత్యేకతను అతని తల్లిదండ్రులు త్వరగానే గుర్తించారు. సాధారణ పిల్లల్లా కాకుండా ఇతను ఏదో విభిన్నంగా చేస్తున్నాడని గ్రహించి, తండ్రి నితిన్‌శుక్లా వెంటనే ఆ బాలుడిని పోటీలకు తీసుకెళ్లడం ప్రారంభించారు. అలా 2018లో ఇస్తాంబుల్‌లో జరిగిన మెమోరియాడ్ టర్కీ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో ఎనిమిదేళ్ల ఆర్యన్ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించి 7 బంగారు పతకాలతోపాటు మొత్తం 10 పతకాలు సాధించి రెండు చిన్నారుల ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. ఈ అంతర్జాతీయ ప్రయాణంలో భాగంగా జూలై 2022లో జర్మనీలోని పాడెర్బోర్న్‌లో జరిగిన మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ కప్‌లో ఆర్యన్ సంచలనం సృష్టించాడు. ప్రపంచవ్యాప్తంగా పాల్గొన్న 40 మంది మేధావులతో పోటీపడి కేవలం 12 యేళ్ల వయసులోనే ఛాంపియన్‌గా నిలిచాడు. అంతకుముందు ఈ పోటీల్లో జపాన్ జట్టుదే పూర్తి ఆధిపత్యం ఉండేది. ఆ ఆధిపత్యాన్ని చెరిపేస్తూ ఆర్యన్ ఈ ఘనత సాధించాడు. ఆ తర్వాత 2024 సెప్టెంబరులో జరిగిన పోటీల్లో తన టైటిల్‌ను నిలబెట్టుకోవడమే కాకుండా, 900 మార్కులకుగానూ 819.84 మార్కులు సాధించి ఓవరాల్ ర్యాంకింగ్, వెర్సటైలిటీ, అడిషన్, మల్టిప్లికేషన్, స్క్వేర్ రూట్స్, కాలెండర్ డేట్స్ - ఇలా ఆరు విభాగాల్లోనూ ట్రోఫీలను కైవసం చేసుకున్నాడు. అంతేకాకుండా వివిధ విభాగాల్లో ఐదు ప్రపంచ రికార్డులను తన పేరు మీద లిఖించుకున్నాడు.*

# మియాపూర్ భూముల స్వాధీన ప్రక్రియ ప్రారంభం

### సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కదిలిన ప్రభుత్వ యంత్రాంగం

### భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుంటామని వెల్లడి

### పేదల జోలికి వెళ్లబోమని హామీ

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), అక్టోబరు 30, ప్రభాతవార్త:** మూడు దశాబ్దాలుగా కోర్టు వివాదంలో ఉన్న మియాపూర్ భూములు ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం దాదాపు 60 వేల కోట్ల రూపాయల విలువచేసే ఈ భూములను పరిరక్షించేందుకు రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మియాపూర్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, సర్వే, హెచ్‌ఎండిఏ అధికారులతో కలిసి మియాపూర్ భూముల్లోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మియాపూర్ భూములకు సంబంధించి సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో ముగింపు లభించిందన్నారు. సివిల్ అప్పీల్ నంబరు 10699/2013తోపాటు మరో 19 కేసుల్లో సుప్రీంకోర్టు ఉమ్మడి తీర్పు వెలువరించిందని తెలిపారు. 1995లో ప్రారంభమైన ఈ భూవివాదం సుప్రీంకోర్టులోనూ సుదీర్ఘకాలం కొనసాగిందని పేర్కొన్నారు. సర్వే నంబర్లు 100, 101లోని మొత్తం 550 ఎకరాల 39 గుంటల భూమిపై ప్రభుత్వానికి హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసిందని కలెక్టర్ వివరించారు.

ప్రైవేటు వ్యక్తులు తమ హక్కులకు సంబంధించి సమర్పించిన పత్రాలు నకిలీవని, కల్పిత పత్రాలుగా ఉన్నాయని న్యాయస్థానం గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తులకు ఆ భూమిపై ఎలాంటి హక్కులు ఉండవని, భూమి ప్రభుత్వానికే చెందుతుందని స్పష్టం చేశారు. ఇది సర్కారు పోరంబోకు భూమి అని రికార్డుల్లో ఉందని, కింది కోర్టుల్లో కూడా ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ తీర్పులు వచ్చాయని తెలిపారు. తప్పుడు దారిలో పిటిషనర్ల పేర్లు రికార్డుల్లో చేర్చబడ్డాయని సుప్రీంకోర్టు ప్రస్తావించిందని కలెక్టర్ పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసే దిశగా భూమికి సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వే, హద్దుల నిర్ధారణతోపాటు తదుపరి చట్టపరమైన, పరిపాలనా చర్యలు చేపట్టేందుకు అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతోపాటు కోర్టు ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న దాదాపు 400 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇప్పటికే ఉన్న ప్రజా నివాసాలపై ఎలాంటి చర్యలు ఉండవని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

ఈ చారిత్రాత్మక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సతీష్‌చంద్రశర్మ, జస్టిస్ ఎం.ఎం. సుందరేష్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌ఎండిఏ మెట్రోపాలిటన్ జాయింట్ కమిషనర్లు ఉపేందర్‌రెడ్డి, చంద్రకళ, రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ కె.మహిపాల్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, హెచ్‌ఎండిఏ తహశీల్దార్ దివ్యరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

# నిమ్స్‌లో రెండోరోజూ ఎసిబి సోదాలు

### ఉద్యోగ నియామకాలు, సెక్యూరిటీ కాంట్రాక్టుల్లో అక్రమాలపై ఆరా

### నియామకాల్లో డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 30, ప్రభాత వార్త:** పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ దర్యాప్తు రెండో రోజూ కొనసాగుతోంది. గురువారం ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాల అధికారులు ఏకకాలంలో సుమారు 15 గంటలపాటు తనిఖీలు చేపట్టగా, శుక్రవారం ఏసీబీ అధికారులు మరోసారి సోదాలు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలో ఉద్యోగ నియామకాలు, కాంట్రాక్టుల కేటాయింపు, మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లు తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించారు. నిమ్స్‌లో స్కిల్డ్, నాన్ స్కిల్డ్ విభాగాల్లో మొత్తం 540 మంది ఉద్యోగుల నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు ఏసీబీకి సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.60 వేల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ల నుంచి డబ్బులు వసూలు చేసుకోవచ్చని, జీతంతోపాటు నెలకు రూ.30 వేల వరకు సంపాదించుకోవచ్చని నియామక సమయంలో ఆశ చూపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ కాంట్రాక్టు విషయంలోనూ నిబంధనలు పాటించకుండా పాత సంస్థకే బాధ్యతలు అప్పగించినట్లు ఏసీబీ తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం. నిమ్స్‌లో జరిగినట్లు చెబుతున్న అక్రమాల్లో లక్ష్మీ భాస్కర్ పాత్రపై కూడా అధికారులు ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది.

తొలిరోజు ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ డీఎస్పీ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని బృందం ఆస్పత్రి పరిపాలనా విభాగంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. మరోవైపు ఫుడ్ సేఫ్టీ అధికారులు క్యాంటీన్‌లో తనిఖీలు నిర్వహించగా, నలుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సర్జికల్ స్టోర్‌లో మందులు, వైద్య పరికరాల నిల్వలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రెండో రోజు కొనసాగుతున్న సోదాల్లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఢిల్లీకి బస్సులో బయల్దేరిన కాంగ్రెస్ శ్రేణులు

**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపుతో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తెలంగాణ నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు బస్సుల్లో గురువారం రాత్రి నుంచి తరలివెళ్లినారు. ప్రత్యేక రైళ్ళ కోసం గత పది రోజుల క్రితం కాంగ్రెస్ ఎంపిలు మల్లురవితోపాటు అనేక మంది ఎంపిలు దక్షిణ మధ్య రైల్వే అధికారులను అభ్యర్థిస్తూ దరఖాస్తు చేసుకొన్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైళ్ళు కేటాయించడానికి అనేక సాకులు చూపడంతో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌తోపాటు మంత్రులు, కాంగ్రెస్ శ్రేణులు రైల్ నిలయంవద్ద ధర్నా చేశారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఎఐసిసి అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి పిలుపు మేరకు నవంబర్ 1వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు, సంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్, మంథని, నిర్మల్, నిజామాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సుల్లో ఢిల్లీకి బయలుదేరారు. సుమారు 30గంటలకు పైగా ప్రయాణం ఉండటంతో యువకులను మాత్రమే బస్సుల్లో తరలించడానికి నాయకులు నిర్ణయానికి వచ్చారు. ఢిల్లీలో కాలుష్యం,చలి కూడా మొదలు కావడంతో ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని కూడా నిరసనకు రావొద్దని ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్ సూచనలు చేసింది.రవాణాబిసి సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల ద్వారా నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి పయనమయ్యారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటం, ఓట్ చోరీ వ్యతిరేకంగా గళమెత్తడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొననున్నాయి. తెలంగాణ నుంచి సుమారు వందకు పైగా బస్సుల్లో నాయకులు బయలుదేరారు. మరోవైపు కొంత మంది రెగ్యులర్‌గా నడిచే ట్రైన్‌లో ముందుగా రిజర్వేచేసుకొని వెళుతున్నారు. కొంత మంది విమానాల్లో వెళుతున్నారు.

## కోకాపేట్‌లో తీవ్ర విషాదం

### 23వ అంతస్తు నుంచి దూకి విద్యార్థిని మృతి

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** శివారులోని కోకాపేట్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రెస్టీజ్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న 15 యేళ్ల ఇంటర్మీడియట్ విద్యార్థిని లాస్య లహరి మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. అపార్ట్‌మెంట్‌లోని 23వ అంతస్తు నుంచి కిందకు పడటంతో తీవ్రగాయాలై ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. తమ కుమార్తె కాలేజీకి వెళ్లడం లేదని తల్లి మందలించడంతో బాలిక మనస్తాపానికి గురైనట్లు ప్రాథమికంగా ప్రచారం జరుగుతున్న ప్పటికీ.. ఘటనకు అసలు కారణాలేమిటన్నది ఇంకా స్పష్టత రాలేదు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. లాస్యలహరి తన తల్లిదండ్రులతో కలిసి కోకాపేట్‌లోని ప్రెస్టీజ్ ట్రోవలి హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తోంది. ఆమె మాదాపూర్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల లాస్యలహరి కాలేజీకి వెళ్లకపోవడంతో తల్లి మందలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బాలిక తీవ్రమనోవేదనకు గురైందని ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే గురువారంరాత్రి 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్‌లోని 23వ అంతస్తు నుంచి కిందకు పడటంతో ఆమెకు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే అప్పటికే ఆ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుమార్తె లాస్య లహరి మృతిపై తండ్రి వెంకటేశ్వర్లు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన సమయంలో ఏంజరిగింది.. బాలిక ఏవైనా మానసిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతోందా.. కుటుంబ సభ్యులతో ఆమెకు ఏమైనా విభేదాలు ఉన్నాయా అనే అంశాలపై పోలీ సులు ఆరా తీస్తున్నారు. తల్లి మందలింపే ఈ ఘటనకు కారణమని ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. కుటుంబసభ్యులు, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులను అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. చిన్న వయసులోనే కుమార్తెను కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీవ్రవిషాదం నెలకొంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. విద్యార్థిని మృతికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# గంజాయి మత్తులో సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు

### చర్యలు తీసుకోవాలని వర్సిటీ అధికారులకు ఈగల్ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రముఖ యూని వర్సిటీలలో ఉన్నత విద్యను చదువుతున్న విద్యార్థులు గంజాయి వ్యసనపరులుగా మారుతుండడంపై ఈగల్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. వారం రోజుల క్రితం గీతం వర్సిటీలో బిటెక్ చదువుతున్న ఇద్ద రు విద్యార్థులు గంజాయి పాజిటివ్‌తో దొరికిపోగా తాజాగా గచ్చిబౌలిలోని సెంట్రల్ వర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇదేరీతిన గంజాయి మ త్తులో పట్టుబడ్డారు. మొదట కొందరు విద్యార్థులను సాధారణ తనిఖీల సందర్భంగా అనుమానించిన ఈగల్ పోలీసులు వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా భరద్వాజ్ (27), ఆనంద్ (26) గంజాయి పాజిటివ్‌గా వచ్చింది. వీరిని విచారించగా రెండేళ్లకు పైగా తాము గంజాయి సేవిస్తున్న ట్లు అంగీకరించారు. గచ్చిబౌలిలో గల గౌలిదొడ్డి వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన బికాస్ సింగ్ అలియాస్ జంగ్ అనే వ్య క్తి తమకు విక్రయిస్తున్నట్లు వారు చెప్పారు. దీంతో జంగ్‌ను ఈగల్ పోలీసులు అరెస్టు చేసి విచారించగా అస్సాంకు చెందిన రైజ్ అనే వ్యక్తి తన కు క్రమం తప్పకుండా అరకిలో నుంచి కిలో వరకు అమ్మేవాడని, దానిని తాను ఐదు గ్రాముల ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు జంగ్ తెలిపాడు. రైజ్ కోసం గాలిస్తున్నారు. ఇతను జంగ్‌కు మాత్రమే కాకుండా ఈ ప్రాంతంలోని 23 మందికి గంజాయి అమ్ముతున్నట్లు తేలింది. వీరి ఓ ఏడుగురు సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు వుండడం గమనార్హం. ఈ దందా అంతా సెంట్రల్ వర్సిటీ సౌత్ గేట్ వద్ద జరుగుతున్నట్లు ఈగల్ పో లీసులు తేల్చారు. కాగా గత ఆగస్టులో ఇదే వర్సిటీలో సందేశ్ అనే విద్యార్థి గంజాయితో పట్టుబడగా అస్సాంకు చెందిన బిస్వజిత్ కలిత్ అనే వ్యక్తి తనకు అమ్మినట్లు చెప్పాడు. ఇతని నుంచి వర్సిటీకి చెందిన 24 మంది విద్యార్థులు క్రమం తప్పకుండా గంజాయి కొంటున్నట్లు తేలింది. దీంతో పాటు మరో 17 మంది ఇతరులకు కూడా అతను అమ్మాడని తేలింది. మొత్తం మీద సెంట్రల్ వర్సిటీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గం జాయి వ్యసనపరులుగా మారినట్లు ఈగల్ పోలీసులు గుర్తించారు. దీనిపై ఈగల్ అధికారులు వర్సిటీ అధికారులకు లేఖ రాశారు. వర్సిటీలోని యాంటి డ్రగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని, అనుమానిత విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని. పాజిటివ్ వచ్చిన విద్యార్థులను వెం టనే పునరావాస కేంద్రాలకు తరలించి, వారిని మంచి వారు గా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా నల్సార్ వర్సిటీ వద్ద గురు వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి చనిపోగా అతని జేబులో గంజాయి ప్యాకెట్ లభ్యమవడాన్ని ఈగల్ గుర్తించింది. దీనిపైనా కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.

## ఉత్తరాఖండ్‌లో కుప్పకూలిన హెలికాప్టర్.. ఆరుగురు మృతి

**డెహ్రాడూన్, అక్టోబరు 30:** ఉత్తరాఖండ్‌లో శుక్రవారం ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ధామ్ నుంచి తిరుగు పయనమైన ఓ ప్రైవేట్ హెలికాప్టర్, జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామ సమీపంలో కుప్ప కూ లింది. హెలికాప్టర్‌లోని ఆరుగురు వ్యక్తులు మంణించినట్లు సమాచారం.



ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. ఆరుగురు కూడా మరణించారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. జోషిమఠ్ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయిందన్న దురదృష్టకర వార్త అందిందని తెలిపారు. జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ శాఖ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం బృందాలు సంయుక్తంగా సహాయక చర్యలు చేపడుతున్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. పరిస్థితిని తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ హెలికాప్టర్, శుక్రవారం మధ్యాహ్నం 1:12 గంటలకు బద్రీనాథ్ నుంచి బయలుదేరింది. జోషిమఠ్‌కు ఎదురుగా ఉన్న హాతీ పహాడ్ వద్ద ఆర్మీ పోస్ట్ సమీపంలో చివరిసారిగా దీనితో సంబంధాలు తెగిపోయాయి. జేపీ డ్యామ్ పైభాగంలో అటవీ ప్రాంతంలో తెల్లటి వస్తువు ఒకటి మండుతూ కనిపించిందని, అది కూలిపోయిన హెలికాప్టరే అయి ఉండవచ్చని చమోలి జిల్లా విపత్తు నిర్వహణ అధికారి నందకిశోర్ జోషి తెలిపారు.

# టిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొల్లూరు

**హైదరాబాద్,అక్టోబరు 30,ప్రభాతవార్త:** రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) తన అభ్యర్థులను ఖరారు చేసింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరును పార్టీ అభ్యర్థిగా పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత తాజాగా ప్రకటించింది. ఇప్పటికే వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానం నుంచి నలమాస శ్రీకాంత్‌గౌడ్ పేరును ప్రకటించిన కవిత.. తాజాగా రెండో స్థానానికి కూడా అభ్యర్థిని ఖరారు చేశారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీ సామాజికవర్గానికి చెందిన నేతలకు అవకాశం కల్పించడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన ఆకాశ్ కొల్లూరు 2 దశాబ్దాలుగా టివి, డిజిటల్ మీడియాలో పనిచేస్తున్నారు. ఇండియా టుడే, రిపబ్లిక్ టీవీ, సిఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హాంట్ వంటి సంస్థల్లో ఆయన విధులు నిర్వహించినట్లు టిఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన.. ఉస్మానియా వర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. 20 యేళ్ల మీడియా అనుభవం ఉన్న ఆకాశ్ కొల్లూరు ఈ యేడాది ప్రారంభంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. జర్నలిజం రంగంలో పనిచేసిన అనుభవం, విద్యా నేపథ్యం ఉన్న వ్యక్తిని పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బరిలోకి దింపడం ద్వారా ఓటర్లను ఆకర్షించవచ్చని టిఆర్ఎస్ పార్టీ భావిస్తోంది.

# మ్యూల్ బ్యాంక్ ఖాతాల ముఠా గుట్టురట్టు

### ఏడుగురిపై కేసులు

### 83 బ్యాంకు ఖాతాల ద్వారా రూ.10 కోట్లకుపైగా లావాదేవీలు

### సైబర్ మోసాలకు 14 ఖాతాల వినియోగం



పోలీసుల అదుపులో నిందితులు

**హైదరాద్ (అత్తాపూర్) అక్టోబరు 30, ప్రభాతవార్త :** ఇతరుల పేర్లతో బ్యాంకు ఖాతాలను సేకరించి, వాటిని సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్న ముఠా గుట్టును చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. అత్తాపూర్ పోలీసులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు సయ్యద్ అబ్బాస్ ఉల్లా హుస్సేనీ (24), మహమ్మద్ తల్హా ఖాన్ (23), నవాబ్ మహమ్మద్ రహీముద్దీన్ ఖాన్(20)లను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు స్థానిక వ్యక్తుల సహాయంతో వివిధ బ్యాంకుల్లో మ్యూల్ ఖాతాలను తెరిపించి, రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన విజయ్, బాబు లాల్‌లకు ఒక్కో ఖాతాను రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఖాతాలకు సంబంధించిన పాస్ బుక్కులు, ఎటిఎం కార్డులు, పిన్ నంబర్లు, లింక్ చేసిన సిమ్ కార్డులు, కస్టమర్ ఐడీలతో కూడిన బ్యాంకు కిట్లను కొరియర్ ద్వారా జైపూర్‌కు పంపించి డబ్బులు తీసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో సల్మాన్, అన్నా అనే మరో ఇద్దరి పాత్ర కూడా ఉన్నట్లు వెల్లడించారు.

**83 బ్యాంకు ఖాతాల గుర్తింపు**

నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలించగా హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 83 మ్యూల్ బ్యాంకు ఖాతాలను తెరిపించినట్లు గుర్తించారు. తెలం గాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకులో 32, దారుస్సలాం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో 15, అగ్రసేన్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో 15, మిగిలిన వివిధ బ్యాంకుల్లో 21 ఖాతాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఖాతాల వివరాలను ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో పరిశీలించగా, వాటిలో 11 ఖాతాలు దేశవ్యాప్తంగా నమోదైన 14 సైబర్ మోసాల కేసులతో సంబంధం కలిగి ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ తదితర ప్రాం తాల్లో ఈ ఖాతాలను సైబర్ నేరాలకు ఉపయోగించినట్లు వెల్లడైంది. రూ.10.04 కోట్ల లావాదేవీలుమొత్తం 83 మ్యూల్ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు సుమారు రూ.10,04,84,094 నగదును జమ చేసి, అదే రోజు ఉపసంహరించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

నిందితుల నుంచి తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకుకు చెందిన ఎనిమిది పాస్‌బుక్కులు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

# ఫడ్నవిస్‌తో థాకరే సోదరుల భేటీ

**ముంబయి, అక్టోబరు 30:** మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే ఒకే వేదికపై కనిపించడమే కాకుండా.. కార్యక్రమానికి ముందు ముగ్గురూ ఏకాంతంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మధ్య విభేదాలు పెరుగుతున్నాయన్న వార్తల నేపథ్యంలో ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే ఈ సమావేశంలో ఏం చర్చించారన్నది అధికారికంగా వెల్లడికాలేదు.

ముంబయిలో జరిగిన 'మహ రాష్ట్రచ్యా హాస్యరేఖా పుస్తకావిష్కరణ కార్యక్రమం లో ఈ పరిణామం చోటుచేసుకుంది. మరాఠీ రాజకీయ వ్యంగ్య చిత్రాల వందేళ్ల ప్రస్థానాన్ని వివరిస్తూ ప్రముఖ కార్టూనిస్టు ప్రశాంత్ కులకర్ణి సంపాదకత్వంలో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి ముందు ఫడ్నవీస్, ఉద్ధవ్, రాజ్ ఠాక్రే ఓ గదిలో సమావేశమై మాటాడుకున్నారు. ఇది మర్యాదపూర్వకంగా జరిగిన చాయ్ భేటీ మాత్రమేనని ముఖ్యమంత్రి సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి.

# హోటళ్లు, రెస్టారెంట్లపై కొనసాగుతున్న టిజిసేఫ్ దాడులు

### అనేక అక్రమాలు గుర్తింపు.. తొమ్మిదింటి లైసెన్స్ సస్పెన్షన్

### మరో తొమ్మిదింటికి సంజాయిషీ నోటీసులు జారీ

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు ఏ ర్పాటైన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) శుక్రవారం నాడు రంగారెడ్డి వరంగల్ జిల్లాలలో 20 హోట ళ్లపై దాడులు నిర్వహించింది. ఈ సందర్భగా అపరిశుభ్రంగా వున్న వంటశాలలు, పరిశుభ్రంగా లేకుండా వుండి తుప్పుపట్టిన యంత్రాలు, రి యూజ్డ్ వంట నూనె, లేబుల్స్‌లేని ఆహార పదార్థాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, రికార్డులు సరిగ్గా లేక పోవడం, ఉద్యోగుల వివరా లు సరిగ్గా నిర్వహించక పోవడం, వంటలు చేసేవారు పరిశుభ్రంగా వుండక పోవడం, బొద్దింకలు, ఈగలు ముసురుతుండడం, వాటి పక్కనే పురుగుల మందుల సీసాలు వుండడం అధికారులు గుర్తించారు. దీంతో పాటు తప్పుడు లేబులింగ్, ఆహార పదార్థాల్లో బొద్దింకలు, ఈగలు, దోమలు వాలుతున్నట్లు గుర్తించారు. కొన్ని కేంద్రాల్లో ఎలుకల వ్యర్థాలు.. ఆహార పదార్థాలపై పురుగుల ప్రభావం ఉన్నట్టు టిజి సేఫ్ బృందాలు గమనించాయి. హెయిర్ నెట్స్, గ్లౌజులు, అప్రాన్లు లేకుండానే ఈ ఆహార పదార్థాలను సిబ్బంది తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాలను నేలపైనే నిలువ చేయడమే కాకుండా ఆహార ఆహారేతర వస్తువులను కలిపి ఉంచడం పట్ల ఆహార పదార్థాల తయారీ కేంద్రాల యాజ మానులపై టీజీ సేఫ్ బృందాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మొత్తం 10 టీజీ సేఫ్ అధికారుల బృందాలు దాడులు నిర్వహించాయి. దాడుల సందర్భంగా 21 శాంపుల్స్‌ను సేకరించగా ఐదు లక్షల 89 వేల 550 రూ పాయల విలువచేసే 5555 కిలోల ఆహార వస్తువులను జప్తు చేశారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. దాడుల సందర్భంగా లైసెన్స్ లేకపోవడం, గడువుతీరినా పునరుద్దరించుకోకపోవడం, ఇతరత్రా అక్రమాలు వెలుగుచూడడంతో వరంగల్‌లోని హారిప్రియా ప్రొడక్ట్స్, దయానంద్ ఐస్ క్రీమ్స్, రాజు ఘీ స్వీట్ హౌస్, కృష్ణ ఆయిల్ మిల్స్, మట్టే వాడలోని రమేష్ ఇండస్ట్రీస్, జియోన్ ఫుడ్ ప్రొడక్ట్స్ (ఈ సంస్థ దోర్ టు దోర్ అమ్మ కాలు చేస్తోంది), కృపా బేకరీ ప్రొడక్ట్స్, షాద్‌నగర్‌లోని చాట్నపల్లిలో గల ఎస్ఎంపి డైరీ, హనుమకొండలోని కపిల్ ఫుడ్స్‌ల లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. ఇదే సమయంలో అపరిశుభ్రంగా వున్న పరిస్థితులను వెంటనే చక్కదిద్దు కోవాలని చెబుతూ తొమ్మిది హోటల్లకు షోకాజ్ నోటీసులు, మరో రెండింటికి ఇంప్రూవ్ మెంట్ నోటీసులు జారీ చేశారు.

యాదగిరిగుట్ట దేవస్థానం (వై.టి.డి)
శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం
యాదగిరిగుట్ట-508115, యాదాద్రి-భువనగిరి జిల్లా, తెలంగాణ
ఇ-ప్రొక్యూర్‌మెంట్/సీల్డు టెండరు-కం-బహిరంగ వేలం టెండరు ప్రకటన
ఆర్.సి.నం. బి5/3456/2024 తేది: 29.10.2026
ఈ దేవస్థాన కళ్యాణకట్ట యందు ఆగినెట్టి భద్రపరచబడిన తలనీలాల సరుకు నిలువ ఉన్నది ఉన్నట్లుగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం ద్వారా విక్రయించుటకు తేది: 12.11.2026న దేవస్థాన కార్యాలయం నందు టెండర్లు నిర్వహించబడును. తేది: 12.11.2026న నిర్వహించు టెండరు నందు పాల్గొనదలచిన వారు తేది: 11.11.2026న సా.4.00గం.లోపు టెండరు షెడ్యూల్స్ ఖరీదు చేయవలెను. గమనిక: ఇట్టి టెండరులో పాల్గొనుటకు ఆసక్తి గలవారు పూర్తి వివరములు www.tender.telangana.gov.in endowments departments marketing department నందు సందర్శించగలరు. ఇతర వివరములకు సం. 8333994007, 8333994021, 9381833702, 7893158122నకు కార్యాలయ వేళలలో సంప్రదించగలరు.
సం/-. ఎ.భవాని శంకర్, కార్యనిర్వహణాధికారి.
DIPR.NO. 12763-PP/CL/ADVT/1/2026-27 తేది: 30.10.2026

వార్త

తన గౌరవ మర్యాదల రక్షణ కోసం తన సర్వస్వమూ పణంగా ఒడ్డని దేశం నిరర్థకం.

- షిల్లర్

# నగదు వైపే మొగ్గు!

డిజిటల్ విప్లవంలో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్న తరుణంలో, నగదు చలామణి ఐదేళ్లగరిష్ఠ స్థాయికి చేరడం పురికొలుపుతున్న అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. 'డిజిటల్ ట్రాన్సాక్షన్స్ పెరుగుతున్న కొద్దీ క్యాష్ అవసరం తగ్గుతుంది' అనే ప్రాథమిక ఆర్థిక అంచనాను మన దేశ మార్కెట్ పరిస్థితులు తలకిందులు చేస్తున్నాయి. భారతీయ ఆర్థికవ్యవస్థలో ప్రజల వద్దచలామణిలో ఉన్న నగదు గణనీయంగా పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఈనెల 15వ తేదీ నాటికి దేశంలో చలామణిలో ఉన్న మొత్తం నగదువిలువ ఏకంగా రూ.43.46లక్షల కోట్లకు చేరినట్లు స్పష్టంచేసింది. గతఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది13.5శాతం పెరుగుదలకాగా, గత ఐదేళ్లకాలంలో నమోదైన అత్యధిక వృద్ధి రేటు కావడం గమనార్హం. అలాగే దేశంలో రిజర్వ్ మనీ కూడా 10.3శాతం వార్షిక వృద్ధితో రూ. 53.24 లక్షల కోట్లకు చేరుకుందని ఆర్బీఐ గణాంకాలుతెలిపాయి. చలామణిలో ఉన్న నగదు వృద్ధి రేటు 13.3 శాతంగా నమోదవ్వడం వ్యవస్థలో పెరుగుతున్న నగదు వినియోగానికి నిదర్శనంగా నిలిచింది. కరెన్సీ చలామణి ఈ స్థాయిలో పెరగడానికి రూపాయి పతనాన్ని అడ్డుకునే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఫారిన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ డిపాజిట్ పథకం కూడా ఒక ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ పథకం కింద బ్యాంకులు రూపీ రక్షణ చర్యల్లో భాగంగా ఆగస్టు 31 నాటికి 133 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. దీనికి తోడు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ బహిరంగ మార్కెట్ కార్యకలాపాల ద్వారా రూ.8.8లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసి నిధులను విపణిలోకి వదిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ డాలర్ పాయిస్వాప్ సదుపాయాల ద్వారా వ్యవస్థలో ద్రవ్య లభ్యతను నిరంతరం పెంచింది. ప్రస్తుతం లభ్యతలో ఉన్న అదనపు ద్రవ్య లభ్యతను ఉపసంహరించుకునే చర్యలను ఆర్బీఐ ప్రారంభించింది. రాబోయే పండుగల సీజన్లో ప్రజల నగదు వినియోగం మరింత పెరగడం, విదేశీ మారకపు మార్కెట్లో ఆర్బీఐ జోక్యం చేసుకోవడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ మరింత తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. దీని ఫలితంగా మున్ముందు రిజర్వ్‌మనీ వృద్ధిరేటు మందగించే అవకాశముంది. మరోవైపు, భారత్ ఇంధనాన్ని అధికంగా దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, దేశీయ వినియోగం, సేవల రంగం ఎంతో బలంగా ఉండటం వల్ల అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ పరిణామాలను మన దేశం సమర్థవంతంగా తట్టుకోగలుగుతోందని ఆర్బీఐ ఉవాచ. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుండటంతో, నిత్యావసరాల ధరల నియంత్రణకు మరింత కఠినమైన ద్రవ్య విధాన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. భారత ఆర్థికవ్యవస్థలోగణనీయమైన భాగంఇంకా అనధికారిక పరిధిలోనే ఉంది.గ్రామీణ ప్రాంతాలు, స్థానిక కూరగాయల మార్కెట్లు, చిన్నకిరాణా కొట్టు యజమానులు, రోజువారీ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు ఇప్పటికీ నగదు లావాదేవీలకే ప్రాధాన్యత ఇస్తారు. యూపిఐ ఛార్జీల భయం, పన్నుల పరిధిలోకి వస్తామనే సందేహాలు లేదా నెట్‌వర్క్ సమస్యల కారణంగా చిన్న వ్యాపారులు నగదునే నమ్ముకుంటున్నారు.ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం ప్రజలు డిజిటల్ చెల్లింపులను వేగవంతమైన సాధనంగా వాడుతున్నప్పటికీ,ఆకస్మిక సాంకేతిక లోపాలు లేదా బ్యాంకింగ్ సర్వర్ల అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడకుండా ఉండటానికి ముందస్తు రక్షణగా తగినంత నగదును చేతిలో ఉంచుకొన్న సందర్భాలు కోకొల్లలు.ముఖ్యంగా రూ.100, రూ.200, రూ.500నోట్లను ఇళ్లలో ఎక్కువగా ఉంచుకోవడానికి ఇది ఒక కారణం.రిజర్వ్ బ్యాంకుపై కరెన్సీ నిర్వహణ భారం బాగా ఎక్కువే. కరెన్సీ నోట్ల చలామణి అధికమవడం వల్ల ప్రతి ఏటా వేల కోట్ల రూపాయలను కొత్త నోట్ల ముద్రణ, రవాణా, పాత నోట్ల రద్దు కోసం ప్రభుత్వం వెచ్చించాల్సి వస్తోంది. అందుకే రిజర్వ్ బ్యాంకు దీర్ఘకాలిక పరిష్కారంగా 'పాలిమర్/ప్లాస్టిక్ నోట్ల' యోచనలో ఉంది. అందుకు సన్నాహాలు కూడా మొదలు పెట్టింది. ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరిగే కొద్దీ, మార్కెట్లో జరిగే మొత్తం లావాదేవీల సంఖ్య కూడా పెరుగుతుంది. జిడిపి వృద్ధి చెందినప్పుడు ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. డిజిటల్ శాతం పెరిగినప్పటికీ, స్థూలసంఖ్య దృష్ట్యా నగదు అవసరం కూడా ఎక్కువగానే ఉంటుంది. రూ. 2000నోట్లను రిజర్వ్ బ్యాంకు వెనక్కి తీసుకున్న తర్వాత, ఆ స్థానాన్ని రూ. 500నోట్లు ప్రధానంగా ఆక్రమించాయి. మొత్తం కరెన్సీ విలువలో రూ.500నోట్ల వాటా 85శాతం పైగా పెరిగింది. దాంతోపాటు ఏటీఎంలద్వారా లావాదేవీల సౌలభ్యం, నగదు రూపంలో పొదుపు చేసుకునే సాంప్రదాయ అలవాటు ప్రజల్లోకొనసాగుతుండటం కూడా దీనికి కారణం. చిన్నచిన్న కొనుగోళ్లకు డిజిటల్ క్యూఆర్ కోడ్లను వాడుతూనే, అత్యవసర సమయాలు, ప్రయాణాలు లేదా స్థానిక చెల్లింపులకు నగదును ప్రత్యామ్నాయ రక్షణగా వాడుతున్నారు.రిటైల్ స్థాయిలో కొంత మంది వ్యాపారులు డిజిటల్ రికార్డుల్లో చూపిస్తేజీఎస్‌టి, ఇన్కమ్ టాక్స్ వర్తిస్తుందనే ఉద్దేశంతో కొనుగోలుదారులను నగదు వైపే ప్రోత్సహించడం కూడా ఒక అంతర్లీన కారణం. భారత ఆర్థికవ్యవస్థలో అనధికారిక లావాదేవీలు, నగదు వినియోగం పెరగడం ప్రస్తుత పరిస్థితుల్లో తప్పని సరి అవుతోంది. డిజిటల్ లావాదేవీలపై మౌలిక వసతులు మరింత పటిష్టం చేసి, గ్రామీణ స్థాయిలో డిజిటల్ అక్షరాస్యతను విస్తరిస్తే తప్ప నగదు చలామణి అనుకున్న స్థాయిలో తగ్గకపోవచ్చు.

ప్రవర్తన అనేది తెల్లకాగితం లాంటిది. ఒక్కసారి దాని మీద మరక పడితే మళ్లీ తెలుపు కావడం కష్టం.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

తమకు తెలీనిదానిని తెలుసనే విధంగా వ్యవహరించేవారు, తమకు తెలిసిన విషయాల్ని గురించి కూడా తెలీనివారుగా పరిగణించబడతారు.



తిరువళ్లువర్

# ప్రజావాక్కు

## థింక్ బిఫోర్ ఇంక్

**ఓటు** వేసే ముందు ఒక్కనిమిషం ఆలోచించండి. సమర్థులను ఎన్నుకోండి. కేజీవంకాయలు కొనాలంటే పుచ్చినవి,ముదిరినవిలేకుండాచూసి,లేతవంకాయలు కొంటాం కదా. మరి మన నగర భవిష్యత్తుకు సంబంధించి ఐదు సంవత్సరాల పాలననునిర్ణయించేటప్పుడు మనం ఎంత జాగ్రత్త తీసుకోవాలి?ఆలోచించండి.మంచివ్యక్తిని ఎన్నుకోకపోతే నగరాన్ని కూడా తాకట్టు పెట్టేవాళ్ళు ఉంటారు. చేలో మంచి విత్తనం వేస్తే మంచి పంట వస్తది. పుచ్చిన విత్తనం వేస్తే అసలు పంటే రాదు.కనుక సరి అయిన అభ్యర్థులను ఎన్నుకుందాం.రేపు ఆదివారం మున్సిపల్ ఎన్నికలలో ఓటు వేసేవారు ఒకనిమిషం ఆలోచించి ఓటు వెయ్యండి. మన కులం వాడని,మన మతం వాడని ఓటు వేయకండి.డబ్బు తీసుకొని ఓటు వేస్తే తరువాత ప్రశ్నించే హక్కు కోల్పోతాం.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ప్రకృతి ముందు తలవంచాల్సిందే

**అర్నబ్** తుఫాను కోస్తాంధ్రను అతలాకుతలం చేసింది. చేతికొస్తున్న పంటలను, వందలాదిగా వందేళ్ల జీవనాధారంగా నిత్య సంపదను ఎంతో కొంత ఇస్తున్న కొబ్బరి చెట్లు నేలకొరిగాయి.ఇటువంటితుఫానులు సముద్ర ప్రాంతం ఎక్కువగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్తకాకపోయినాఅన్నివిధాలా కోట్లరూపాయల నష్టం వాటిల్లింది. ఇది భర్తీ కావడానికి చాలా కాలం పడుతుంది. గతంలో హుద్‌హుద్ తుఫాను, అంతకు ముందు దశాబ్దాల క్రితం కృష్ణా జిల్లాలోని దివిసీమ ఉప్పెన ప్రాణ, ఆస్తి నష్టాలను కలుగచేసాయి. కేంద్రప్రభుత్వాలు ఎంత ఆర్థిక సహకారం చేసినా అది కొంతవరకే సహకరిస్తుంది. తుఫాను కారణంగా సంభవించిన మరణాలు ఎవరూ పూడ్చలేని విషాదాలు. ప్రకృతి ముందు ఎంత అభివృద్ధి చెందిన దేశమయినా తలవంచ వలసిందే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## గోల్‌మాల్ జరగొద్దు

**దేశవ్యాప్తంగా** ఎల్‌నినో విపత్తు కొనసాగుతున్న సందర్భంగా రైతన్నలు పండించేపంటలను గోల్‌మాల్ చేయకుండా అధిక ధర కల్పించాలి. మార్కెట్ యార్డ్‌ల వద్ద ప్రైవేట్ అధికారులు కుమ్మక్కై నాణ్యత లేమి పేరుతో ధర తగ్గిస్తూ రైతన్నలకు ధర తగ్గిస్తున్నారు. ఒకవైపు ప్రైవేట్ వ్యాపార దళారుల మోసం భరించలేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఆదుకోవాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## ఆంధ్రపై మరో దెబ్బ అర్నబ్ తుఫాను

**ఎల్‌నినో** ప్రభావంతో పంటలు నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్‌పై అర్నబ్ తుఫాను విరుచుకుపడి మరింత పెద్ద దెబ్బ తీసింది. ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో వేల ఎకరాల పంటలు నాశనమయ్యాయి. విద్యుత్‌స్తంభాలు,మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. ఏడుగురి ప్రాణాలు గాలిలో కలిశాయి. గత తుఫానుల కన్నా ప్రాణనష్టం తగ్గినా, ఆస్తినష్టం అపారంగా ఉంది. మళ్లీ వారంలోగా మరో తుఫాను వచ్చే అవకాశం ఉన్నట్టు వస్తున్న వార్తలుప్రజల్ని కలవరపెడుతున్నాయి.యంత్రాంగం సన్నద్ధత పరంగా గతంతో పోలిస్తే విపత్తు నిర్వహణ మెరుగ్గా ఉన్నప్పటికీ మరింత సమర్థత చేకూర్చుకోవాల్సి ఉంది. పంట నష్టాల్ని త్వరితంగా బేరీజు వేసి ప్రభుత్వ సాయం అందించాలి. యుద్ధ ప్రాతిపదికన మౌలికసదుపాయాల్ని పునరుద్ధరించాలి. కేంద్రం వెంటనే నిధుల్ని అందించాలి. పదేపదే తుఫానుల బారినపడుతున్న రాష్ట్రానికి ప్రత్యేక ప్రణాళికలు,సదుపాయాలు కల్పించాలి.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

## నీటి పొదుపు

**నీరు** ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరం. నీరు లేనిదే జీవనం లేదు. మన రోజువారీ అవసరాల నుంచి వ్యవసాయం వరకు ప్రతి పనికీ నీరే ఆధారం. అలాంటి నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవడం మనందరి బాధ్యత. అవసరానికి మించి నీటినివృథా చేయకూడదు.వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భజలాలు పెరిగేలా చూడాలి. చెరువులు, కుంటలు,బావులు వంటి నీటివనరులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటిని కలుషితం కాకుండా కాపాడుకోవాలి. ప్రకృతిలో నీటిలభ్యతను కాపాడుకోవడం ఎంతోఅవసరం.నీటి విలువను గుర్తించి, ప్రతిఒక్కరూ దాని పొదుపుకు ప్రాధాన్యత ఇవ్వాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## శిక్షణ అవసరం

**భారత** ఉద్యోగ మార్కెట్‌లో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న కొద్దీ నైపుణ్యాల విలువ కూడా మారుతోంది. కృత్రిమ మేధస్సు ఆధారిత ఉద్యోగాల్లో వేతన వృద్ధి వేగంగా ఉండగా, కొన్ని సంప్రదాయ సాంకేతిక ఉద్యోగాల్లో వేతనాల పెరుగుదల మందగించడం ఈ మార్పుకు సంకేతం. ఈ నేపథ్యంలో కళాశాలవిద్య కేవలం సిద్ధాంత పరిజ్ఞానానికే పరిమితంకాకూడదు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలనునవీకరించడంతోపాటు,ఆచరణాత్మక కృత్రిమ మేధస్సు శిక్షణ, పరిశ్రమలతో కలిసి ఇంటర్న్‌షిప్‌లు అందించాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆపన్నహస్తం అందించాల్సిన తరుణం

**ఉపద్రవాలు సంభవించినప్పుడు ఎవరు అధికారంలో ఉన్నా బాధితులందరినీ అన్నిరకాలుగా ఆదుకోవడం అనేది మానవ మాత్రులకు సాధ్యపడే పనికాదు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సర్వసాధారణమైపోయాయి. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి విమర్శించడమే కర్తవ్యంగా భావించి ఆరోపణలు గుప్పించవచ్చు. అదే అధికారంలో ఉన్నాం గనుక ప్రభుత్వం చేసే అన్ని పనులు సమర్థించుకోవచ్చు. కానీ నిజానిజాలు ఏమిటో ప్రజలకు తెలియకుండాపోదు. అంతేకాదు ఎందుకోఏమోకానీ ఎలాంటి ఇబ్బంది వచ్చినా ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించడం కొందరికి రివాజుగా మారిపోయింది. దోమ కుట్టినా, కుక్క కరిచినా, అరిచినా ప్రభుత్వాన్ని బాధ్యత చేస్తూ ఇష్టానుసారంగా విమర్శించడం అలవాటుగా మారిపోతున్నది. ఇలా ఏ చిన్న కష్టం అనిపించినా పాలకులను నిలదీస్తున్నారు. తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోలేక అపరిశుభ్రత వల్ల ఇబ్బందులు ఏర్పడితే పాలకులపై విమర్శలు ఎక్కుపెట్టడం ఎంతవరకు సమంజసం? బాధ్యత కలిగిన పౌరులు ఆలోచించాలి. ప్రభుత్వానికి బాధ్యత లేదని చెప్పడం లేదు.**

దామెర్ల సాయిబాబ

మానవుడు సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఇతర రంగాల్లో మరెంత అభివృద్ధి సాధించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుంచి బయటపడలేకపోతున్నాడు. తాజాగా ప్రజాజీవనంపై విరుచుకుపడిన అర్నబ్ తీవ్ర తుఫాన్ ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో బీభత్సమే సృష్టించింది. మొన్న మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఉభయ గోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు జిల్లాలపై విరుచుకుపడి ఆ ప్రజలను చిగురుటాకులా వణికించింది. 130 కిలోమీటర్లకుపైగా వేగంతో వీచిన పెనుగాలులతో వేలాది వృక్షాలు నేలకొరగగా అంతకు రెట్టింపు స్థాయిలో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అయితే ముందస్తుగా ఎపిలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ప్రాణనష్టాన్ని తగ్గించగలిగారు. ఇక తెలంగాణపై కూడా ఈ తుఫాన్ ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. ఖమ్మం, సూర్యపేట తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. మొత్తం మీద ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోదాదాపు పది మంది ప్రాణాలతోపాటు వేలాది ఎకరాలలోని పంటలకు అపార నష్టంకలిగింది. వరి పంటేకాక అరటి తోటలు, మిర్చి, కూరగాయలు లాంటి మెట్టపంటలకు కూడా జరిగిన నష్టంతో అన్నదాతలు కుప్పకూలిపోయారు. పెట్టుబడులన్నీ పెట్టి నోటికందుతున్న దశలో నీటిపాలు కావడంతో రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మోకాళ్లలోతు నీటిలో మునిగిన పంటలను కాపాడేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలు చూస్తే ఆవేదన కలగకతప్పదు. అయితే అక్కడక్కడ ఏవో చిన్నచిన్న లోపాలు తప్ప ఈ అర్నబ్ తుఫాన్ భారినపడకుండా ప్రజలను కాపాడేందుకు నష్టాలను తగ్గించేందుకు పాలకులు శక్తికి మించిన కృషేచేశారని చెప్పొచ్చు. ముందస్తు ప్రణాళికతో ఎప్పటికప్పుడు సమీక్షలు, ఆదేశాలతో చర్యలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తినష్టాలు తగ్గించగలిగారు. ఇలాంటి ఉపద్రవాలు సంభవించినప్పుడు ఎవరు అధికారంలోఉన్నా బాధితులందరినీ అన్నిరకాలుగా ఆదుకోవడం అనేది మానవమాత్రులకు సాధ్యపడేపనికాదు.అయితే రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సర్వసాధారణమైపోయాయి. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి విమర్శించడమే కర్తవ్యంగా భావించి ఆరోపణలు గుప్పించవచ్చు. అదే అధికారంలో ఉన్నాం గనుక ప్రభుత్వం చేసే అన్ని పనులు సమర్థించుకోవచ్చు. కానీ నిజానిజాలు ఏమిటో ప్రజలకు తెలియకుండాపోదు. అంతేకాదు ఎందుకోఏమోకానీ ఎలాంటి ఇబ్బందివచ్చినాప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించడం కొందరికి రివాజుగా మారిపోయింది. దోమ కుట్టినా, కుక్క కరిచినా, అరిచినా ప్రభుత్వాన్ని బాధ్యత చేస్తూ ఇష్టానుసారంగా విమర్శించడం అలవాటుగా మారిపోతున్నది. ఇలా ఏ చిన్న కష్టం అనిపించినా పాలకులను నిలదీస్తున్నారు. తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోలేక అపరిశుభ్రత వల్ల ఇబ్బందులు ఏర్పడితే పాలకులపై విమర్శలు ఎక్కుపెట్టడం ఎంతవరకుసమంజసం? బాధ్యత కలిగిన పౌరులు ఆలోచించాలి. ప్రభుత్వానికి బాధ్యత లేదని చెప్పడంలేదు.ఎంతవరకు ఎన్ని పనులు చేయగలుగుతుందో ఆలోచించాలి. గతంలో తోటి ప్రజలు కష్టాల్లో ఉంటే వాటిని ఆదుకునేందుకు ప్రజలు, స్వచ్ఛంద సేవాసంస్థలు మరెన్నో సంఘాలు, రాజకీయ పార్టీలు తమ కుతాముగా ముందుకు వచ్చి చేతనైనంత సహాయం అందించేవారు. మేమున్నాం అధైర్యపడకండి అంటూ బాధితు

ఒక్క మాట

లకు ఎంతో చేయూతనిచ్చేవారు.ఇప్పుడు లేరనికాదు. రాను రాను తగ్గిపోతున్నారు. రికార్డుల్లో మాత్రం స్వచ్ఛంద సేవా సంస్థలు పెరిగిపోతున్నాయి. ఏదిఏమైతేనేం అర్నబ్ తుఫాన్ ఆయా ప్రాంతాలను అతలాకుతలం చేసిందనే చెప్పొచ్చు. బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడిందనేవార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కోస్తా తీరానికి తుఫాన్‌ల తాకిడి ఎక్కువగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. కారణాల గూర్చి శాస్త్రజ్ఞులే స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఎందుకో ఏమోకానీ బంగాళాఖాతంలో మాత్రం ఈతుఫాన్‌లు పెరిగిపోతున్నాయని శాస్త్రజ్ఞులుకూడా అంగీకరిస్తున్నారు. బంగాళాఖాతంలో నాలుగు తుఫాన్‌లు వస్తే అరేబియా సముద్రంలో ఒకటి వస్తున్నది. వీటి ప్రభావం ఎక్కువగా కోస్తాపైనే పడుతున్నది. 1892 నుంచి 1989 వరకు లెక్కలు పరిశీలిస్తే 69 తుఫాన్‌లు కోస్తా తీరాన్ని దాటాయి. ఈ తుఫాన్‌లు కొన్ని పెనుతుఫాన్‌లుగా మారి ధనధాన్యాలతో తులతూగే పల్లె సీమలను మరుభూమిగా మార్చాయి. అన్నిటికంటే ముఖ్యంగా 1977 నవంబరు 19న సంభవించిన తుఫాన్ ధాన్యాగారమైన దివి సీమను దిక్కులేని శవాల సీమగా మార్చివేసింది. వేలాది మంది ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. ఇప్పటికీ ఆ బీభత్సాన్ని మరిచిపోలేకపోతున్నారు. రికార్డుస్థాయిలో గంటకు 260 కిలోమీటర్లకుపైగా వేగంతో గాలులు వీచాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అంతటి పెను తుఫాన్ అంతకుముందు కానీ, ఆ తర్వాత కానీ రాలేదని చెప్పొచ్చు. గాలి వేగాన్ని బట్టి తీవ్రతను అంచనా వేస్తారు. అంతేకాదు వాయుగుండమా, తుఫానా, పెనుతుఫానా లాంటివి కూడా నిర్ధారించేవి గాలివేగాన్నిబట్టే. గాలివేగం 32కిలోమీటర్ల లోపల ఉంటే దాన్ని అల్పపీడనం అంటారు. 32 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్ల వరకు వాయుగుండం, ఆ తర్వాత 59వరకు తీవ్ర వాయుగుండం, 60-90 కిలోమీటర్ల వరకు తుఫాన్,90-119 వరకు తీవ్ర తుఫాన్, 119-220 వరకు భారీ తుఫాన్, 220 నుండి ఆపైన పెనుతుఫాన్‌గా నిర్ధారిస్తారు. ఈతుఫాన్‌లను గుర్తుంచుకునేందుకు తుఫాన్‌లకు పేర్లు పెడుతున్నారు. అయితే ఈ తుఫాన్‌లకు సంబంధించి అధ్యయనం దాదాపు ఏడు దశాబ్దాల కిందట ఆరంభమైనా రాకడా, పోకడ గురించి కొంత సమాచారం అందించగలుగుతున్నా నివారించే చర్యలు తీసుకునే సాంకేతిక పరిజ్ఞానం ఇంకా శాస్త్రవేత్తలు కనుగొనలేదు. తుఫాన్‌ల గురించి ముందుగా హెచ్చరిస్తున్నారే తప్ప వాటి ప్రభావం ప్రజాజీవనంపై పడకుండా దిశను మార్చేశక్తి మన శాస్త్రవేత్తల పరిశోధనలకు అందలేదు.1961 నుంచి కృత్రిమ ఉపగ్రహాలు అందుబాటులోకి వచ్చినా వాతావరణాన్ని అవగాహన చేసుకొని రాకపోకల రహస్యాలను కొంతమేరకు కనుగొంటున్నారు. తుఫాన్‌ల కాలపరిమితి సగటున ఐదు,ఆరు రోజులకు మించి ఉండదు. కానీ శాస్త్రజ్ఞులు ఊహించని విధంగా కొన్నిసార్లు ముప్ఫైఒక రోజులకు మించిపోయింది. 1994లో వచ్చిన 'టైఫూన్' తుఫాన్ 31 రోజులు ఉండగా,1971లో వచ్చిన 'హరికేన్ జింజర్'తుఫాన్ 28 రోజులు ఉంది. ప్రస్తుతం వచ్చిన అర్నబ్ తుఫాన్ అపారనష్టం కలిగించినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నప్పుడు అంతోఇంతో ఆయా రాష్ట్రప్రభుత్వాలు స్పందిస్తున్నాయి. తలదాచుకునేందుకు షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. తాత్కాలిక సహాయం అందిస్తున్నారు.ముందుగాముప్పునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించడం, విద్యుత్ అంతరాయాలు, రోడ్లకు గండ్లుపడడంతో రాకపోకలు స్తంభించే ప్రాంతాలను కూడా గుర్తించడం, అలాగే విమానాల, రైళ్ల రాకపోకలను రద్దు చేయడం లాంటి ముందస్తు చర్యలను కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం అవసరమైన రీతిలో సకాలంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోకి రైతులకు చేయూతనివ్వడం లేదు. ఇలాంటివి జరిగినప్పుడు నష్టం అంచనాలకు అధికార బృందాలను పంపి చేతులు దులుపుకుంటున్నారు. అది కూడా ఆ బృందాలు దొంగలుపడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్లు వారికి తీరినప్పుడు, అంతా మరిచిపోయినప్పుడు వచ్చి మొక్కుబడిగా చూసివెళ్లుతున్నారు. ఆ బృందాలపై ప్రజలకు ఎప్పుడో నమ్మకాలు సన్నగిల్లాయి. చూసిపోవడమేతప్ప వారు చేసేదేమీలేదనే వాదనకు కేంద్రప్రభుత్వ వ్యవహారశైలి బలం చేకూరుస్తున్నది. రాష్ట్రప్రభుత్వాలు సర్వేల ఆధారంగా నష్టాల నివేదికను తయారు చేసి ఆర్థికసహాయం అందించాలని అడుగుతున్నదాంట్లో పదోవంతు కూడా కేంద్రం ఇవ్వడం లేదు. ఇలాంటి ఆపదలు సంభవించినప్పుడు కేంద్రప్రభుత్వం ఆపన్నహస్తం అందించాలి. స్వచ్ఛంద సంస్థలు ఇందులో భాగస్వామ్యులు కావాలి. ఆపదలో ఉన్న అన్నార్థులకు ఆపన్న హస్తం అందివ్వాల్సిన తరుణమిది.

# ఎన్నికల కోసం రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలి!

బొల్లిముంత సాంబశివరావు

'సర్ వేరిఫికేషన్ వెడల, కొత్త ఓటర్ల నమోదు వెడల, ఏకపక్ష నిర్ణయాలతో 13కోట్ల ఓట్లను తొలగించి ఎన్నికల్లో ఎన్‌డిఏకి ప్రయోజనం చేకూర్చటమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు కాక్రోచ్ జనతాపార్టీ పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. సీఈసి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆయన ఏకపక్ష నిర్ణయాలపై దాఖలైనపిటిషన్లపైన సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించింది. సీఐసీ నిర్ణయాలు పార్లమెంటరీ ఎన్నికల భూటకత్వాన్ని మరొకసారి వెల్లడించింది. దేశంలోని ఎన్నికల వ్యవస్థ ఎంతో ప్రజాస్వామ్యం, పవిత్రమైనదిగా ప్రచారం చేస్తున్న పాలక పార్టీలు, ఆ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంగా మార్చడం ద్వారా, పార్లమెంటరీ ప్రజాస్వామ్య డొల్లతనం బయటపడింది.సీఇసీ రాజీనామా ఉద్యమ నేపథ్యంలో దేశంలోపార్లమెంటరీ 'ప్రజాస్వామ్యం' అమలు జరుగుతున్న తీరు ఏమిటన్నది ప్రశ్నించుకోవాలి. అధికార మార్పిడి జరిగిన తర్వాత మొదటి సాధారణ ఎన్నికల దగ్గర నుండి నేటి వరకు పాలక పార్టీలు, ప్రభుత్వాలు ఎన్నికల్లో గెలవడానికి డబ్బు, రౌడీయిజం,రిగ్గింగ్, కులం, మతం, ప్రాంతం అన్నిటిని ఉపయోగించాయి. నేడు డబ్బులు, రిగ్గింగ్, కులం, మతం ఉపయోగించకుండా ఎన్నికల్లో గెలవలేని పరిస్థితి పాలక పార్టీలకు ఏర్పడింది. ప్రధాన ఎన్నికల కమీషనర్ కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలకు అనుకూలమైన నిర్ణయాలే చేస్తారు, చేశారు.'సర్' అమలు తీరు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, ఓట్ల తొలగింపు ఏకపక్ష నిర్ణయాలు అందులో భాగంగా జరిగిందే. ఆయన మాతో సంప్రదించకుండా, మా అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని మిగతా ఇద్దరు సభ్యులు చెప్పింది బయటకు రావడం ప్రస్తుత ఆందోళనకు కారణమైంది. ఎన్నికల్లో విచ్చలవిడి డబ్బు వినియోగం, మద్యం, అధికారులను ప్రభావితం చేయడం నిరంతర ప్రక్రియగా ఉంది. సామాన్యుడుకి ఎన్నికల్లో పోటీ చేయడమనే ఆలోచనే రావడం లేదు. ప్రస్తుత ఎన్నికల విధానం సంపన్న వర్గాలకే పరిమితంగా ఉంది. అలాంటప్పుడు జ్ఞానేష్ కుమార్ రాజీనామ కోరడమే సరిపోదు. ఎందుకంటే, భారత రాజ్యాంగంలో ఎన్నికల వ్యవస్థ ఒక భాగం. దానికి రాజ్యాంగం, దాని ప్రతినిధి అయిన ప్రభుత్వం రక్షణగా ఉంటుంది. సంపన్న వర్గాల ప్రయోజనాలకు రక్షణగా ఉంటూ, పేద సామన్య ప్రజల ప్రయోజనాలు కాపాడటంలో పూర్తిగా విఫమైంది. అందువల్ల రాజ్యాంగం సమూలంగా మార్పు చెందకుండా ఎన్నికల వ్యవస్థ ప్రజాస్వామికంగా ఉండదు.రాజ్యాంగ మార్పును సీజేపీ కోరుకోకపోగా సమర్థిస్తున్నది. సీఈసీ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల వ్యవస్థ భూటకత్వాన్ని బట్టబయలు చేయాలి. కాంగ్రెస్, ఇతర పాలక పార్టీలు ఆపని చేయవు. దేశ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు పిలుపు ఎందుకు ఇవ్వడం లేదు. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కాకుండా, ఎన్నికల విధానంలో మౌలిక మార్పులు రావు. దేశంలో నిరుద్యోగం, అవినీతి, పేదరికంతో యువత, విద్యార్థులు, గ్రామీణ పేదలు సతమతం అవుతున్నారు. యువత ఈ సమస్యల వైపు కదిలినప్పుడే ఉద్యమానికి సరైన పునాది ఏర్పడుతుంది. దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రధాన ఎన్నికల అధికారి రాజీనామాను డిమాండ్ చేస్తూనే, ప్రజాస్వామ్య ఎన్నికలవ్యవస్థ కోసం, ఉద్యోగ, ఉపాధి కోసం,పేదరికం తొలగింపు కోసం యువత, విద్యార్థులు, గ్రామీణ, పట్టణ పేదలతో కలిసి రాజ్యాంగం సమూల మార్పు కోసం ఉద్యమించాలి.

# ఫ్లెక్స్ ఫ్యూయల్‌తో ఇంధన స్వావలంబన సాధ్యమేనా?

టి. శ్రీనివాస్

పెట్రోల్ ధరల పెరుగుదల, ముడిచమురు దిగుమతులపై ఆధారపడటం, వాహన కాలుష్యం ఈ మూడు సమస్యలు భారత ఆర్థిక వ్యవస్థకు, ప్రజల జీవనానికి సవాలుగా మారుతున్నాయి. ఇంధన అవసరాలు పెరుగుతున్న కొద్దీ విదేశీ చమురుపై ఆధారపడటం దేశ ఆర్థిక భద్రతపై ప్రభావం చూపుతోంది. మరోవైపు, పెట్రోల్, డీజిల్ ధరల్లో వచ్చే మార్పులు సామాన్యుల కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నాయి. ఈపరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం అనివార్యంగా మారింది. ఈ దిశగా ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ నిర్ణయం ఇంధన రంగంలో ఎలాంటి మార్పులకు దారితీస్తుంది? వాహనదారులకు ఎంతవరకు ప్రయోజనం చేకూరుతుంది? రైతుల ఆదాయం,పర్యావరణ పరిరక్షణకు ఇది దోహదపడుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ 2026 అక్టోబర్ 26న ప్రకటించిన నిబంధనల సవరణలో భాగంగా, అధిక ఇథనాల్ శాతం కలిగిన ఇంధనాలను ఉపయోగించే వాహనాల ఉద్గార ప్రమాణాల్లోని 'ఇ100'ను కూడా చేర్చారు. దీనివల్ల నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు 'ఇ85'తోపాటు 'ఇ100' ఇంధనాన్ని ఉపయోగించేందుకు ధ్రువీకరణ పొందే మార్గం సుగమమైంది. ఇది ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని విస్తరించే ప్రయత్నంలో ఒక ముందడుగుగా చెప్పవచ్చు. అయితే, ఈ మార్పును అన్ని పెట్రోల్ వాహనాలకు వర్తించే సాధారణ అనుమతిగా భావించకూడదు. అధిక ఇథనాల్ శాతాన్ని తట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించి, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ధ్రువీకరించిన వాహనాలకే ఈ వెసులుబాటు ఉంటుంది. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల ప్రత్యేకత ఏమిటంటే, అవి పెట్రోల్‌తోపాటు వివిధ నిష్పత్తుల్లో పెట్రోల్, ఇథనాల్ మిశ్రమాలను ఉపయోగించగలిగేలా రూపొందించబడతాయి. ఇ20లో 20శాతం ఇథనాల్ ఉండగా, ఇ85లో 85శాతం ఇథనాల్ ఉంటుంది. ఇ100 అనేది దాదాపు పూర్తిగా ఇథనాల్‌తో కూడిన ఇంధనాన్ని సూచిస్తుంది. ఈ వాహనాల్లో ఇంజిన్, ఇంధన సరఫరా వ్యవస్థలు అధిక ఇథనాల్ శాతానికి అనుగుణంగా పనిచేసేలా ప్రత్యేక సాంకేతికతను ఉపయోగిస్తారు. ఇంధన మిశ్రమంలో మార్పులకు అనుగుణంగా ఇంజిన్ పనితీరును సర్దుబాటు చేసుకునే సామర్థ్యం వీటి ప్రత్యేకత.అయితే, సాధారణ పెట్రోల్ వాహనాల్లో ఇలాంటి ఇంధనాలను యథేచ్ఛగా ఉపయోగించడానికి వీల్లేదు. వాహన తయారీదారు సూచనలు, నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగాపాటించాలి. భారతదేశం ముడిచమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. అంతర్జాతీయ



మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినప్పుడు దేశ దిగుమతి బిల్లు పెరగడమే కాకుండా, విదేశీ మారకద్రవ్య నిల్వలపై ఒత్తిడి ఏర్పడుతుంది. యుద్ధాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, సరఫరామార్గాల్లో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఈసమస్య మరింత తీవ్రమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో దేశీయంగా ఉత్పత్తి చేసే ఇథనాల్‌ను రవాణా రంగంలో వినియోగించడంవల్ల ముడిచమురుపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. ఇంధన అవసరాల్లో దేశీయ వనరుల వాటా పెరగడం జాతీయ ఆర్థిక భద్రతకు మేలుచేస్తుంది. అయితే,ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల ప్రవేశంతోనే చమురు దిగుమ తుల సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని భావించడం అతిశయోక్తే. ఈవాహనాల సంఖ్య, ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం, ఇంధన ధరలు, సరఫరావ్యవస్థల అభివృద్ధిపైనే వాస్తవ ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. ఇథనాల్ ఉత్పత్తి వ్యవసాయ రంగానికి కొత్త అవకాశాలను అందించగలదు. చెరకు, మొక్కజొన్న, మొలాసిస్ వంటి ముడిపదార్థాల నుంచి ఇథనాల్‌ను తయారు చేయవచ్చు. వీటికి డిమాండ్ పెరిగితే రైతులకు అదనపు మార్కెట్ లభించే అవకాశం ఉంటుంది. ఇథనాల్ తయారీ పరిశ్రమలు విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరగవచ్చు. వ్యవసాయాన్ని ఆహార ఉత్పత్తికే పరిమితం చేయకుండా, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలోనూ భాగస్వామ్యం చేయడం ఆర్థికంగా ఉపయోగకరమే. కానీ ఈ ప్రక్రియలో రైతులకు నిజంగా ఎంత ప్రయోజనం చేకూరుతుందన్నది కీలకమైన ప్రశ్న. పంటలకు గిట్టుబాటుధరలు లభిస్తున్నాయా? ఇథనాల్ తయారీ సంస్థలు రైతులకు సకాలంలో చెల్లింపులు చేస్తున్నాయా? వ్యవసాయ ఉత్పత్తుల ధరల్లో స్థిరత్వం ఉంటుందా? వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. అదే సమయంలో ఆహార భద్రతను విస్మరించకూడదు. ఇంధన ఉత్పత్తి కోసం పంటల సాగు విస్తరించినప్పుడు ఆహార పంటలకు అందుబాటులో ఉండే భూమి, నీరు, వ్యవసాయ వనరులపై ఒత్తిడి పెరిగేప్రమాదం ఉంది. ముఖ్యంగా నీటి కొరత ఉన్నప్రాంతాల్లో అధికనీరు అవసరమయ్యే పంటలను విస్తృతంగా ప్రోత్సహిస్తే సాగునీటి సమస్యలు తీవ్రమవుతాయి. కాబట్టి ఇథనాల్ ఉత్పత్తిని పెంచే విధానాలు పంటల వైవిధ్యం, నీటిపొదుపు,ఆహార భద్రతకు అనుగుణంగా ఉండాలి. వ్యవసాయ వ్యర్థాలు,మిగులు పదార్థాల నుంచి ఇంధనం తయారుచేసే సాంకేతికతలను ప్రోత్సహించడం కూడా ఈ దిశగా ఉపయోగకరంగా ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ ఫ్లెక్స్‌ఫ్యూయల్‌వాహనాల సామర్థ్యాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలి. అధిక ఇథనాల్ మిశ్రమాలను ఉపయోగించే వాహనాలు కొన్ని రకాల కాలుష్య ఉద్గారాలను తగ్గించగలిగినా, మొత్తం పర్యావరణ ప్రయోజనం ఇథనాల్ ఉత్పత్తి విధానంపై ఆధారపడి ఉంటుంది. పంటల సాగు నుంచి ఇంధన తయారీ,రవాణా, వాహన వినియోగం వరకు ప్రతి దశలో వినియోగించే శక్తి, విడుదలయ్యే ఉద్గారాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇథనాల్ ఉత్పత్తి కోసం అధికశక్తి వినియోగిస్తే లేదా పర్యావరణానికి హాని కలిగించేపద్ధతులు అనుసరిస్తే ఆశించిన ప్రయోజనాలు తగ్గిపోవచ్చు. అందువల్ల వాహనం నుంచి వెలువడే కాలుష్యాన్ని మాత్రమే కాకుండా, ఇంధనం ఉత్పత్తి నుంచి వినియోగం వరకు మొత్తం ప్రక్రియను పరిగణనలోకి తీసుకొని పర్యావరణ ప్రయోజనాలను అంచనా వేయాలి.

## నా చివరి శ్వాస దాకా
# ప్రజాసేవలోనే ఉంటా: ప్రధానిమోడీ



**బనస్కాంత, అక్టోబరు 30:** నా జీవితంలో చివరి శ్వాస ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల పాట్నాలో జరిగిన సమావేశంలో మోడీ నాన్న కూడా వెళ్లిపోతారని వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని కుటుంబాన్ని కాంగ్రెస్ టార్గెట్ చేస్తోందని దుయ్యబట్టారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలకు మోడీ కౌంటర్ ఇచ్చారు. గుజరాత్ బనస్కాంత జిల్లా భిల్డి పట్టణంలో భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మోడీ సభలో ప్రసంగించారు. ఈ పర్యటనలో భాగంగా సుమారు రూ.14వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. దేశ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు కొందరు సంతోషిస్తున్నారని మోడీ విమర్శించారు. దేశానికి కష్టం వచ్చిన ప్రతీసారి వారు ఆనందిస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పశ్చిమాసియా పరిణామాలతో రైతులకు ఎరువులు అందడం లేదని కొందరు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మోడీని అప్రతిష్టపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, వంటగ్యాస్ దొరకడని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. యుద్ధ పరిస్థితులు ఉన్నప్పటికీ భారత రైతులకు ఎరువుల కొరత రానీయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మోడీ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరిగాయని, అయినప్పటికీ భారత రైతులపై భారం పడకుండా ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా డీఏపీ బస్తా ధర రూ.5,000 దాటినా, భారత రైతులు దానిని రూ.1,350కే పొందుతున్నారని చెప్పారు.

# రూ.10వేల కోట్ల నష్టాన్ని నివారించండి మేడమ్!

### సోనియాగాంధీకి ఢిల్లీ వ్యాపారుల లేఖ



**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరగనున్న ఇండియా కూటమి ర్యాలీపై వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని, ర్యాలీని దీపావళి తర్వాతకు వాయిదా వేయాలని కోరుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో నవంబర్ 1న జరగనున్న ఇండియా కూటమి భారీ ర్యాలీ రాజకీయంగానే కాకుండా వ్యాపార వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ ర్యాలీ కారణంగా శనివారం, నవంబర్ 1 తేదీల్లో వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలగవచ్చని చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి లేఖ రాసింది. ఢిల్లీలో సుమారు 20 లక్షల మంది వ్యాపారులు ఈ పరిస్థితిపై ఆందోళనలో ఉన్నారని సిటిఐ పేర్కొంది. ర్యాలీ నిర్వహణతో రవాణా వ్యవస్థపై ఒత్తిడి పెరిగి, హోల్‌సేల్ మార్కెట్లకు సరుకుల రవాణా నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపింది. సిటిఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ ర్యాలీ జరగనున్న రామ్‌లీలా మైదానం చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో సుమారు 20 ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్ల నుంచి ప్రతిరోజూ దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలకు కూడా కోట్ల రూపాయల విలువైన సరుకులు రవాణా అవుతుంటాయి. ర్యాలీకి సుమారు 10 లక్షల మంది హాజరవుతారని ప్రచారం జరుగుతోందని, అయితే రామ్‌లీలా మైదానం సామర్థ్యం కేవలం 50 వేల మంది మాత్రమేనని బ్రిజేష్ గోయల్ పేర్కొన్నారు. ఈ స్థాయిలో జనసమీకరణ జరిగితే రవాణా సహా నగరంలోని మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత 25 రోజుల్లోనే ఢిల్లీలోని వ్యాపార రంగానికి సుమారు రూ.3వేల కోట్ల నష్టం వాటిల్లిందని సిటిఐ అంచనా వేసింది. నవంబర్ 1 ర్యాలీ వల్ల మరో రూ.10,000 కోట్ల వరకు నష్టం కలగవచ్చని పేర్కొంది. దీపావళి తర్వాత ర్యాలీ నిర్వహించాలని విజ్ఞప్తి దిగితో పాటు మరికొన్ని వ్యాపార సంఘాలు కూడా విదీతి కూటమి నాయకత్వానికి విజ్ఞప్తి చేశాయి. దీపావళి పండుగ ముగిసిన తర్వాత ర్యాలీ నిర్వహించేలా కాంగ్రెస్ నాయకత్వంతో మాట్లాడాలని కోరాయి. ఫెడరేషన్ ఆఫ్ సదర్ బజార్ ట్రేడర్స్ అసోసియేషన్, కిరాణా కమిటీ ఢిల్లీ వంటి సంఘాలు కూడా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేశాయి. పండుగల సమయంలో వ్యాపారాలు పుంజుకునే అవకాశం ఉంటుందని, ఇలాంటి సమయంలో భారీ ర్యాలీలు, ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తే వ్యాపారులకు నష్టం తప్పదని తెలిపాయి. లేఖలు రాసినట్లు సమాచారం. ఈ రెండు పార్టీలూ ఇండియా కూటమిలో భాగంగా ఉన్నాయి.

## అమెరికన్ల ఉద్యోగాలు అమెరికన్లకే! లేదంటే చర్యలు తీసుకుంటాం: జెడివాన్స్



**టెక్సాస్, అక్టోబరు 30:** అమెరికన్ల ఉద్యోగాలను విదేశీ కార్మికులకు కట్టబెట్టే కంపెనీలపై చర్యలు తీసుకుంటామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. వీసా మోసాలకు పాల్పడే సంస్థలు, అమెరికా ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే కంపెనీల యాజమాన్యాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. టెక్సాస్‌లోని వెదర్‌ఫోర్డ్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ సార్వభౌమాధికారం అంటే అమెరికా పౌరుల ప్రయోజనాలను కాపాడటమేనని వాన్స్ అన్నారు. అమెరికా ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే సంస్థలపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఏయే కంపెనీలపై దర్యాప్తు జరుగుతోంది ఏ వీసా కేటగిరీకి సంబంధించి అక్రమాలు జరిగాయి అనే వివరాలను ఆయన వెల్లడించలేదు. అమెరికా కార్మికులకు మేలు చేసేలా వాణిజ్య విధానాలను రూపొందిస్తున్నామని వాన్స్ చెప్పారు. దేశంలో కొత్తగా 670 బిలియన్ డాలర్ల తయారీ రంగ పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ఓడరేవులు, చమురు శుద్ధి కేంద్రాలు, కర్మాగారాల విస్తరణతో స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో టెక్సాస్ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. యువత సొంత ఇల్లు కొనుగోలు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామని వాన్స్ తెలిపారు. వాల్‌స్ట్రీట్ సంస్థలు, విదేశీ పెట్టుబడిదారులు ఇళ్ల కొనుగోళ్లపై చూపే ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. టిప్స్ ద్వారా వచ్చే ఆదాయం, అదనపు పని గంటల వేతనాలు, సీనియర్లకు పన్ను ఉపశమనం కల్పించే చర్యలను ప్రస్తావించారు. చిన్నపిల్లలున్న కుటుంబాలకు ప్రయోజనాలు పెంచడంపైనా మాట్లాడారు. యువత సొంత ఇల్లు కొనుక్కొని, కుటుంబాలను ఏర్పరచుకుని, స్థిరమైన ఉద్యోగాలతో జీవించే పరిస్థితులు రావాలని వాన్స్ ఆకాంక్షించారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ మందులు కొనాలా ఆహారం కొనాలా అని ఆలోచించాల్సిన పరిస్థితులు తన కుటుంబంలో ఉండేవని చెప్పారు. సామాన్య కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడం ప్రభుత్వ బాధ్యతగా అభివర్ణించారు.

## గాంధీ మనవడికి చెందిన 30 ఎకరాలు కబ్జానుంచి విముక్తి




**వర్జీనియా, అక్టోబరు 30:** అమెరికాలో మహాత్మా గాంధీ మనవడికి చెందిన 30 ఎకరాల విలువైన ఆస్తిని కబ్జా చేసేందుకు జరిగిన ప్రయత్నాన్ని అక్కడి కోర్టు అడ్డుకుంది. ఈ ఆస్తి వివాదంలో, గాంధీ మనవడు ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్టుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. స్థానిక చట్టాలను అడ్డం పెట్టుకుని భూమిని సొంతం చేసుకోవాలని చూసిన అమెరికా వాసికి కోర్టులో చుక్కెదురైంది. ఆక్రమణలను వెంటనే తొలగించి, భూమిని ట్రస్టుకు అప్పగించాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మహాత్మా గాంధీ మనవడు కాను గాంధీ, ఆయన భార్య శివ గాంధీ 1987లో అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో షెనన్‌డో నేషనల్ పార్క్ సమీపంలో 30 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 2013లో వారు భారతదేశానికి తిరిగి వచ్చారు. వారి మరణానంతరం, ఈ ఆస్తులన్నీ వారు స్థాపించిన డాక్టర్ శివ అండ్ కాను రాందాస్ మోహన్‌దాస్ గాంధీ చారిటబుల్ ట్రస్ట్‌కు సంక్రమించాయి. గాంధేయవాద వ్యాప్తికి సంబంధించిన సేవా కార్యక్రమాలకు ఈ ఆస్తులను వినియోగించాలనేది వారి సంకల్పం. అయితే, 2025 జనవరిలో గ్రెగరీ బ్లాక్ అనే స్థానిక వ్యక్తి ఈ భూమి తనదేనంటూ ట్రస్టుకు లీగల్ నోటీసు పంపడంతో వివాదం మొదలైంది. వర్జీనియాలోని ఓ చట్టం ప్రకారం ఒక ప్రదేశాన్ని 15 ఏళ్లపాటు నిరంతరాయంగా, బహిరంగంగా, ఇతరుల ప్రమేయం లేకుండా వాడుకుంటే దానిపై యాజమాన్య హక్కులు వస్తాయని అతడు వాదించాడు. దీనికి ఆధారంగా తాను ఆ భూమిలో ఓ చిన్న ఇల్లు (క్యాబిన్), వేట కోసం స్టాండ్‌లు, కాలిబాటలు నిర్మించానని పేర్కొన్నాడు. ఈ కబ్జా ప్రయత్నాన్ని గాంధీ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అయిన పరిమళ్ దేశాయ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన భారత్‌లోనే ఉంటూ ఈ న్యాయపోరాటాన్ని ముందుండి నడిపించారు.

# పటేల్ బాటలో సమైక్యభారత్

## భిన్నభాషలు, సంస్కృతుల సమాహారం ఇండియా

## సంస్థాగత బలోపేతంతో జాతీయ సమైక్యతా నిర్మాణం

**న్యూఢిల్లీ: అక్టోబరు 30:** సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1947లో స్వాతంత్రం అనంతరం అనేక సంస్థానాలుగా విడిపోయే ప్రమాదం ఎదుర్కొన్న భారతదేశాన్ని ఏకీకృత రాజకీయ వ్యవస్థగా తీర్చిదిద్దడంలో పటేల్ కీలక పాత్ర పోషించారు. అయితే ఆయన వారసత్వాన్ని కేవలం చరిత్రలో ఒక ఘట్టంగా చూడకుండా, దేశ ఐక్యతను నిరంతరం కాపాడుకోవాల్సిన బాధ్యతగా గుర్తించాలని ఈ సందర్భం సూచిస్తోంది. భారతదేశం వంటి భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలు కలిగిన దేశాన్ని ఐక్యంగా ఉంచడం ఒక నిరంతర ప్రక్రియ. పటేల్ ప్రారంభించిన కార్యాచరణ ఆయన నిర్మించిన సంస్థలు, వాటిలో పనిచేస్తున్న అధికారులు, ప్రజల ద్వారా కొనసాగుతోంది. 1947లో బ్రిటిష్ పాలన ముగిసిన సమయంలో దేశంలో 560కి పైగా సంస్థానాలను సర్దార్ పటేల్, వి.పి. మీనన్‌తో కలిసి దౌత్య చతురత, వ్యూహాత్మక నిర్ణయాలతో సంస్థానాల విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. జునాగఢ్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో చర్చలతో సమస్య పరిష్కారం కాకపోవడంతో జాతీయ సమగ్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. ఫలితంగా భారతదేశ భౌగోళిక సమగ్రతకు పునాది పడింది. భూభాగాల ఏకీకరణతోనే దేశ నిర్మాణం పూర్తికాదని పటేల్ గుర్తించారు. ప్రజలకు న్యాయం, భద్రత, సమర్థవంతమైన పాలన అందించేందుకు పటిష్ఠమైన పరిపాలనా వ్యవస్థ అవసరమని భావించారు. అందుకే అఖిల భారత సర్వీసులను బలోపేతం చేసి, వాటిని దేశానికి ఉక్కు చట్రంగా అభివర్ణించారు. భారత పరిపాలనా సేవ (ఐఎఎస్), భారత పోలీసు సేవ (ఐపిఎస్), భారత అటవీ సేవ (ఐఎఫ్ఎస్) వంటి వ్యవస్థలు రాజ్యాంగ పరిరక్షణలో పని చేసేలా ఆయన కృషి చేశారు. నేడు కేరళకు చెందిన అధికారి జమ్మూ కశ్మీర్‌లో, బీహార్‌కు చెందిన పోలీసు అధికారి ఈశాన్య రాష్ట్రాల్లో విధులు నిర్వహించడం పటేల్ ఈ ఏడాది జాతీయ ఐక్యతా దినోత్సవంలో అంతర్గత భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత కనిపిస్తోంది. గతంలో నక్సలైట్ హింసతో ప్రభావితమైన జిల్లాల నుంచి 5వేల మందికి



పైగా ప్రజలు ఏక్తా నగర్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాడిన పోలీసు, పారా మిలటరీ సిబ్బంది చేసిన త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. దేశ సమగ్రతను కాపాడటంలో భద్రతా బలగాల పాత్ర అత్యంత కీలకమైనది. భద్రత, అభివృద్ధి రెండూ పరస్పరం ఆధారపడిన అంశాలు. భద్రత లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. అభివృద్ధి లేకుండా భద్రత కూడా దీర్ఘ కాలం నిలవదు. గతంలో హింసకారణంగా ప్రధాన స్రవంతికి దూరమైన ప్రాంతాల ప్రజలను జాతీయ వేడుకల్లో భాగస్వాములను చేయడం సమగ్ర అభివృద్ధికి సంకేతం. గుజరాత్‌లోని నర్మదా జిల్లాలో ఉన్న కెవాడియా ప్రాంతం నేడు ఏక్తానగర్‌గా జాతీయ గుర్తింపు పొందింది. 2018లో దేశానికి అంకితం చేసిన 182 మీటర్ల ఎత్తైన సర్దార్ పటేల్ విగ్రహం జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రస్తుత కాలంలో ప్రాంతీయత, భాష, కులం, మతం ఆధారంగా ఏర్పడుతున్న విభజన ధోరణులు జాతీయ ఐక్యతకు సవాళ్లుగా నిలుస్తున్నాయి. భారతదేశ వైవిధ్యమే బలమని పటేల్ ఇచ్చిన సందేశం నేటికీ అనుసరణీయంగా ఉంది. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు భారత రాజ్యాంగ వ్యవస్థలో జమ్మూ కశ్మీర్ విలీన ప్రక్రియకు సంబంధించిన మరో కీలక పరిణామంగా చర్చించబడుతోంది. మాదకద్రవ్యాల రహిత భారత దేశ నిర్మాణం కూడా ఆరోగ్యకరమైన, ఐక్యమైన సమాజానికి అవసరమైన అంశంగా పరిగణించబడుతోంది. సర్దార్ పటేల్ ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో యువత పాత్ర కీలకం. . ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం కూడా దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కొనసాగుతోంది.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ 1950 డిసెంబర్‌లో మరణించగా, ఆయనకు భారతరత్న పురస్కారం 1991లో ప్రకటించారు. 21వ శతాబ్దపు సవాళ్లకు అనుగుణంగా పటేల్ ఆశయాలను కొనసాగించడమే ఉక్కు మనిషికి దేశం అందించే నిజమైన నివాళి.

# 49.6 కోట్లమందికి పేదరికం నుంచి విముక్తి

## ప్రపంచ బ్యాంకు నివేదిక

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** భారత్‌లో పేదరికం ఊహించని రీతిలో తగ్గిపోతోంది. గత 12 ఏళ్ల కాలంలో దేశంలో ఏకంగా 49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది. దీనివల్ల 2011లో 27.1 శాతంగా ఉన్న అత్యంత తీవ్రమైన పేదరికం రేటు, 2023 నాటికి ఏకంగా 2.6 శాతానికి పడిపోయిందని స్పష్టం చేసింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గించిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని ప్రపంచ బ్యాంక్ కొనియాడింది. కేవలం అత్యంత పేదరికమే కాదు, రోజుకు 4.20 డాలర్ల ఆదాయం పొందే దిగువ మధ్య తరగతి పేదరిక రేటు కూడా 57.7 శాతం నుంచి 16.1 శాతానికి గణనీయంగా తగ్గింది. ప్రజల వినియోగ వ్యయం పెరగడం, ఉపాధి అవకాశాలు ముఖ్యంగా మహిళలకు పెరగడం, ఆహార రాయితీలతో కూడిన సామాజిక సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలు కావడమే ఈ మైలురాయికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంక్ స్పష్టం చేసింది. ఇక రాబోయే రోజుల్లో కూడా ఈ పేదరికం మరింత తగ్గుతుందని అంచనా వేస్తోంది. రోజుకు 4.20 డాలర్ల పరిమితి ఆధారంగా చూస్తే, 2026 నాటికి 14.2 శాతంగా ఉండే పేదరికం 2028 నాటికి 12.1 శాతానికి తగ్గిపోవచ్చని పేర్కొంది. అయితే కార్మిక రంగం, ఆర్థిక వ్యవస్థ గణాంకాల్లో వచ్చే మార్పుల ఆధారంగా ఈ అంచనాల్లో కాస్త మార్పులు ఉండే అవకాశం ఉందంది. కేవలం ఆదాయం లేదా ఖర్చుల ఆధారంగానే కాకుండా, జీవన ప్రమాణాల ఆధారంగా కొలిచే బహుమాణ పేదరికంలో కూడా భారత్ అద్భుత పురోగతి సాధించింది. ఆక్స్‌ఫర్డ్ ప్రాజెక్ట్ గణాంకాల ప్రకారం 2005-06లో 53.8 శాతంగా ఉన్న బహుమాణ పేదరికం, 201921 నాటికి 16.4 శాతానికి తగ్గింది. ప్రపంచ బ్యాంక్ స్వంత గణాంకాల ప్రకారం 2022-23 నాటికి ఇది 15.5 శాతానికి పడిపోయింది. అంటే ఆరోగ్యం, విద్య, కనీస సౌకర్యాల కల్పనలో భారతీయుల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని ఇది స్పష్టం చేస్తోంది. ఈ భారీ విజయాల వెనుక కొద్దిగా ఆందోళన కలిగించే సవాళ్లు కూడా ఉన్నాయి. దేశంలోని మొత్తం



పేదల్లో దాదాపు 57 శాతం మంది ఇప్పటికీ ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు విస్తరించి ఉన్న ఒకే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నారు. అక్కడ మరిన్ని కొత్త ఉద్యోగాలు కల్పిస్తేనే ఈ పురోగతి నిలకడగా ఉంటుంది. ఉపాధి విషయానికొస్తే, 2017 నుంచి 2023 మధ్య భారత్ ఏకంగా 13.4 కోట్ల మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించింది. ఇది దేశంలో పనిచేసే వయస్సు ఉన్న జనాభా పెరుగుదల కంటే రెట్టింపు కావడం విశేషం. గ్రామీణ ప్రాంత మహిళలు ఉపాధిలోకి రావడం ఇందులో కీలకం.

## సిజెపి నేత సౌరవ్‌దాస్‌పై సమగ్ర విచారణకు మద్రాస్ హైకోర్టు ఆదేశం



**చెన్నై, అక్టోబరు 30:** కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి, జర్నలిస్టు సౌరవ్ దాస్ వ్యవహారంపై మద్రాస్ హైకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఆయన నేపథ్యంపై సమగ్ర విచారణ జరిపించాలని, న్యాయవ్యవస్థతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారనే ఆరోపణలతో ఆయన సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఆయన తల్లిదండ్రులతో సహా వ్యక్తిగత నేపథ్యంపై విచారణ జరిపించాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఏ. ధర్మాధికారి, జస్టిస్ జి. అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ వ్యవహారంపై తమ స్పందన తెలియజేయాలని హోం మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత శాఖలకు నోటీసులు జారీ చేసింది. కాంచీపురం జిల్లాకు చెందిన గణేష్ కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. సౌరవ్ దాస్ నేపథ్యం, గత వివరాలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని తన పిటిషన్‌లో కోరారు.

## పరస్పర అంగీకారంతో శారీరక బంధం అత్యాచారం కింద చూడలేం: సుప్రీం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** పరస్పర అంగీకారంతో కొనసాగిన శారీరక సంబంధాన్ని విఫలమైందనే కారణంతో అత్యాచారంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సమ్మతితో ఏర్పడిన శారీరక సాన్నిహిత్యాన్ని బంధం వికటించిన తర్వాత లైంగిక దాడిగా పేర్కొనలేమని, దానిని నేరంగా మార్చడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు కేరళకు చెందిన సంతోష్ కుమార్ అనే వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం కేసులను కొట్టివేస్తూ జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. మొదటి నుంచే ఉద్దేశపూర్వకంగా మోసం చేసి, నమ్మించి శారీరక బంధానికి సమ్మతి పొందిన సందర్భాలను ఇలాంటి కేసులతో పోల్చిచూడొద్దని తేల్చిచెప్పింది. ఒక బంధం కొనసాగుతున్న సమయంలో పరస్పర సమ్మతితో ఏర్పడిన శారీరక సంబంధం ఆ తర్వాత సంబంధం చెడిపోయిందనే ఒకే ఒక్క కారణంతో దానిని అత్యాచారంగా పరిగణించల్లేం అని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. గతంలో జరిగిన ఘటనల పట్ల తర్వాత కలిగే పశ్చాత్తాపం లేదా బాధ, సమ్మతితో కూడిన బంధాన్ని నేరంగా భావించలేం దాని ఆధారంగా న్యాయ వ్యవస్థ ద్వారా ఎదుటి వ్యక్తి స్వేచ్ఛను, గౌరవాన్ని హరించడం సరికాదని వ్యాఖ్యానించింది. బంధం విఫలమైన ప్రతిసారీ రేప్ కేసు నమోదు చేస్తే, అది పురుషుల స్వేచ్ఛను పూర్తిగా హరించినట్లవుతుంది ఒకప్పుడు సమ్మతితో ఉన్నంత మాత్రాన, రేప్ కేసు భయంతో ఆ బంధంలోనే ఉండిపోవాలా బంధం నుంచి బయటకు వచ్చే హక్కు పురుషుడికి ఉండదా ఆ నిర్ణయాన్ని మోసం అనలేం అని ధర్మాసనం తెలిపింది. బలవంతం, లైంగిక హింస, మోసపూరితంగా సమ్మతిని పొందడం వంటివి ఉంటే నేరంగా పరిగణించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. సంబంధాలు విఫలమైన ప్రతిసారీ క్రిమినల్ కేసులు నమోదు చేయడం వల్ల అత్యాచారం వంటి తీవ్రమైన నేరాల ప్రాధాన్యత తగ్గే ప్రమాదం ఉందని సుప్రీం కోర్టు హెచ్చరించింది.

## హంగ్ దిశగా ఇజ్రాయెల్

**టెల్ అవీవ్, అక్టోబరు 30:** ఇజ్రాయెల్ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల తుది ఫలితాలు వెలువడగా, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లభించలేదు. దీంతో దేశంలో హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని రైట్‌వింగ్ కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 61 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోవడంలో ఈ కూటమి విఫలమైంది. సెంట్రల్ ఎలక్షన్స్ కమిటీ గురువారం విడుదల చేసిన తుది గణాంకాల ప్రకారం.. నెతన్యాహు కూటమి 53 స్థానాలకే పరిమితమైంది. మరోవైపు, విపక్ష కూటమి 48 సీట్లు గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 19 స్థానాలను కైవసం చేసుకున్న అరబ్ పార్టీలు ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకంగా, కింగ్ మేకర్లుగా అవతరించాయి. నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ 27 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం మాత్రం కొరవడింది. ఈ ఎన్నికల ఫలితాలు నెతన్యాహు రాజకీయ భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయి. ఒకవేళ ఆయన ప్రధాని పదవి కోల్పోతే, తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. దీర్ఘకాలంగా ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలపై విచారణ వేగవంతం కావడమే కాకుండా, 2023 అక్టోబర్ 7న హమాస్ దాడికి భద్రతా వైఫల్యాలపై అధికారిక దర్యాప్తు.

# సంక్షిప్త వార్తలు

### గోవధకు పాల్పడిన ముగ్గురు దోషులకు జీవితఖైదు

**గాంధీనగర్, అక్టోబరు 30:** గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ జిల్లా కోర్టు గోవధకు పాల్పడిన తీవ్రమైన కేసులో అత్యంత కీలకమైన, చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. అక్రమంగా గోవధకు పాల్పడి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు రుజువైన ముగ్గురు దోషులకు గాంధీనగర్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి బి.ఆర్.రాజ్‌పూత్ జీవిత ఖైదు శిక్ష ఖరారు చేశారు. శిక్షతో పాటు ప్రతి ఒక్కరికీ రూ.3 లక్షల చొప్పున భారీ జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సనాతన హిందూ ధర్మంలో, వేదాలలో, మనుస్మృతి గ్రంథాల్లో గోమాతకు ఉన్న పవిత్రమైన ప్రాశస్త్యాన్ని, విశిష్ట స్థానాన్ని విశదీకరిస్తూ ధర్మాసనం ఈ అరుదైన తీర్పును ప్రకటించింది.

### పిఎం కిసాన్ 24వ విడత నిధులు విడుదల


**న్యూఢిల్లీ,అక్టోబరు 30:** దేశవ్యాప్తంగా రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ పథకం 24వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేశారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో భిల్డీ నుంచి రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు బదిలీ చేశారు. ఈ విడతలో 9.34 కోట్లకు పైగా రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున అందించారు.

మొత్తంగా రూ.18,680 కోట్లకు పైగా నిధులు రైతుల ఖాతాల్లోకి బదిలీ అయినట్లు పేర్కొన్నారు.

### నోరా ఫతేహికి రౌస్ అవెన్యూ కోర్టు సమన్లు

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** రూ.200 కోట్ల మనీలాండరింగ్, దోపిడీ కేసులో నిందితుడైన సుకేశ్ చంద్రశేఖర్ వ్యవహారంలో ప్రముఖ బాలీవుడ్ నటి నోరాఫతేహికి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో 2026 నవంబర్ 2న ప్రాసిక్యూషన్ సాక్షిగా హాజరై కోర్టు ఎదుట వాంగ్మూలం ఇవ్వాలని సమన్లలో పేర్కొంది. ఈ కేసులో దాఖలు చేసిన థర్డ్ సప్లిమెంటర్ చార్జ్‌షీట్‌లో నోరా ఫతేహి పేరు సాక్షిగా చేర్చారు. దీని ఆధారంగా కోర్టు విచారణకు హాజరుకావాలని రౌస్ అవెన్యూ కోర్టు సమన్లు జారీచేసింది.

### భూటాన్‌లో హిమానీనదం విస్ఫోటం




**తింపూ, అక్టోబరు 30:** భూటాన్ దేశంలోని గాసా జిల్లాలో షింటావు సరస్సు ఉప్పొంగి వరద సంభవించింది. దాంతో పశ్చిమబెంగాల్, అసోంలోని కొన్ని ప్రాంతాలకు ఆకస్మిక వరద హెచ్చరికలు జారీ అయ్యాయి.

గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వల్ల గాసా జిల్లాలోని మోచు నది ఒడ్డున ఉన్న ప్రసిద్ధ సహజ వేడినీటి బుగ్గ అయిన గాసా త్సాచులోని సౌకర్యాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. అయితే ముందుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

మోచు నది ప్రారంభంలోనే ఉన్న షింటావు సరస్సు భూటాన్‌లోని 17 ప్రమాదకరమైన హిమానీనద సరస్సుల్లో ఒకటి.

### ఇరాన్‌పై దాడులకు అమెరికా సిద్ధం



**వాషింగ్టన్, అక్టోబరు 30:** అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మరోసారి దాడులు చేయడానికి ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. టెహ్రాన్‌పై దాడులు ఎలా చేయబోతున్నాం? ఏ ప్రాంతాల్లో సైనికులు, యుద్ధ విమానాలను మోహరించాలనే దానిపై అమెరికా ఉన్నత సైనికాధికారులు ట్రంప్‌నకు బ్రీఫింగ్ ఇచ్చారు. వైట్‌హౌస్‌లో రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌లతోపాటు.. పశ్చిమాసియాలోని అమెరికా ఉన్నత కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్‌తో ట్రంప్ సమావేశమయ్యారు.

## బిజెపితో పొత్తుకు బిఆర్ఎస్ తహతహ

### చంద్రబాబుపై పొగడ్తలతో వెలుగుచూసిన

### బావ, బామ్మర్దుల చీకటి ఒప్పందం

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** బిజెపితో పొత్తుకు తహతహ లాడుతున్న బిఆర్ఎస్ చంద్రబాబుతో సయోధ్యకు ప్రయత్నిస్తున్నారనీ పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడం బావబామ్మర్దుల చీకటి ఒప్పందం వెలుగుచూస్తున్నదని ఆయన ఆరోపించారు. బిజెపితో లోపాయికారి ఒప్పందం లేకపోతే, దమ్ము ఉంటే మీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించండని సవాల్ చేశారు. మా మీద అడ్డగోలు అబద్ధాలతో యాగిచేసే మీ సోషల్ మీడియా చంద్రబాబును, టిడిపిని, బిజెపిని ఏం అనకుండా ఉంటున్నప్పుడే మీ చీకటి ఒప్పందం అర్థం అయిందని ఆయన అన్నారు,. బిజెపితో పొత్తుకు సిద్ధమై చంద్రబాబుతో సయోధ్యకు మీరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మీ దొంగచాటు బంధంను తెలంగాణ ప్రజల ముందు సాక్ష్యాలతో బయటపెడుతామని మహేష్‌గౌడ్ హెచ్చరించారు. బిజెపికి సాయం చేయడం కోసం మహబూబ్‌నగర్ వదులుకుంటున్నారురా, నల్గొండ ఎమ్మెల్సీకి మీకు వాళ్ల సాయం కోసం స్కెచ్ వేసుకుంటున్నారని అన్నారు.



రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రైతు దినోత్సవం సమావేశంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

## రైతుల ఆదాయం పెంచడమే పిఎం నరేంద్రమోడీ లక్ష్యం

### రాష్ట్రంలో ఐసిఎఆర్-ఐఐఆర్ఆర్ సంస్థ ఉండడం మన అదృష్టం

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 30, ప్రభాతవార్త :** రైతులకు బిజెపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోడీ పనిచేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్‌లో నిర్వహించిన రైతు దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. పీఎం కిసాన్ పథకం 24వ విడత నిధులు విడుదలైన నేపథ్యంలో పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌ను కూడా ఈ సందర్భంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడీ కిసాన్ సమాన్ నిధి కింద ఇప్పటికి వారికి 23 విడతలుగా నాలుగు లక్షల 39వేల కోట్ల రూపాయలను రైతుల ఖతాలోకి జమ చేశారని శుక్రవారం 24వ విడతగా తొమ్మిది కోట్ల 34 లక్షల మంది రైతుల ఖాతాలో 18వేల కోట్ల 690 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందన్నారు. 2019లో ప్రారంభించిన ఈ పథకాన్ని నిరంతరం కొనసాగుతుందని ప్రతి సంవత్సరం రైతు అకౌంట్‌లో జమ చేస్తున్నా ప్రభుత్వం నరేంద్రమోడీ ప్రభుత్వమని ప్రపంచంలో ఏ దేశంలో చేయని విధంగా నరేంద్ర మోడీ చేస్తున్నారని 92 శాతం మంది కిసాన్ సమాన్ నిధులను రైతులు వ్యవసాయం కోసం వాడుకుంటున్నారని 80శాతం మంది రైతుల ఆదాయం కిసాన్ సమాన్ ద్వారా పెరిగిందని అన్నారు. నరేంద్రమోడీ ఆలోచన రైతుల ఆధాయం పేరగాలి రైతులు కష్టాల్లో నష్టల్లో ఉన్నప్పుడు ఇది ఉపయోగపడాలని ఇవ్వడం జరుగుతుందన్నారు.

## సింగరేణి కార్మికులకు నవంబరు 5న దీపావళి బోనస్

### ఒక్కొక్కరికి గరిష్టంగా రూ.1.10 లక్షలు

### దాదాపు రూ.419 కోట్లు చెల్లింపు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** ఇటీవలనే లాభాల వాటా బోనస్ (దసరా బోనస్) ను అందుకున్న సింగరేణి కార్మికులకు సంస్థ యాజమాన్యం మరో తీపి కబురు చెప్పింది. నవంబర్ 5వ తేదీన దీపావళి బోనస్‌ను చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం సింగరేణి కార్యాలయం ఒక ప్రకటనలో పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్ (దీపావళి బోనస్) ను నవంబర్ 5వ తేదీన చెల్లించాల్సిందిగా డిప్యూటీ సీఎం విక్రమార్క ఆదేశాల మేరకు చెల్లించడం జరుగుతుందని తెలిపింది. బోనస్‌గా రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చొప్పున విడుదల చేయడం జరుగుతుందని వివరించింది. లాభాల వాటా కింద ఈ నెలలో దాదాపు రూ.600 కోట్లు చెల్లించగా, తాజాగా రూ.419 కోట్ల దీపావళి బోనస్ చెల్లించబోతున్నట్లు వెల్లడించింది. ఈ బోనస్ ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో చెల్లింపునకు తగిన ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్ మరియు సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయిలో బోనస్ అందుతుంది. అంతకంటే తక్కువ పని దినాల హాజరు కలవారికి వారు పని చేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం లెక్క కట్టి చెల్లించనున్నారు. అయితే ఈ బోనస్ పొందడానికి కనీస అర్హతగా గత ఆర్థిక సంవత్సరంలో ఏ కార్మికుడైనా కనీసం 30 రోజులు పని చేసి ఉండాలని నిర్ణయించారు. మొత్తం మీద చూస్తే సుమారు 38,000 మంది ఉద్యోగులకు ఈ బోనస్ వర్తించనుంది. నెల రోజుల వ్యవధిలోనే దసరా మరియు దీపావళి బోనస్ ల రూపంలో సగటున దాదాపు 2,65,000 రూపాయలను కార్మికులు అందుకోబోతున్నారు. సింగరేణి యాజమాన్యం ఈ రెండు బోనస్ లతో కలిపి ఒక్కో కార్మికుడికి సుమారు రూ.1,020 కోట్ల రూపాయలను చెల్లించింది.

### పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు..

## నిజామాబాద్‌లో ఓపెన్ హౌస్

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని డివిజన్‌లలో గల అన్ని పోలీసు స్టేషన్లలో ఓపెన్‌హౌస్ జరిగింది. ఓపెన్‌హౌస్‌కు ఆయా ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ల పనితీరు, సిసిటివిలు ఎలా పనిచేస్తాయి, ఫిర్యాదుదారులతో పోలీసులు ఎలా మాట్లాడుతారు, ఎఫ్ఐఆర్‌లు ఎలా నమోదు చేస్తారు, డయల్ 112 ఎలా పనిచేస్తుంది, గస్తీ బృందాల విధి నిర్వహణ ఎలా ఉంటుంది, నేరగాళ్లను పట్టుకున్న తరువాత విచారణ ఎలా జరుగుతుంది, రిమాండు తీరుతెన్నులు, పోలీసుస్టేషన్లలో రికార్డుల నిర్వహణ, వాహనాల తనిఖీలు ఎలా వుంటాయి, స్టేషన్‌లో సిబ్బంది విధులు ఎలా ఉంటాయి, పోలీసు కమ్యూనికేషన్స్ సిబ్బంది విధులు ఎలా వుంటాయి, ఆయుధాల వినియోగం ఎలా వుంటుందనే అంశాలను విద్యార్థులకు అధికారులు వివరించారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే కాంగ్రెస్ లక్ష్యం




గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### జాతీయ జనగణనలో వెంటనే బిసి కులగణన చేర్చాలి

### ప్రభుత్వ భూముల పరిరక్షణ చరిత్రాత్మక విజయం : మంత్రి పొన్నం

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ఔన్న త్యాన్ని కాపాడుతూ ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాసే నియంతృత్వ పోకడలను నిలువరించే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దేశ రాజధానిలో నిరస నలతో పోరాటం చేస్తున్నదని రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 'ఓట్ బచావో దేశ్ బచావో' నినా దంతో ఏఐసిసి నాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంకగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున పోరాటం చేస్తోందని ఎన్నికల కమిషన్ కూడా సర్, ఫారం-6లో మార్పులు చేశారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ నియంతృత్వ విధానాల నుంచి దేశం, ప్రజలను రక్షించేందుకు నవంబరు 1న ఢిల్లీలో చేపట్టే ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నుంచి మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లుసహా ముఖ్య నాయకులందరూ ఢిల్లీకి తరలివెళ్లారన్నారని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటనపై స్పందిస్తూ హోంమంత్రిగా హైదరాబాద్‌కు ఎవరైనా రావచ్చు, అనుమతులు ఇస్తామని, కానీ రాజకీయంగా కొన్ని సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు పట్ల, తెలంగాణ అమరవీరుల త్యాగాల పట్ల గతంలో పార్లమెంటు సాక్షిగా అవమానకరంగా మాట్లాడినందుకు అమిత్‌షా, ప్రధాని మోడీ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లో హోంశాఖ మంత్రి అక్కడ పర్యటించాలని సలహా ఇచ్చారు. చైనా ఆక్రమణలు, మణిపూర్‌లో మహిళలపై దాడులు, విదేశీ శక్తుల కుట్రలు హోంమంత్రిగా అక్కడ పర్యటించాలని కోరారు. తెలంగాణ బిసి సంక్షేమ శాఖ మంత్రిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధికారికంగా లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. బిసిల స్థితిగతులు మెరుగు పడాలన్నా, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా కులాల వారీ గణాంకాలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. బిజెపి పాలనలో రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, దేశవ్యాప్తంగా కుట్రపూరితంగా పేదల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ న్యాయపోరాటం ఫలించి వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా దక్కడంపై ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి, న్యాయ వ్యవస్థకు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ ప్రజల పక్షాన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీలేని పోరాటం

### కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి వరుస విజయాలు

### రెవెన్యూ యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ప్రభుత్వ భూముల పరిరక్షణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాజీలేని వైఖరితో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఒకవైపు కఠిన చర్యలు తీసు కుంటూనే, మరోవైపు దశాబ్దాలుగా న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను పరిష్క రించేందుకు సమర్థవంతమైన న్యాయ పోరాటం చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విలువైన ప్రభుత్వ భూములపై కొనసాగుతున్న న్యాయ వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వ యాన్ని పెంచి, సుప్రీంకోర్టు సహా వివిధ న్యాయస్థానాల్లో ప్రభుత్వ వాదనలను బలంగా విని పించేందుకు అవస రమైన చర్యలు చేపట్టారని వివ రించారు. గతంలో సరైన పర్యవేక్షణ, సమన్వయం కొరవడటంతో అనేక విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించి దశాబ్దాల తరబడి న్యాయవివాదాలు కొనసాగాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రజాప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన పాత రికార్డులు, రెవెన్యూ ఆధారాలు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ హక్కులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

ఈ క్రమంలో ఐఎంజీ కంచె గచ్చిబౌలి 400 ఎకరాల భూముల వ్యవ హారంలో 2003 నుంచి కొనసాగుతున్న న్యాయ పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వానికి కీలక విజయం లభించింది. 2024 మార్చి 7న తెలంగాణ హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పుని వ్వగా, 2024 మే 3న సుప్రీంకోర్టు ఐఎంజీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే, 2025లో ఇదే ప్రాంతంలోని అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై సుప్రీంకోర్టు ప్రత్యే కంగా సుమోటో విచారణ చేపట్టి ఆదేశాలు జారీ చేసింది.

తాజాగా మియాపూర్ భూములకు సంబంధించి కూడా సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడం ప్రజా ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటానికి మరో బలమైన నిదర్శనమన్నారు. ఈ రెండు ఉదంతాలు ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవను, రెవెన్యూ శాఖ సమర్థవంతమైన కార్యాచరణను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు.

రెండు దశాబ్దాలుగా వివాదాల్లో చిక్కుకున్న అత్యంత విలువైన భూములను న్యాయపోరాటం ద్వారా ప్రభుత్వానికి చెందేలా అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడం సాధారణ విషయం కాదని, దీని వెనుక ప్రభుత్వ చిత్తశుద్ధి, అధికారుల సమన్వయం, న్యాయ పరమైన కృషి ఉన్నాయని పేర్కొన్నారు.

### దుబాయ్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ వాసి..

# సిఎం ప్రజావాణి చొరవతో సురక్షితంగా స్వదేశానికి

### గద్వాల్ విజయలక్ష్మికి బాధితుల ధన్యవాదాలు

**హైదరాబాద్ (బేగంపేట) అక్టోబరు 30, ప్రభాతవార్త :** సిఎం ప్రజావాణి ద్వారా తెలంగాణకు చెందిన మరో ప్రవాసి కార్మికుడు సురక్షితంగా స్వదేశానికి తిరిగివచ్చాడు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం బినోలా గ్రామానికి చెందిన బుడ్ల పెంటాజీ ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని సంస్థలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సరైన శిక్షణ, అనుభవం లేకుండా కఠినమైన పనులు చేయాల్సి రావడంతోపాటు, అధిక పనిగంటల కారణం గా ఆయన తీవ్రఅనారోగ్య సమస్యలు, నీరసం, అధిక చెమటతో బాధ పడుతూ ఉద్యోగం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా స్వదేశానికి తిరిగి రావడానికి రూ.90,000కు పైగా ఖర్చు అవుతుందని తెలియడంతో ఆర్థికంగా వెనుకబడిన ఆయన కుటుంబం ఆ మొత్తాన్ని భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో ఆయన భార్య బుడ్ల పుష్ప ఈ నెల 9న సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కోరారు.

ఈ ఫిర్యాదుపై విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకుని, తెలంగాణ ఎన్ఆర్ఐ విభాగం, దుబాయ్‌లోని భారత కాన్సులేట్ సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టారు. వారి సమన్వ యంతో బుడ్ల పెంటాజీ ఈ నెల 23న సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుబ కున్నాడు. సిఎం ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఇబ్బందులు ఎదు ర్కొంటున్న తెలంగాణ ప్రవాసులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి ఈ ఘటన ఒ విజయవంతమైన ఉదా హరణగా నిలిచింది. తమ సమస్యను పరిష్కరించి తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సిఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జి గద్వాల్ విజయలక్ష్మి, అధికారులకు, ఎన్ఆర్ఐ విభాగానికి, దుబాయ్‌లోని భారత కాన్సులేట్‌కు బుడ్ల పుష్ప, పెంటాజీ కృతజ్ఞతలు తెలిపారు.



గద్వాల్ విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బుడ్ల పెంటాజీ తదితరులు

265వ సిఎం ప్రజావాణిలో శుక్రవారం 105 దరఖాస్తులు అందాయి. ఈ కార్య క్రమంలో స్టేట్ ఇన్‌చార్జి గద్వాల్ విజయలక్ష్మి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.

# పవర్‌గ్రిడ్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

### జెండా ఊపి వాకథాన్ ప్రారంభించిన ఇడి డోమన్

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్ ఘనంగా ప్రారంభించారు. సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక ప్రవర్తన యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు సికింద్రాబాద్‌లోని పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్ హెడ్‌క్వార్టర్స్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా నెక్లెస్ రోడ్‌లో వాకథాన్‌ను నిర్వహించారు. ఎస్ఆర్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డోమన్ యాదవ్ ఈ వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందేశాలు రాసి ఉన్న, ప్రత్యేకంగా రూపొందించిన త్రివర్ణ పతాక థీమ్ గొడుగులను చేతబట్టుకుని, సమగ్రత, పారదర్శకత మరియు నైతిక ప్రవర్తన పట్ల ఐక్యత మరియు నిబద్ధతను ప్రదర్శించారు. అనంతరం డోమన్ ప్రసంగిస్తూ శ్రేయస్సు కోసం నిజాయితీ, పారదర్శకత మరియు జవాబుదారీతనం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. నైతిక ప్రమాణాలను చురుకుగా పాటించాలని, అవినీతి రహిత, పారదర్శకమైన పని వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడాలని ఆయన ఉద్యోగులను ప్రోత్సహించారు. సమగ్రత, సుపరిపాలన యొక్క ప్రాముఖ్యత గురించి ఉద్యోగులు, భాగస్వాములు, పౌరులలో చైతన్యం కలిగించే లక్ష్యంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2026 సందర్భంగా పవర్‌గ్రిడ్ ఎస్ఆర్ఐ నిర్వహిస్తున్న కార్యక్రమాల శ్రేణిలో భాగంగా ఈ వాకథాన్ జరిగిందన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా, పవర్‌గ్రిడ్ నైతికత, పారదర్శకత, కార్పొరేట్ పరిపాలనలో అత్యున్నత ప్రమాణాల పట్ల తన అచంచలమైన నిబద్ధతను నిరంతరం బలోపేతం చేస్తూనే ఉందని వెల్లడించారు. వృత్తిపరమైన, వ్యక్తిగత రంగాలలో నైతిక విలువలను ప్రోత్సహించడానికి మరియు అప్రమత్తత సంస్కృతిని పెంపొందించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించడానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు.




పివి వనం పుస్తకావిష్కరణ చేస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా తదితరులు

### ఔషధ మొక్కల విశిష్టతను చాటిచెప్పిన

## 'ఘనం-పి.వి.వనం'

### దేశ అభివృద్ధికి దోహదం చేసిన పివి ఆర్థిక సంస్కరణలు : గవర్నర్ శుక్లా

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 30, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రిగా పీ.వీ. చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ విధానాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని,తెలంగాణా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఔషధ మొక్కల ప్రాముఖ్యత,ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ తెలంగాణ శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి రచించిన 'ఘనం- పి.వి. వనం' పుస్తకాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుక్రవారం బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ సంయుక్తంగా నిర్వహించాయి. శాసనమండలి ఉపసభాపతి డాక్టర్ బండ ప్రకాశ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వాణీదేవి మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీయకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలని అన్నారు. మ భారతదేశంలోని అరుదైన ఔషధ మొక్కలపై యువతకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో, పి.వి. నరసింహారావు దార్శనికత, ఔషధ వనాల స్ఫూర్తితో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తులసి, నిమ్మ, ఉసిరి వంటి మొక్కల్లో ఔషధ గుణాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి ప్రకృతిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, ఔషధ మొక్కలపై అవగాహన పెంపొందించే ఈ పుస్తకాన్ని రచించిన వాణీదేవిని అభినందించారు. చెట్లను తొలగించాల్సి వచ్చినప్పుడు వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటి సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అనంతరం పి.వి. నరసింహారావుకి నివాళులర్పించిన గవర్నర్, ఆయన ప్రధానమంత్రిగా చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ విధానాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. సమాచార సాంకేతిక, మొబైల్ వినియోగ రంగాల్లో భారత్ సాధించిన ప్రగతి దేశ అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ కార్యదర్శి సురభి వాణీదేవి, అధ్యక్షుడు పి.వి. ప్రభాకర్ రావు, శేఖర్ మారం రాజు, మాజీ కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప దేశ భక్తురాలు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ధీశాలి, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. తన రక్తంలోని ప్రతి బొట్టు దేశ బలోపేతానికి ఉపయోగపడాలని ప్రకటించిన గొప్ప దేశభక్తురాలు ఇందిరాగాంధీ అని స్మరించుకున్నారు. ఆమె ఆశయాలు, ప్రజా సంక్షేమ విధానాలు నేటికీ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు.

ఇందిరాగాంధీ వర్థంతి సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. దేశం ఎదుర్కొన్న క్లిష్టపరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న నాయకురాలని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు ముప్పు వాటిల్లకుండా తన ప్రాణాలనే పణంగా పెట్టి అహరహరం శ్రమించారని కొనియాడారు. పదవుల కంటే దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిన నాయకత్వం ఆమెదని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, రాజ భరణాల రద్దు, 20 సూత్రాల కార్యక్రమం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశ ఆర్థిక, సామాజిక రంగాల్లో ఇందిరాగాంధీ కీలక మార్పులకు శ్రీకారం చుట్టారని సిఎం రేవంత్ తెలిపారు.

## హారీశ్‌రావు ధనదాహంతోనే కూలేశ్వరమైన కాళేశ్వరం

### మాజీ ఎమ్మెల్యే ఇరవత్రి అనిల్ విమర్శ

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** హారీశ్‌రావు ధనదాహంతోనే కాళేశ్వరానికి కూలేశ్వరంగా మారే గతి పట్టిందని మాజీ ఎమ్మెల్యే ఇరవత్రి అనిల్ కుమార్ ఆరోపించారు. గాంధీభవన్ ఇరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్యే హారీశ్‌రావును కాళేశ్వరం గేట్లకు కట్టేసి కొట్టాలని, గోల్కొండ కోటకు కట్టి ఉరేసినా తప్పులేదని విమర్శించారు. ఎన్‌డిఎస్ఎ సభ్యుడు సమీర్‌కుమార్ శుక్లే మేడిగడ్డపై స్పష్టమైన రిపోర్ట్ ఇచ్చారనీ టెక్నికల్ కమిటీ మొదట స్టిల్లింగ్ బేస్ మరమ్మతులు చేయాలని భావించింది అధ్యయనం తర్వాత అసలు ప్రాజెక్టే నాణ్యత లోపంతో ఉందని భావించి ఆపేసారనీ ఆయన గుర్తుచేశారు. బరాజ్ లు కట్టాల్సిన చోట కాకుండా మరోచోట కట్టారనీ అదికూడా శాస్త్రీయ నిబంధనలు పాటించకుండా నిర్మించాని ఎన్‌డిఎస్ఎ స్పష్టంగా పేర్కొందనీ గుర్తుచేశారు. బిఆర్ఎస్ చేసిన తప్పిదాలకు రేవంత్ రెడ్డిని భాధ్యుడిని చేస్తున్నారనీ ఆవేదన చెందారు. గేట్లు మూసివేయొద్దని ఎన్‌డిఎస్ఎ చెప్తోందనీ ఆయన తెలిపారు మొండిగా నీళ్లు ఎత్తిపోయాలని బిఆర్ఎస్ అంటోందనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఎవరి మాట వినాలి ఎన్‌డిఎస్ఎకంటే బిఆర్ఎస్ నేతలు గొప్ప మేధావులా? అని ఆయన ప్రశ్నించారు. కృష్ణా జలాలు ఎపికి తాకట్టు పెట్టింది బిఆర్ఎస్ అని ఆరోపించారు. కృష్ణా నదిపై ఆంధ్రప్రదేశ్ కట్టిన ప్రాజెక్టులు అన్ని బిఆర్ఎస్ అధికారంలో ఉండగానే జరిగిందని అన్నారు. తెలంగాణ ప్రజలకు బిఆర్ఎస్ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలి ఇది ముమ్మాటికీ బిఆర్ఎస్ తెచ్చిన కరువు అని ఆయన వ్యాఖ్యానించారు.

# పత్తి కొనుగోళ్లలో మిల్లర్ల చీటింగ్

### కొనుగోలు రేటు ఒకటి, ఇచ్చేది మరొకటి

### రూ.200కుపైగా కోత పెడుతూ దోపిడీ

### నాణ్యత, తేమ పేరుతో రైతుల వంచన

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో కొందరు మిల్లర్లు రైతులను చీటింగ్ చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే వేలంపాటలలో మిల్లు యజమానులు ఒక నిర్దిష్ట ధరకు అంగీకరించి కొనుగోలు చేసినప్పటికీ మిల్లులకు తరలించిన తర్వాత తేమ, నాణ్యత లేదనే నెపంతో అందులో కోత పెడుతు దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదేమని కొందరు రైతులు ప్రశ్నిస్తే వారిని కించపరచే విధంగా మాట్లాడుతున్నట్లు వాపోతున్నారు. ఈ సీజన్ ప్రారంభం నుంచే ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల్లోనూ కొందరు రైతులు అష్టకష్టాలు పడి కొంతైనా పత్తిని కాపాడుకున్నారు. రైతులు నారుమొక్కల కుంటుపడటం, పురుగుల దాడి, పెరుగుదల పురుగుమందుల ధరల పెరుగుదల వంటి పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎల్ నినో ప్రభావం కారణంగా దిగుబడి తగ్గడంతో 2026-27 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ. 8,667 కనీస మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభిస్తుందని పత్తి రైతులు ఆశించారు. ఈ పరిస్థితుల్లో పత్తిని అమ్ముకోవడానికి తెచ్చిన రైతులను మిల్లు యజమానులు తేమ, నాణ్యత లోపం, ఇతర కారణాల సాకుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రతి క్వింటాల్ పత్తిపై రూ.100 నుంచి రూ.200కు పైగా తగ్గిస్తున్నారు. కొన్ని చోట్ల తాజాగా పత్తిని అమ్ముకోవడానికి తీసుకెళితే వేలంలో ధరను నిర్ణయించిన ప్రకారం కొనుగోలు చేసిన తర్వాత దాన్ని జిన్నింగ్ మిల్లుల వద్దకు తీసుకెళితే అక్కడ మళ్లీ కోత పెడుతున్నారు. ఈ విధంగానే తమను మోసం చేస్తున్నారని కరీంనగర్ జిల్లాలోని పలువురు పత్తి రైతులు ఫిర్యాదు చేశారు. స్థానిక రైతుల వెల్లడించిన వివరాలు ప్రకారం జమ్మికుంట మండలం విలాసాగర్‌కు చెందిన రైతు మల్లయ్య రెండు రోజుల క్రితం వ్యవసాయ మార్కెట్ యార్డుకు సుమారు 11 క్వింటాళ్ల పత్తిని తీసుకొచ్చారు. వేలంలో బిడ్డర్లు క్వింటాల్‌కు రూ.8,850 చొప్పున పత్తిని దక్కించుకున్నారు. పత్తిని జిన్నింగ్ మిల్లుకు తరలించిన తర్వాత, తేమ ఉందని పేర్కొంటూ ధరను రూ.8,750కి తగ్గించారు. రైతు అభ్యంతరం లేవనెత్తడంతో, ధరను మళ్లీ రూ.8,800కి పెంచారు. అలాగే మధునయ్య అనే మరో రైతు కూడా ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నారు. వేలంలో రూ. 8,870కి బిడ్ వేసిన తర్వాత, జిన్నింగ్ మిల్లులో ఆ ధరను రూ. 8,770కి తగ్గించారు. అదేమని ఆయన ప్రశ్నించగా, మిల్లు యాజమాన్యం దురుసుగా ప్రవర్తించినట్లు చెబుతున్నారు. అయితే తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే, మిల్లు యజమానులకు నోటీసులు జారీ చేస్తామని మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు.

# గ్యాస్, ఎరువుల కొరతపై విపక్షాల తప్పుడు ప్రచారం

## బనస్కాంత సభలో ప్రధాని మోడీ ధ్వజం

**బనస్కాంత, అక్టోబరు 30:** ఇరాన్ యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో గ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. దేశం కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వానికి అండగా నిలవాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. గుజరాత్‌లోని బనస్కాంతలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఇరాన్‌లో కొనసాగుతున్న యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎరువులు, వంటగ్యాస్ కొరత ఏర్పడు తుందంటూ కొందరు పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలంతా అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తుంటే, కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం దేశం ఇబ్బందుల్లో పడాలని కోరుకుంటున్నాయని మోడీ వ్యాఖ్యానించారు. దేశం కష్టాలను ఎదుర్కొంటున్న సమయంలో ప్రజల్లో ఆందోళన కలిగించే ప్రచారం చేయడం సరైన విధానం కాదని అన్నారు. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ ఎరువులు, వంటగ్యాస్ కొరతపై ప్రతిపక్షాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. దేశమంతా అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కొందరు ఎరువులు, గ్యాస్ కొరత ఉందంటూ పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని, మోడీ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేయడమే వారి ఉద్దేశమని విమర్శించారు. దేశంలోని యువత, మహిళలు, బాలికలు అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములవుతున్నారని మోడీ పేర్కొన్నారు. అయితే దేశం పురోగతి సాధించడం కొందరికి ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో రైతుల సమస్యలపైనా ప్రధాని మోడీ మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ భారం భారత రైతులపై పడకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లలో ఎరువుల ధరలు పెరిగిన ప్రభావాన్ని రైతులు భరించాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం ప్రయత్నించిందని చెప్పారు. కష్టకాలంలో రైతులకు అండగా ఉంటానని గతంలో ఇచ్చిన హామీని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో సైన్స్, టెక్నాలజీ వినియోగాన్ని పెంచేందుకు గత 12 ఏళ్లుగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మోడీ వివరించారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ, పాల ఉత్పత్తి రంగాల్లోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. సాయిల్ హెల్త్ కార్డు పథకాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. గతంలో రైతులు తమ పొలాలకు ఏ రకమైన ఎరువులు, ఎంత పరిమాణంలో అవసరమో తెలుసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా భూసారాన్ని తెలుసుకుని, అవసరమైన ఎరువులను ఉపయోగించుకునే అవకాశం కలిగిందన్నారు. దేశవ్యాప్తంగా రైతులకు 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేసినట్లు ప్రధాని వెల్లడించారు. వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులను రైతులు సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమన్నారు.



ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డీ స్వర్ణోత్సవ సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

## ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే అభివృద్ధి

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణ తోనే సుస్థిర ప్రగతి

రైతు కుటుంబానికి ఆర్థిక, సామాజిక భద్రత

ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి స్వర్ణోత్సవాల్లో డిప్యూటీ సిఎం భట్టి

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త** సంక్షేమ పథకాల విజయాన్ని లబ్ధిదారుల సంఖ్యతో మాత్రమే అంచనా వేయకూడదని, ప్రజల జీవితాల్లో వచ్చిన వాస్తవ మార్పులను ప్రాతిపదికగా తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్ ఎం.సి.ఆర్.హెచ్‌ఆర్‌డీ స్వర్ణోత్సవాల్లో శుక్రవారం పాల్గొని మాట్లాడుతూ ఆర్థిక వృద్ధి కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబం జీవితంలో సానుకూల మార్పు తీసుకురావాలన్నారు. ప్రజలకు మెరుగైన ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రత కల్పించడమే నిజమైన అభివృద్ధి లక్ష్యమని స్పష్టం చేశారు. సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ సమన్వయంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు, నైపుణ్యాలు మెరుగుపడినప్పుడే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, లైఫ్ సైన్సెస్, ఆధునిక సేవారంగాల్లో హైదరాబాద్ సాధించిన ప్రగతి రాష్ట్రానికి గొప్ప అవకాశమన్నారు. ఈ అభివృద్ధి తయారీ రంగం, వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలకు విస్తరించాలని ఆకాంక్షించారు.

## ఢిల్లీకి రాకుండా రాష్ట్రాల్లోనే అడ్డుకుంటున్నారు: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** రాజధానిలోని రాంలీలా మైదానంలో ప్రతిపక్ష ఇండియా కూటమి నవంబర్ 1న భారీ ర్యాలీని తలపెట్టింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. దాదాపుగా 10 లక్షల మంది ర్యాలీకి హాజరవుతారని చెబుతున్నారు. ఇదిలా ఉంటే, ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వస్తున్న ప్రజల్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ ఆరోపణలు చేశారు.



ఉత్తర్ ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, సామాన్య ప్రజలు రాకుండా అడ్డంకులు సృష్టిన్నారని పేర్కొన్నారు. రాంలీలా మైదాన్‌లో జరిగే కార్యక్రమానికి ఎంతమంది వస్తారు, వారిలో ఎంతమందిని అడ్డుకుంటున్నారో గమనిస్తే దేశంలో ప్రస్తుతం ఏం జరుగుతుందో అర్థమవుతుందని ఆయన అన్నారు. కోట్లాది మంది ఓటు హక్కును కోల్పుతున్నారనే ఆవేదన ప్రజల్లో ఉందని, దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని చెప్పారు. అదానీ, అంబానీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌లకు ప్రయోజనం చేకూర్చేందుకే ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఇది వేర్వేరు నిరసన కార్యక్రమం కాదని, ఒకే ఉద్యమమని ఆయన అన్నారు. మొత్తం ప్రతిపక్షం ఈ పోరాటంలో పాల్గొంటుందని చెప్పారు. నిరసన తెలియజేయాలనుకునే ప్రతీ ఒక్కరూ రాంలీలా మైదాన్‌కు రావచ్చని చెప్పారు.

## గేమ్ ఛేంజర్‌గా క్లైమేట్ ఇంటెలిజెన్స్ రివల్యూషన్ వ్యవసాయ ఒడిదుడుకులు తట్టుకునే దీటైన మార్గం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త** గేమ్ చేంజర్ గా క్లైమేట్ ఇంటెలిజెన్స్ రెవల్యూషన్ దేశంలో వ్యవసాయ, ఉద్యాన రంగాలలో పర్యావరణ ఒడి దుడుకులను తట్టుకునేందుకు దీటైన మార్గంగా ఉండనుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి తెలిపారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో క్లైమేట్ ఇంటెలిజెన్స్ రెవల్యూషన్, అగ్రిబిజినెస్ మోడలింగ్ పై రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి బ్రెయిన్ స్టార్మింగ్ వర్క్‌షాప్ తొలి రోజు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ యువతకు భవిష్యత్తులో ఈ రంగం ప్రధాన ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. వెదర్ డేటా బేస్ సేకరణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందుందని చెప్పారు.

పర్యావరణ మార్పులు వల్ల కలిగే ఎల్ నినో, తుఫాన్ వంటి విపత్తులను దీటుగా ఎదుర్కొనేందుకు ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి, రైతులకు ఆ ఫలితాలు చేరేలా చూడాలని పేర్కొన్నారు.

## ఆధార్, పాన్ కార్డుల ఫోర్జరీ దందా

**- 60 నకిలీ ఆధార్ కార్డులు, ల్యాప్‌టాప్, ప్రింటర్ స్వాధీనం**

**అత్తాపూర్ అక్టోబరు30,ప్రభాతవార్త :** ఆధార్, పాన్ కార్డుల్లో పేర్లు, ఫొటోలు, పుట్టిన తేదీలు, చిరునామాలను అక్రమంగా మారుస్తూ నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేస్తున్న వ్యక్తిని శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పహాడీషరీఫ్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడిలో జల్‌పల్లి శ్రీరామ్ కాలనీకి చెందిన చింతల మహదేవ్ (36)ను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణమోహన్ ఉన్నారు.

## ఎల్.జి ఫామ్ హౌజ్ పై పోలీసుల మెరుపు దాడి

**- ముగ్గురికి డ్రగ్ పాజిటివ్..భారీగా మద్యం స్వాధీనం -108 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు - కమ్మెట ఎల్.జి. ఫాంహౌస్‌పై కేసు నమోదు : చేవెళ్ల సిఐ కట్టా నరేందర్ రెడ్డి**



ఫామ్‌హౌస్‌లో పోలీసుల అదుపులో విద్యార్థులు

**చేవెళ్ల, అక్టోంబరు 30, ప్రభాతవార్త** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కమ్మెట గ్రామ శివారులోని ఫామ్‌హౌస్ పార్టీపై ఎస్ఓటీ పోలీసుల దాడి చేశారు. చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామ శివారులోని ఎల్జీ ఫామ్‌హౌస్‌లో విద్యార్థులు.ఐబీఎస్ ఇఫ్కాయ్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులుగా పార్టీ నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో చేవెళ్ల పోలీసులు ఎస్ఓటి పోలీసులు కలసి దాడి నిర్వహించారు. అనుమతి లేకుండా బీబీఏ, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు పార్టీ చేసుకుంటున్నట్లు విశ్వసనీయంగా సమాచారం రావడంతో ఎస్ఓటీ, స్థానిక చేవెళ్ల పోలీసుల మెరుపు దాడి చేశారు. 108 మంది విద్యార్థినులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కమ్మెట గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న ఫామ్ హౌస్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. స్థానికంగా ఉన్న ఎల్.జి. ఫామ్ హౌస్ లో విద్యార్థులు పార్టీ చేసుకుంటున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు, చేవెళ్ల స్థానిక పోలీసులు సంయుక్తంగా శుక్రవారం మెరుపు దాడి నిర్వహించారు. చేవెళ్ల సిఐ కట్టా నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మన్నాన్ అనే వ్యక్తి పోలీసు, ఎక్సైజ్ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ నిర్వహిస్తుండగా, పోలీసులు దాడులు నిర్వహించారు. మన్నాన్ తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో లొకేషన్ పేర్కొనకుండా పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొకరి నుంచి రూ. వెయ్యి నుంచి రూ.2 వేల రూపాయల వరకు వసూలు చె శాడు. శుక్రవారం ఆకస్మాత్తుగా పార్టీ నిర్వహించడం జరుగుతుందని, లొకేషన్ షేర్ చేయడంతో 108 విద్యార్థులు ఎల్.జి. ఫాం హౌస్ కు చేరుకున్నారు. ఇందులో చాలా మంది విద్యార్థులు శంకర్ పల్లిలో గల ఐబిఎస్ ఇక్ఫాయి యూనివర్సిటీ లోని బిబిఎ, ఇంజనీరింగ్ వి భాగాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు.

## ప్రిన్సిపాల్, హౌస్‌మాస్టర్‌పై సస్పెన్షన్ వేటు

- ఎస్సీ గురుకులంలో పర్యవేక్షణ, భద్రతలో నిర్లక్ష్యం
- గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రవి

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త** విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి గగులోతు రవి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పార్కల్-ఒగ్లాపూర్‌లోని గురుకుల జూనియర్ కళాశాల (బాలుర)లో బైపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.కార్తిక్ మృతి ఘటనతో పాటు, విద్యార్థులకు సంబంధించిన పలు సున్నితమైన అంశాలను సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థుల కార్యకలాపాలను సమర్థంగా పర్యవేక్షించకపోవడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమైనందుకు ప్రిన్సిపాల్, హౌస్‌మాస్టర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ నెల 24 వ తేదీ విద్యార్థి కార్తిక్ మృతి చెందిన ఘటనపై చేపట్టిన విచారణ, జోనల్ అధికారి సమర్పించిన సమగ్ర నివేదిక, సంబంధిత అధికారుల వివరణలను పరిశీలించిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన కొన్ని సున్నితమైన విషయాలు, విద్యార్థులకు సంబంధించిన పరిణామాలు ఉన్నతాధికారుల దృష్టికి సకాలంలో తీసుకురాకపోవడాన్ని కార్యదర్శి తీవ్రంగా పరిగణించారు.

## జర్మనీతో తెలంగాణ బంధం మరింత బలోపేతం

అంతర్జాతీయ పెట్టుబడులు, పర్యాటకం, సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు

భారత్-జర్మన్ ఐక్యతా దినోత్సవంలో మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్,అక్టోబరు30,ప్రభాతవార్త:** భారత్, జర్మనీ దేశాల మధ్య 75 ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షి  ంచారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు, జర్మనీ ప్రభుత్వానికి, ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యత, పరస్పర అవగాహన, ఉమ్మడి భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలనే సందేశాన్ని జర్మన్ ఐక్యతా దినోత్సవం ప్రపంచానికి అందిస్తోందన్నారు. భారత్‌కు జర్మనీ ముఖ్యమైన ఆర్థిక భాగస్వామ్య దేశమని, ఇంజినీరింగ్, ఆటోమొబైల్ తయారీ, ఐటీ, పరిశోధన, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య మంచి సహకారం కొనసాగుతోందన్నారు. 2024లో ఇరు దేశాల మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 50 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిందని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన సాంకేతిక వ్యవస్థలతో హైదరాబాద్ అంతర్జాతీయ కంపెనీలకు ప్రధాన గమ్యస్థానంగా ఎదిగిందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో డాయిష్ బోర్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం అంతర్జాతీయ సంస్థలకు నగరంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష  ్యమని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయనున్నట్లు





## మియాపూర్ భూముల వేలం నిర్ణయం దివాళాకోరుతనం

**- రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్న రేవంత్ సర్కార్**

**- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్,అక్టోబరు30,ప్రభాతవార్త:** అత్యంత ఖరీదైన మియాపూర్ 550 ఎకరాల భూములపై సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పును భారతీయ జనతా పార్టీ తరఫున మనస్ఫూర్తిగా హర్షిస్తూ, స్వాగతిస్తున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. అయితే, కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఏమాత్రం ఆగకుండా, ఒక రియల్ ఎస్టేట్ ప్రభుత్వంలా మారిపోయి ఆ భూములను ఇష్టానుసారంగా వేలం వేసి అమ్మేస్తామని ప్రకటించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని సుమారు 550 ఎకరాల అత్యంత విలువైన భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ బంధువులకు, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి శతవిధాలా ప్రయత్నించింది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సుదీర్ఘ న్యాయపోరాటం జరిగి, ఈరోజు సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఆ భూములు ప్రభుత్వానికే చెందుతాయని స్పష్టమైంది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పును భారతీయ జనతా పార్టీ సంపూర్ణంగా స్వాగతిస్తోంది' అని పేర్కొన్నారు. కాగా, తమ ప్రభుత్వ ప్రయత్నం వల్ల, తమ న్యాయవాదుల వల్లే ఈ విజయం సాధ్యమైందని కాంగ్రెస్ ప్రభుత్వం డాంబికాలు పలుకుతోంది. అలాంటప్పుడు, గెలిచామని చెప్పుకుంటున్న మరుక్షణమే ఆ భూములను వేలంపాట వేసి అమ్మేస్తామని ఎందుకు ప్రకటిస్తున్నారు? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిందో లేదో.. ఏమాత్రం ఆగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారిపోయి వేలం పాట వేస్తామనడం అత్యంత సిగ్గుచేటు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ పరిపాలన సాగిస్తారాఅన్నారు.

## పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్

**- సాంకేతిక ఆధారిత వృద్ధి దశలో యువత భాగస్వామ్యం: డిసిఎం భట్టి**

**ఘట్‌కేసర్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇన్ఫోసిస్ తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవడం ద్వారా ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ సేవలలో తమ సామర్థ్యాలను మరింతగా విస్తరించనుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ ఇన్ఫోసిస్‌లో శుక్రవారం సాయంత్రం డీసీ సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్ బ్లాక్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ప్రారంభించారు. డెవలప్‌మెంట్ సెంటర్ విస్తరణలో భాగంగా కొత్త సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సముదాయాన్ని ఏర్పాటు చేశారు. ఈకొత్త 1.1 మిలియన్ చదరపు అడుగుల కేంద్రం ఇన్ఫోసిస్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయటంతో పాటుగా ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక, టాలెంట్ ఎకోసిస్టమ్ పట్ల దాని నిబద్ధతను మరింతగా చాటుడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు అధికారులు ఇన్ఫోసిస్‌కు సాయంత్రం చేరుకున్నప్పటికి భారీ వర్షం కారణంగా కార్యక్రమం ఆలస్యంగా నిర్వహించారు. వర్షంలోనే భవనానికి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈసందర్భంగా డీప్యూటి సీఎం విక్రమార్క మాట్లాడుతూ భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థ తీర్చిదిద్దాలన్న మా'లక్ష  ్యంను ముందుకు తీసుకువెళ్తాయి" అని అన్నారు.

## సేవాభావం, క్రమశిక్షణతోనే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు: గవర్నర్

**భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ హైస్కూల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**హైదరాబాద్,అక్టోబరు30,ప్రభాతవార్త:**విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావాన్ని అలవర్చుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ ఆధునికీకరణ, అభివృద్ధి పనులకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధుల నుంచి మంజూరైన రూ.2.50 కోట్లతో చేపట్టనున్న పనులకు శుక్రవారం గవర్నర్ శంకుస్థాపన చేశారు. అనంతరం జీహెచ్ఎంసీ సహకారంతో రాష్ట్ర ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన విద్యా వాతావరణం అందాలని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులు అందించిన సింగరేణి సంస్థను అభినందించారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. నిధుల మంజూరుకు చొరవ చూపిన డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యత్వం 2024-25లో 17,184 ఉండగా, 2025-26లో 47,448కు పెరగడం సంతోషకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,494 యూనిట్లు ఏర్పాటు కావడం సంస్థ విస్తరణకు నిదర్శనమని పేర్కొన్నారు. మరో 6 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు.

## ఒమేగా హాస్పిటల్స్‌పై దేశ వ్యాప్తంగా ఐటి దాడులు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రి ఒమెగా హాస్పిటల్స్‌పై దేశ వ్యాప్తంగా శుక్రవారం నాడు ఆదాయపు ప న్ను శాఖ అధికారులు దాడులు చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో గల ఈ ఆసుపత్రుల కార్యాలయా లు, అధికారుల ఇళ్లలో ఐటి అధికారులు తెల్లవారుజాము నుంచి సోదాలు చేబట్టారు. హైదరాబాద్ ఐటి విభాగం అధికారులు మొత్తం 24 చోట్ల ఈ దాడులు నిర్వహించారు. హాస్పిటల్ శాఖలతో పాటు పలువురు కీలక వైద్యుల ఇళ్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఐటీ అధికారుల సోదాల్లో భారీగా కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్కులు, ఆర్థిక లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పన్ను ఎ గవేత, భారీ నగదు లావాదేవీల ఆరోపణల నేపథ్యంలోనే ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఒమేగా హాస్పిటల్స్ యాజమాన్యం, కీలక డై రెక్టర్ల ఆర్థిక మూలాలపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఒమెగా హాస్పిటల్స్‌పై ఇటీవల కాలంలో ఐటికి అందిన ఫిర్యాదు.

## విజిలెన్స్ అవగాహనలో భాగంగా నాబార్డ్ వాకథాన్

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా, జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం శుక్రవారం హైదరాబాద్‌లో వాకథాన్ నిర్వహించింది. ఈ వాకథాన్‌లో నాబార్డ్ సిబ్బంది పాల్గొని, నిజాయితీ, పారదర్శ కత, అవినీతి రహిత సమాజ నిర్మాణంలో సమష్టిబాధ్యత వంటి సందేశాలను చాటిచెప్పే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ వాకథాన్ నాబార్డు ప్రాంతీయ కార్యాలయం చేపట్టిన విస్తృత విజిలెన్స్ అవగాహన ప్రచారకార్య క్రమంలో భాగంగా నిర్వహించబడిందని ఒక ప్రకటనలో వెల్లడించింది.

## రూ.600 కోట్లతో ఇన్ఫోసిస్ కొత్త సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కేంద్రం

- 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం.. 10 వేల సీట్ల సామర్థ్యం
- ప్రపంచ ఐటీ, ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,అక్టోబరు30,ప్రభాతవార్త:** ప్రపంచ సాంకేతిక రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇన్ఫోసిస్ సంస్థ హైదరాబాద్‌లోని పోచారం ప్రాంగణంలో రూ.600 కోట్ల పెట్టుబడితో నిర్మించిన నూతన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి భవనాన్ని ప్రారంభించడం రాష్ట్ర ఐటీ రంగ ప్రగతిలో మరో కీలక మైలురాయని ఆయన పేర్కొన్నారు. ఈ విస్తరణ హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఇన్ఫోసిస్ ఉన్నతాధికారులు, ఐటీ రంగ ప్రతినిధులు హాజరయ్యారు. కొత్త భవనం ద్వారా అదనంగా 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చిందని, ఇందులో 10 వేల సీట్ల సామర్థం ఉందని మంత్రి వివరించారు. సుమారు 450 ఎకరాల్లో విస్తరించిన పోచారం ఇన్ఫోసిస్ ప్రాంగణ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.3,200 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. కొత్త భవనం కేవలం మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాదు.. తెలంగాణ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు, ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో రాష్ట్ర భాగస్వామ్యాన్ని పెంచేందుకు దోహదపడుతుందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 1981లో ప్రారంభమైన ఇన్ఫోసిస్ సంస్థ నేడు 59 దేశాల్లో సేవలందిస్తూ, 3.25 లక్షలకు పైగా ఉద్యోగులతో అంతర్జాతీయ సాంకేతిక సేవలు, కన్సల్టింగ్ రంగంలో అగ్రగామిగా ఎదిగిందని గుర్తుచేశారు.

## విద్యుత్ ఉద్యోగులకు డిఎ, డిఆర్ పెంపు

-19.272 నుంచి 21.815 శాతానికి పెంపుదల

- విద్యుత్ సంస్థలపై నెలకు రూ.14.63 కోట్ల భారం

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు కరువు భత్యం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించినట్లు ఈశుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది. కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. సంస్థల వారీగా లబ్ధిదారులు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో) పరిధిలో 3,081 మంది ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. అలాగే విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్‌కో)లో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది.

## సంతాన సాఫల్యకేంద్రాలలో అక్రమంగా యువతుల అండాలు

**- ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు - 10 మంది యువతులు, నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**బేగంపేట అక్టోబరు 30,ప్రభాతవార్త :** ఇతర రాష్ట్రాల నుంచి యువతులను నగరానికి తీసుకు వచ్చి వారి నుంచి అండాలను సేకరించి సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్న ముఠాపై బేగంపేట పోలీసులు,ఎస్వోటీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 10 మంది యువతులను అదుపులోకి తీసుకోవడంతో పాటు నిర్వాహకురాలును కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట ప్రకాష్ నగర్ లోని నజ్రాన్ అపార్ట్మెంట్ లో నివాసం ఉంటూ అక్రమంగా యువతుల అండాలను సేకరించి సమీప సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారనే సమాచారంతో బేగంపేట పోలీసులు ఎస్వోటీ పోలీసులు సంయుక్తంగా ~~నజ్రాన్ అపార్ట్మెంట్ పై~~ దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా భవనంలోని కింది అంతస్తులో నివాసం ఉంటున్న పలువురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సచివాలయంలో ఆక్టోపస్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నాడు ఆక్టోపస్ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో ఆపరే షనల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులతో పాటు, అగ్నిమాపక శాఖ, ఎస్‌పిఎఫ్, టిఎస్ఎస్‌పి, ట్రాఫిక్ పోలీస్, వైద్య బృందం, పేలుడు పదార్థాల విభాగం సమన్వయంతో పాల్గొన్నాయి. సచివాలయంలో ఏదైనా అనుకోని భద్రతాపరమైన ముప్పులు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ భద్రతా, అత్యవసర సేవల విభాగాల సన్నద్ధత, పరస్ప ర సమన్వయం, స్పందనా సామర్థం, కార్యాచరణ సామర్థ్యాలను అంచనా వేయడం, మరింత బలోపేతం చేయడం ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. భద్రతాపరమైన సన్నద్ధతను మరింత పెంపొందించడం, వివిధ సంబంధి త శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం.

# 4వ టి20 మ్యాచ్‌లో టీమిండియా ఓటమి





## 87 రన్స్‌తో న్యూజిలాండ్ గెలుపు

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా జోరుకు బ్రేక్ పడింది. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న భారత్‌కు నాలుగో టి20లో చుక్కెదురైంది. శుక్రవారం వెల్లింగ్టన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 87 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. చెత్త బౌలింగ్, పేలవ బ్యాటింగ్ టీమిండియా పతనాన్ని శాసించాయి. ఈ విజయంతో ఐదు టి20ల సిరీస్‌లో న్యూజిలాండ్ ఖాతా తెరిచి 3-1తో క్లీన్ స్వీప్‌ను తప్పించుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోర్ చేసింది. గ్లేన్ ఫిలిప్స్(107) అజేయ శతకంతో చెలరేగగా మైఖేల్ బ్రేస్‌వెల్(65) విధ్వంసకర హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్(3/48) 3 వికెట్లు, ప్రిన్స్ యాదవ్(1/49), అక్షర్ పటేల్(1/43), అర్ష్‌దీప్ సింగ్(1/38), నితీష్ కుమార్ రెడ్డి(1/64) చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 172 పరుగులే చేసి ఓటమి పాలైంది. తిలక్ వర్మ(35 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 35), నమన్ ధీర్(13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28), అభిషేక్ శర్మ(15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 27) టాప్ స్కోరర్లుగా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకోబ్ డఫీ(4/19) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్(2/17), మాథ్యూ ఫిషర్(2/40) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆడమ్ మిల్నేకు ఒక వికెట్ దక్కింది. 260 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ రెండో బంతికే సంజూ శాంసన్(4) క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. జాకోబ్ డఫీ వేసిన అదే ఓవర్‌లో ఇషాన్ కిషన్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. దాంతో భారత్ 4పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడారు. అయితే అభిషేక్ శర్మను ఫిషర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే శ్రేయస్ అయ్యర్(22)ను మిల్నే క్లీన్ బౌల్డ్ చేయడంతో పవర్ ప్లేలోనే భారత్ 4 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. రెండు సిక్స్‌లతో దూకుడుగా ఆడిన నితీష్‌కుమార్ రెడ్డి(21)ని మిచెల్ సాంట్నర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. అదే ఓవర్‌లో అక్షర్ పటేల్(7)ను సాంట్నర్ రిటర్న్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. దాంతో 89 పరుగులకే భారత్ 6వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్‌వర్మ, నమన్‌ధీర్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా నమన్ ధీర్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అయితే స్మిత్ అద్భుతమైన రిలే క్యాచ్‌తో నమన్ ధీర్ వెనుదిరిగాడు. ఆ వెంటనే అర్ష్‌దీప్ సింగ్(0) గోల్డెన్ డకౌట్ కాగా.. ప్రిన్స్ యాదవ్‌తో తిలక్ వర్మ ఆచితూచి ఆడాడు. కానీ అతన్ని ఫిషర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆలౌట్ కాకుండా ప్రిన్స్ యాదవ్ చివరివరకు ఆడి భారత ఇన్నింగ్స్‌ను ముగించాడు.




## ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ
# చైనాను ఓడించిన భారత్

**జలంధర్:** ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో యువ చైనాను 5-2 తేడాతో ఓడించి భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ప్రారంభం నుండి భారత్ ఆటను తమ ఆధీనంలో ఉంచుకుని, సర్కిల్‌లోకి చాలాసార్లు చొచ్చుకెళ్లినప్పటికీ ఒక్క అవకాశాన్ని కూడా సృష్టించుకోలేక పోయారు. అయితే సుఖ్‌జీత్ (13వ నిముషంలో) భారత్‌కు తొలి గోల్ అందించాడు. పెనాల్టీ కార్నర్ రూపంలో (18వ) చైనాకు తొలి అవకాశం లభించినప్పటికీ భారత్ అడ్డుకుంది. భారత్‌కు (20వ) వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లు లభించినా, వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. పెనాల్టీ కార్నర్‌ను (26వ) పెంగ్ యాంగ్ గోల్‌గా మలిచి చైనా స్కోరును సమం చేశాడు. ఒక నిమిషం తర్వాత మూడవ పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ గోల్ చేయడంతో భారత్ మళ్లీ ఆధిక్యాన్ని సాధించింది. నాలుగో పెనాల్టీ కార్నర్ ద్వారా హర్మన్‌ప్రీత్ గోల్ సాధించడంతో, ఆతిథ్య జట్టు 3-1 ఆధిక్యాన్ని సంపాదించింది. మూడు నిమిషాల తర్వాత సుఖ్‌జీత్ గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచాడు. అయితే పెనాల్టీ కార్నర్‌ను చాంగ్‌కాంగ్ చెన్ గోల్‌గా మలచి స్కోరును ఒక గోల్‌కు తగ్గించారు. నాల్గవ మరియు చివరి క్వార్టర్ ప్రారంభమైన రెండు నిమిషాలకే వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను దక్కించుకుంది. ఈసారి జుగ్రాజ్ ఎలాంటి పొరపాటు చేయకుండా గోల్ చేయడంతో విజయం సాధించింది.

## హాంకాంగ్ సిక్స్ సిరీస్‌లో..
# పాకిస్థాన్ గెలుపు
## 3.5 ఓవర్లలోనే భారత్ చిత్తు

**హాంకాంగ్:** హాంగ్ కాంగ్ సిక్స్ సిరీస్ 2026 టోర్నమెంట్‌లో చిరకాల ప్రత్యర్థుల సమరంలో భారత జట్టుకు భారీ షాక్ తగిలింది. గ్రూప్ సిలో భాగంగా శుక్రవారం హాంకాంగ్‌లో జరిగిన హైవోల్టేజ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 4 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచిన పాకిస్థాన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 6ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 88 పరుగులు సాధించింది. ఓపెనర్లుగావచ్చిన రాహుల్ త్రిపాఠి 9పరుగులు (5 బంతుల్లో, 2ఫోర్లు) చేసి ఔట్ కాగా, నితీష్ రాణా 19 పరుగులు (14 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్సర్లు) చేసి రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శశాంక్ సింగ్ సిక్సర్ల వర్షం కురిపించాడు. కేవలం 11 బంతుల్లోనే 2 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో 363.64 స్ట్రైక్ రేట్‌తో 40 పరుగులు బాది పెవిలియన్ చేరాడు. అయితే స్టార్ ప్లేయర్లు రాహుల్ తెవాతియా, కెప్టెన్ కృనాల్ పాండ్య ఇద్దరూ వరుస బంతుల్లో డకౌట్ (0) కావడం భారత ఇన్నింగ్స్‌ను దెబ్బతీసింది. చివర్లో టి. నటరాజన్ 6 బంతుల్లో 2 ఫోర్లతో 12 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. పాకిస్థాన్ బౌలర్లలో అబ్దుల్ సమద్ తన ఒక్క ఓవర్లోనే 10 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. అహ్మద్ దానియల్, ముహమ్మద్ షెహజాద్ చెరో వికెట్‌దక్కించుకున్నారు. 89 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు కెప్టెన్ అబ్బాస్ అఫ్రిది, వికెట్ కీపర్ ఖవాజా నాఫే మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. తొలి ఓవర్ నుంచే భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. అబ్బాస్ అఫ్రిది కేవలం 8 బంతుల్లోనే 1 ఫోర్, 5 భారీ సిక్సర్లతో ఏకంగా 35 పరుగులు, ఖవాజా నాఫే 12 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 41 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశారు. 13 బంతులు మిగిలి ఉండగానే పాక్ విజయం సాధించడం విశేషం.

# 3వ టెస్ట్‌లో.. వెస్టిండీస్‌పై బంగ్లాదేశ్ పైచేయి



**ఆక్లాండ్:** శుక్రవారం మిర్పూర్‌లో జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజున, వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ చేజ్ బంగ్లాదేశ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి, ఆతిథ్య జట్టును 79 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయేలా చేశాడు. ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 106 పరుగుల ఆధిక్యాన్ని కలిగి ఉంది, కంకషన్ సబ్‌స్టిట్యూట్‌లు జాకర్ అలీ మరియు నయీమ్ హసన్ ఇద్దరూ 18 పరుగులతో క్రీజులో ఉన్నారు. అంతకుముందు, ఆఫ్ స్పిన్నర్ నయీమ్ 4 వికెట్లు పడగొట్టి వెస్టిండీస్‌ను 245 పరుగులకు ఆలౌట్ చేశాడు, బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు 272 తర్వాత 27 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. వెస్టిండీస్ 4 వికెట్ల నష్టానికి 134 పరుగులతో రోజును తిరిగి ప్రారంభించింది. 56 పరుగులతో అత్యధిక స్కోరు చేసిన టాగెనరైన్ చందర్‌పాల్, జస్టిన్ గ్రీవ్స్ మధ్య ఐదవ వికెట్ భాగస్వామ్యం ద్వారా బంగ్లాదేశ్‌ను నిరాశపరిచింది. కెప్టెన్ చేజ్ 43 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, అతనికి తోడుగా గ్రీవ్స్ సహకరించాడు. ఆఫ్‌స్పిన్నర్ నయీమ్ గ్రీవ్స్‌ను 46 పరుగుల వద్ద ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు చేర్చి వికెట్ తీశాడు. దీంతో వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి 213 పరుగుల వద్ద నిలిచింది. చేజ్ దూకుడుగా ఆడగా, జోషువా బిషప్ 15 పరుగులు చేసి, మెహిదీ హసన్ మిరాజ్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. అంతకుముందు, షార్ట్ లెగ్‌లో ఉన్న మొమినుల్ హక్ బిషప్ 11 పరుగుల వద్ద క్యాచ్ జారవిడిచాడు. 33 పరుగులకు నయీమ్ 4 వికెట్లు తీశాడు. 81వ ఓవర్‌లో షమార్ జోసెఫ్, జోమెల్ వారికన్‌లను, ఆపై ఓవర్‌లో జేడెన్ సీల్స్‌ను అవుట్ చేశాడు. వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ జోసెఫ్ రెండో ఓవర్‌లో ఓపెనర్ తంజిద్ హసన్‌ను డకౌట్ చేశాడు. షాద్మాన్ ఇస్లాం, శాంటో కాసేపు ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు.

ఆ తర్వాత చేజ్ పట్టు సాధించి ఓపెనర్‌ను 13 పరుగులకే బౌల్డ్ చేశాడు. రెండు బంతుల తర్వాత చేజ్, తౌహిద్ హృదయ్‌ను డకౌట్ చేసి, తన తర్వాతి ఓవర్‌లో కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటోను 10 పరుగుల వద్ద ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. దీంతో బంగ్లాదేశ్ 33 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అంతలోనే వర్షం కారణంగా సుమారు 30 నిమిషాల పాటు ఆటకు అంతరాయం కలిగింది. విరామం తర్వాత కూడా వెస్టిండీస్ తన దాడిని కొనసాగించింది. వారికన్, లిట్టన్ దాస్‌ను నాలుగు పరుగులకే ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేయగా, ఆ తర్వాత మెహిదీ హసన్ మిరాజ్‌ను బౌల్డ్ చేసి బంగ్లాదేశ్‌ను పతనం అంచుకు నెట్టాడు.

## కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్..
# భారత్ విజయం
## 45-24 తేడాతో శ్రీలంక ఓటమి



**అహ్మదాబాద్:** కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ 2026లో భారత్ గ్రూప్ దశలో అజేయంగా నిలి చింది. శ్రీలంకను 45-24 తేడాతోఓడించి వరుసగా ఆరోవిజయాన్ని నమోదు చేసి, సెమీఫైనల్స్‌కు ముందు తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. పంకజ్‌మోహితే 15 రైడ్ పాయింట్లతో భారత దాడికి నాయకత్వం వహించగా, ఆదిత్య షిండే 10 పాయింట్లు జోడించాడు. నితేష్ 5 టాకిల్ పాయింట్లు, యోగేష్ దహియా 4 పాయింట్లు అందించడంతో, భారత్ సమర్థవంతమైన రైడింగ్‌ను క్రమశిక్షణతో కూడిన డిఫెన్స్‌తో మిళితం చేసి 21 పాయింట్ల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. భారత్ 22 విజయవంతమైన రైడ్‌లు, 9 టాకిల్ పాయింట్లు నమోదు చేయడంతో పాటు, ఆల్‌అవుట్‌ల ద్వారా 6 పాయింట్లు సాధించింది. ఇప్పటికే సెమీఫైనల్ స్థానాన్ని ఖాయంచేసుకున్న ఆతిథ్య జట్టుకు ఈ విజయంతో గ్రూప్ దశలో అద్భుతమైన ప్రదర్శన పూర్తయింది. అలాగే స్కాట్లాండ్‌ను 70-20 తేడాతో చిత్తుగా ఓడించిన బంగ్లాదేశ్ కూడా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. మహ్మద్ అల్‌అమీన్ 24 పాయింట్లతో రాణించగా, మహ్మద్ హసీబుల్ హుస్సేన్ 12 పాయింట్లతో అతనికి మద్దతుగా నిలిచాడు. బంగ్లాదేశ్ 44 రైడ్ పాయింట్లు, 12టాకిల్ పాయింట్లు, ఆల్‌అవుట్‌ల ద్వారా 10 పాయింట్లను సాధించింది.

# బంగారం, వెండి ధరల్లో భారీ పతనం
## ఒక్కరోజే వెండిపై రూ. 5,312 తగ్గుదల



**న్యూఢిల్లీ, అక్టోబరు30:** దేశీయమార్కెట్లో బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బులియన్ ధరలు తగ్గడం, అమెరికాలో ద్రవ్యోల్బణ గణాంకాలు బలంగా నమోదవడంతో ధరలు భారీగా తగ్గాయి. దీనికితోడు ఈ యేడాది చివర్లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందన్న అంచనాలు బలపడ్డాయి. ఎంసిఎక్స్‌లో డిసెంబరు ఫ్యూచర్స్ బంగారం ధర 10 గ్రాములకు రూ.1,392 తగ్గి రూ.1,41,204కు చేరింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో రూ.1,419 తగ్గి రూ.1,41,177 కనిష్ఠ స్థాయిని తాకింది. ఎంసిఎక్స్‌లో కిలో వెండి ధర రూ.5,312 తగ్గి రూ.1,84,141కు పడిపోయింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒక దశలో రూ.5,403 క్షీణించి రూ.1,84,050 కనిష్ఠ స్థాయికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర 0.5 శాతం తగ్గి ఔన్సుకు 4,000.54 డాలర్లకు చేరింది. డిసెంబరు డెలివరీకి సంబంధించిన అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ ధర కూడా 0.5 శాతం తగ్గి 4,010.10 డాలర్ల వద్ద ట్రేడైంది. వరుసగా రెండో నెల కూడా బంగారం ధరలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికాలో కొనసాగుతున్న అధిక ద్రవ్యోల్బణం, పెరిగిన చమురు ధరలు, ఆర్థిక వృద్ధి నిలకడగా ఉండటం వంటి అంశాలు డిసెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలను బలపరుస్తున్నాయని ఛాయిస్ బ్రోకింగ్ కమోడిటీ ఫండమెంటల్ అనలిస్ట్ పింకీ యాదవ్ తెలిపారు. సెప్టెంబరు నెలలో అమెరికా ద్రవ్యోల్బణం 0.5శాతం పెరిగింది. దీంతో డిసెంబరులో వడ్డీ రేట్ల పెంపునకు సంబంధించిన అంచనాలు పెరిగాయి. అమెరికా డాలర్ ఇండెక్స్ 101.5 స్థాయికి బలహీనపడగా, ట్రెజరీ బాండ్ ఈల్డ్స్ కూడా తగ్గాయి. వడ్డీ రేట్లు పెరిగినప్పుడు వడ్డీ ఆదాయం ఇవ్వని బంగారం వంటి పెట్టుబడులవైపు ఇన్వెస్టర్లు ఆసక్తి పెంచుకుంటారు. అయితే మధ్యప్రాచ్య ఉద్రిక్తతల వల్ల పలు దేశాలు తమ బంగారు నిల్వలను న్యూయార్క్‌లోని ఖజానాలనుంచి స్వదేశాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఎంసిఎక్స్‌లో బంగారం ధర రూ.1,43,000-1,43,700 స్థాయిని దిగువకు చేరింది. ప్రస్తుతం ఈ స్థాయి తక్షణ నిరోధక స్థాయిగా పనిచేయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. తదుపరినిరోధక స్థాయి రూ.1,45,300-1,46,000 మధ్య ఉండవచ్చని అంచనా. ఎన్‌రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్. ప్రకారం, బంగారానికి తక్షణ మద్దతు రూ.1,40,000- 1,41,000 స్థాయిలో ఉంది. ఆ తర్వాత రూ.1,37,500-1,38,300 స్థాయి మద్దతుగా ఉండవచ్చన్నారు.

# నష్టాలనుంచి లాభాల్లోకి ఈక్విటీ సూచీలు





## ఐటి, బ్యాంక్ సూచీల మద్దతు


**ముంబయి, అక్టోబరు 30:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాల బాటలో పయనించాయి. నిఫ్టీ మరోసారి 23,000 పాయింట్ల కీలక స్థాయిని అధిగమించింది. ఐటీ, ఫార్మా రంగాలతో పాటు ఎంపిక చేసిన భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు ప్రారంభ నష్టాల నుంచి కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లనుంచి ప్రతికూల సంకేతాలు ఎదురైనప్పటికీ మార్కెట్ లాభాల్లో ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రతరం కావడం ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగించాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 117 డాలర్లకు పైగా చేరడంతో ద్రవ్యోల్బణం పెరుగుదల, భారత్ దిగుమతి వ్యయం అధికమయ్యే అవకాశాలపై ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో మార్కెట్ లాభాలు పరిమితమయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు నష్టాలతో ముగిశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 308.49 పాయింట్లు పెరిగి 74,459.93 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 116.35 పాయింట్లు లాభపడి 23,053.10 స్థాయికిచేరుకుంది. నిఫ్టీ పెరుగుదలకు ఇన్ఫోసిస్ 3.36 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 1.39 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 0.82 శాతం లాభాలు దోహదపడ్డాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.93 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 1.97 శాతం నష్టపోయాయి. ఎన్ఎస్ఇలో మొత్తం 1,013 షేర్లు లాభాల్లో ముగియగా, 2,511 షేర్లు నష్టాలను చవిచూశాయి. మరో 109 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ డిసెంబర్ 2026 కాంట్రాక్ట్ ధర బ్యారెల్‌కు 2.48 డాలర్లు పెరిగి 117.36 డాలర్లకు చేరుకుంది. భారత్ పదేళ్ల ప్రభుత్వ బాండ్లపై రాబడి 0.51 శాతం పెరిగి 7.425 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 7.387 శాతంగా నమోదైంది. విదేశీ మారక మార్కెట్లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 95.2650 వద్ద ముగిసిన రూపాయి, శుక్రవారం 94.9250 స్థాయిలో ట్రేడయింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబరు 4, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 0.80 శాతం తగ్గి రూ.1,41,453కు చేరుకుంది. అమెరికా పదేళ్ల బాండ్లపై రాబడి 1.22 శాతం తగ్గి 4.923 శాతానికి చేరింది. నిఫ్టీ ఐటీ సూచీ 2.32 శాతం దూసుకెళ్లింది.

సూచీలో విప్రో 4.32 శాతం, కోఫోర్జ్ 4.23 శాతం, ఎల్‌టీఐమైండ్‌ట్రీ 3.39 శాతం, ఇన్ఫోసిస్ 3.36 శాతం, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 2.86 శాతం చొప్పున లాభపడి టాప్ గెయినర్లుగా నిలిచాయి. హెచ్‌సీఎల్‌టెక్నాలజీస్ 1.72శాతం, టెక్ మహీంద్రా 1.20 శాతం, టీసీఎస్ 0.99 శాతం, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 0.56 శాతం పెరిగాయి. మరోవైపు ఎంఫాసిస్ 1.39 శాతం నష్టపోయి ఐటీ సూచీలో నష్టపోయిన ఏకైక షేర్‌గా నిలిచింది. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు 6.26 శాతం పడిపోయింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో) షేరు 4.33 శాతం పెరిగింది. దీపక్ నైట్రైట్ 2.91 శాతం లాభపడగా, గ్రీవ్స్ కాటన్ షేరు 6.75 శాతం దూసుకెళ్లింది.

# ఆర్థిక లోటు రూ.7.14 లక్షల కోట్లు
## తొలి ఆరు నెలల్లోనే వార్షిక లక్ష్యంలో 42.1 శాతం నమోదు



**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో అంటే ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు రూ.7.14 లక్షల కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ద్రవ్యలోటు లక్ష్యంలో ఇది 42.1 శాతానికి సమానమని శుక్రవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు చేసిన ఖర్చులు, వచ్చినఆదాయాల మధ్య వ్యత్యాసం ఇప్పటికే వార్షిక లక్ష్యంలో 40 శాతాన్ని దాటింది. దీంతో ఆర్థికసంవత్సరం తొలి అర్ధభాగం లోనే ద్రవ్యలోటు గణనీయమైన స్థాయికి చేరినట్లు స్పష్టమవుతోంది. ఆరు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వానికి మొత్తం రూ.18.35 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో స్థూల పన్ను ఆదాయం రూ.19.8 లక్షల కోట్లుగా నమోదైంది. పన్నేతరఆదాయం రూ.4.81 లక్షలకోట్లుగా ఉంది. వసూలైన పన్నుల్లో నుంచి రూ.6.99 లక్షల కోట్లను రాష్ట్రాలకు పన్నుల వాటా కింద కేంద్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రూ.25.5 లక్షల కోట్లకు చేరింది. ఇందులో రహదారులు, రైల్వేలు, ఇతర భౌతిక మౌలిక సదుపాయాల నిర్మాణానికి చేసే మూలధన వ్యయం రూ.6.55 లక్షల కోట్లుగా నమోదైంది. ద్రవ్యలోటు రూ.7.14 లక్షల కోట్లు, 2027 వార్షిక లక్ష్యంలో ద్రవ్యలోటు వాటా 42.1. స్థూల పన్ను ఆదాయం రూ.19.8 లక్షల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.4.81 లక్షలకోట్లు, మొత్తం ఆదాయ వసూళ్లు రూ.18.35 లక్షల కోట్లుగా ఉన్నాయి. మూలధన వ్యయం రూ.6.55 లక్షల కోట్లు. మొత్తం ప్రభుత్వ వ్యయం రూ.25.5 లక్షల కోట్లు రాష్ట్రాలకు పన్నుల వాటా రూ.6.99 లక్షల కోట్లుగా ఉన్నట్లు కేంద్ర డేటా స్పష్టంచేస్తోంది.



## జియో ప్లాట్‌ఫామ్స్ లాభాల్లో 8 % వృద్ధి
### రూ.8,389 కోట్లకు నికర లాభం

**ముంబయి, అక్టోబరు 30:** జియో ప్లాట్‌ఫామ్స్ సెప్టెంబరు త్రైమాసికంలో ఆర్థికంగా మెరుగైన పనితీరును నమోదు చేసింది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 8%పెరిగింది. ఆదాయం, నిర్వహణ లాభాల్లో వృద్ధి నమోదవడంతో పాటు ఎబిడిటా మార్జిన్ కూడా మెరుగుపడింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ నికరలాభం రూ.8,389 కోట్లకు చేరింది. అంతకుముందు జూన్ త్రైమాసికంలో ఇది రూ.7,765 కోట్లుగానమోదైంది. ఇక కార్యకలాపాలద్వారావచ్చిన ఆదాయంకూడా 3.3 శాతం పెరిగింది. జూన్‌త్రైమాసికంలో రూ.39,173 కోట్లుగాఉన్న ఆదాయం సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.40,475 కోట్లకు చేరింది. కంపెనీ వ్యాపార కార్యకలాపాల్లో కొనసాగుతున్నవృద్ధిని ఇది ప్రతిబింబిస్తోంది. నిర్వహణ పరంగా కూడా మంచి పనితీరు కనబరిచింది. వడ్డీ,పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు ఆదాయం 5.3 శాతంవృద్ధిచెంది రూ.20,901కోట్లకు చేరుకుంది.

# రిలయన్స్ లాభాల్లో 22% వృద్ధి
## రూ.25,548 కోట్లకు చేరిన నికర లాభం

**ముంబయి, అక్టోబరు 30:** రిలయన్స్ ఇండస్ట్రీస్ సెప్టెంబరు త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. ఆయిల్ టు కెమికల్స్ వ్యాపారం, డిజిటల్ సేవల విభాగాల్లో పెరిగిన ఆదాయాలు రిటైల్ విభాగం నిర్వహణ లాభాల్లో తగ్గుదలను భర్తీ చేశాయి. రిఫైనింగ్ వ్యాపారంలో మెరుగైన మార్జిన్లు, అధిక ఇంధన క్రాక్స్, ముడి చమురు సేకరణలో అనుకూల పరిస్థితులు కంపెనీకి కలిసివచ్చాయి. దీంతో త్రైమాసిక ఎబిడిటా రికార్డు స్థాయికి చేరింది. జూన్ త్రైమాసికంలో రూ.20,946 కోట్లుగా ఉన్న కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం సెప్టెంబర్ త్రైమాసికంలో 22 శాతం పెరిగి రూ.25,548 కోట్లకు చేరింది. మార్కెట్ విశ్లేషకుల అంచనా రూ.21,368 కోట్లను కూడా అధిగమించింది ఆదాయం 6.8 శాతం పెరిగి రూ.3.31 లక్షల కోట్లకు చేరింది ఎబిడిటా 19 శాతం వృద్ధితో రూ.56,616 కోట్లకు చేరింది. ఎబిడిటా మార్జిన్ 15.4 శాతం నుంచి 17.1 శాతానికి పెరిగింది. కంపెనీ నిర్వహణ లాభాల వృద్ధిలో ఆయిల్ టు కెమికల్స్ కీలక పాత్ర పోషించింది. డిజిటల్ సేవల విభాగం కూడా చందాదారుల సంఖ్య పెరగడం, ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం మెరుగుపడటంతో మంచి ఫలితాలను సాధించింది.

రిటైల్ విభాగం లాభాలు తగ్గడం, చమురుగ్యాస్ వ్యాపారంలో మందగమనం మొత్తం వృద్ధికి కొంత అడ్డంకిగా మారాయి సెప్టెంబరు 30 నాటికి రిలయన్స్ నికర రుణ భారం రూ.1.17 లక్షల కోట్లకు తగ్గింది. జూన్ చివరి నాటికి ఇది రూ.1.23 లక్షల కోట్లుగా ఉంది. నికర రుణం, ఎబిడిటా నిష్పత్తి కూడా 0.57 రెట్ల నుంచి 0.47 రెట్లకు మెరుగుపడింది. అంతర్గత నగదు నిల్వలు పెరగడం దీనికి ప్రధాన కారణంగా నిలిచింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ మూలధన వ్యయం రూ.38,153 కోట్లుగా నమోదైంది. కొత్త ఇంధన ప్రాజెక్టుల సామర్థ్య విస్తరణ, రిటైల్ నెట్‌వర్క్ అభివృద్ధి, వో2సి ప్రాజెక్టులపై రిలయన్స్ ఈ పెట్టుబడులను వెచ్చించింది. మొత్తంగా చూస్తే, వో2సి, డిజిటల్ వ్యాపారాల బలమైన పనితీరుతో రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభాలు, నిర్వహణ ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. అదే సమయంలో రుణ భారం తగ్గడం కంపెనీ ఆర్థిక స్థితి మరింత బలోపేతం కావడానికి దోహదపడింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.